www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## సెప్టెంబరులోనూ వానలు తక్కువే!

మధ్య కోస్తా, సీమలోని కొద్ది ప్రాంతాల్లోనే సాధారణ వర్షాలు

దేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో సగటు కంటే తక్కువ వానలు

పంటల సాగు, తాగునీరు, జల విద్యుత్‌పై తీవ్ర ప్రభావం: ఐఎండీ

12

## టాటా సంస్థకే సంజీవని

టెండర్ల పునఃపరిశీలన

అనంతరం ఎల్‌1గా ఎంపిక

జీఎస్టీతో కలిపి రూ.415.36

కోట్లకు టెండరు ఖరారు

12

మంగళవారం | 1-9-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 24 సంచిక (Issue) : 154

శ్రీ పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణ మాసం, బహుళ పక్షం, తిథి: చవితి ఉ.7:42 తదుపరి పంచమి, నక్షత్రం: అశ్విని రా.2:42 తదుపరి భరణి, వర్జ్యం: రా.10:49-12:22, దుర్ముహూర్తం: ఉ.8:32-9:22, పునః రా.10:14-10:59, అమృత ఘడియలు: రా.7:42-9:15, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:04, సూర్యాస్తమయం: 6:25, | అనంతపురము సిటీ**

Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam |Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# అందరివాడు ఆట ఆపేశాడు



ఫుట్‌బాల్‌తో పెద్దగా పరిచయం లేని వాళ్లు కూడా కాసేపు తన ఆట చూస్తే ఆ ఆటలో మజా ఏంటో అర్థమై ఆస్వాదించేలా చేయగల ఆకర్షణ కలిగినవాడు..
మైదానంలో పాదరసంలా కదలాడుతూ, అద్భుతమైన డ్రిబ్లింగ్ నైపుణ్యంతో ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించినవాడు..
కళ్లు చెదిరే ఫీల్డ్ గోల్స్‌తో ప్రపంచ రికార్డులు కొల్లగొట్టిన ఘనుడు..
తన మంత్రముగ్ధమైన ఆటతో యావత్ క్రీడాలోకాన్ని ఉర్రూతలూగించినవాడు..
మాటల్లో సౌమ్యుడు, చేతల్లో ఘనాపాఠిగా ఉంటూ అభిమానులకు అపరిమితమైన ఆనందాన్ని పంచిన అందరివాడు..
ఆటనే ప్రేమించి.. ఆటనే శ్వాసించి.. ఆటనే శాసించిన లియోనెల్ మెస్సీ.. ఇక చాలని సెలవు తీసుకొన్నాడు.

## అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

**బ్యూనస్ ఎయిర్స్:** అర్జెంటీనా ఫుట్‌బాల్ గ్రేట్ లియోనెల్ మెస్సీ (39) అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాలపాటు అర్జెంటీనాకు ప్రాతినిథ్యం వహించిన మెస్సీ. జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్టు సోమవారం స్పానిష్ భాషలో తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. రికార్డు స్థాయిలో దేశం తరఫున ఆరు వరల్డ్‌కప్‌లు ఆడాడు. 2016లో కోపా కప్ ఫైనల్లో ఓటమి తర్వాత విమర్శలకు తట్టుకోలేక తొలిసారి రిటైర్మెంట్ ప్రకటించిన మెస్సీ.. అభిమానుల విజ్ఞప్తితో పునరాగమనం తర్వాత అంతా స్వర్ణ యుగమే. మెస్సీ సారథ్యంలో 2022లో కతార్‌లో జరిగిన సాకర్ ప్రపంచకప్‌లో అర్జెంటీనాను విజేతగా నిలవగా.. 2026 మెగా టోర్నీ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓడింది. అయితే, తుది పోరులో ఓడిన రెండు రోజుల తర్వాత తన రిటైర్మెంట్ లేఖను రాసినట్టు మెస్సీ తెలిపాడు. కానీ, తన తండ్రి జార్జ్ మెస్సీ అనారోగ్యం, ఆయన మృతి కారణంగా బహిర్గతపర్చడానికి సమయం తీసుకొన్నట్టు తెలిపాడు. కాగా, క్లబ్ సాకర్‌లో లియోనెల్ మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు ఇంటర్ మయామి కెప్టెన్‌గా ఉన్నాడు. మరో రెండేళ్లపాటు ఆ క్లబ్‌తో అతడికి అగ్రిమెంట్ ఉంది.

'ఫైనల్ ముగిసిన ఇన్ని రోజుల తర్వాత, ఎంతో ఆలోచించిన తర్వాత, జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటించాలనే నా నిర్ణయాన్ని మీకందరికి తెలియజేస్తున్నా. ఇది ఎంతో బాధ కలిగించే నిర్ణయమే అయినా.. అందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా. అర్జెంటీనా జెర్సీ కోసం సర్వస్వం ధారపోశా. జట్టుతో కలసి దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించా. అర్జెంటీనా ప్రజలను గర్వపడేలా చేయడం ఎప్పుడూ ఆనందమే. ఇక, సమయం తరిగిపోతుంది. కొన్ని అధ్యాయాలు ముగిసిపోనున్నాయి.

### సర్వం ధారపోశా..
**లియోనెల్ భావోద్వేగ లేఖ**

దేశానికి ప్రాతినిథ్యం వహించడం నాకు ఎంతో ఇష్టం. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశా. ఇక నా వద్ద ఏమీ మిగల్లేదు. ఎంతో మంది ప్రతిభగల యువ ఆటగాళ్లు దూసుకొస్తున్నారు. వారికి ఇదే తగిన సమయం. 20 ఏళ్లుగా అందించిన ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. ఇకపై జాతీయ జట్టుకు బయట నుంచి అభిమానించే వ్యక్తిగా ఉంటా. కుటుంబం, కోచ్, సహచరులు, జట్టు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. చిరస్మరణీయ జ్ఞాపకాలను నాతో తీసుకెళ్తున్నా. నా సహచరులతో కలసి ఒకప్పుడు కలలు కన్న క్షణాలను.. మీకు అందించామనే సంతృప్తితో సగర్వంగా నిష్క్రమిస్తున్నా. అర్జెంటీనావాడిగా నన్ను పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు. లెట్స్ గో అర్జెంటీనా..'
- లియోనెల్ మెస్సీ

# యుగానికొక్కడు

ఎదుగుదల లోపంతో ఏమైపోతాడో? అనుకొన్నవాడు.. తన ఆటతో రెండు దశాబ్దాలపాటు కోట్లాది మంది అభిమానుల హృదయాలను కొల్లగొట్టాడు. కష్టాలకు ఎదురీదాడు.. పట్టుదలతో పోరాడాడు.. ఓర్పుతో నేర్చాడు.. సాకర్ చరిత్రలో మహోన్నత శిఖరంగా నిలిచాడు.

## ఓ శకం ముగిసింది!

మెస్సీ మేనియా దాదాపు రెండు దశాబ్దాలపాటు ప్రపంచాన్ని ఊపేసింది. బార్సిలోనా తరఫున మెరుపులు మెరిపించిన మెస్సీ.. 2004లో అర్జెంటీనా అండర్-20 జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. అప్పుడు అతడి ఆట విశ్లేషకులను ఎంతగానో ఆకట్టుకొంది. 2005లో 18 ఏళ్ల వయసులో జాతీయ జట్టులోకి వచ్చిన లియోనెల్.. క్రమంగా జట్టు మూలస్తంభంగా మారాడు. 2006 ప్రపంచ కప్‌లో తొలిసారి అర్జెంటీనాకు ప్రాతినిథ్యం వహించాడు. 2009లో జువాన్ రోమన్ రిక్వెల్మీ రిటైర్మెంట్‌తో నెం:10 జెర్సీ మెస్సీకి వచ్చింది. ఇక, 2010 ఫిఫా వరల్డ్‌కప్ అర్జెంటీనా జట్టును మెస్సీ కేంద్రంగా కోచ్ మారడోనా తయారు చేశాడు.

**చేదు అనుభవాలు..**

జాతీయ జట్టు అర్జెంటీనా తరఫున మాత్రం ఎన్నో చేదు అనుభవాలు. 2007 కోపా కప్‌లో ఓటమి.. 2014 వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి మెస్సీని తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. 2015, 2016 కోపా కప్‌లో కూడా పరాజయాలతో.. తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అతడిని జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ బలంగా వినిపించింది. తల్లడిల్లిపోయిన లియోనెల్ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు.

**శూన్యం నుంచి..**

మెస్సీ దూరం కావడంతో ఒక్కసారిగా అర్జెంటీనా జట్టులో శూన్యం ఆవరించింది. తట్టుకోలేక పోయిన ఫ్యాన్స్.. మళ్లీ తిరిగి రావాలని కోరారు. అభిమానుల కోరికను మెస్సీ మన్నించడం అతడి జీవితంలో.. కెరీర్‌లో ఓ మేలి మలుపు. ఎక్కడైతే పోగొట్టుకొన్నారో.. అక్కడే వెతుక్కోమన్నట్టుగా రీఎంట్రీలో మెస్సీ తననుతాను సరికొత్తగా ఆవిష్కరించుకొన్నాడు. 2021లో మరకాన స్టేడియంలో కోపాకప్‌ను అతడు ముద్దాడడం ఫుట్‌బాల్ చరిత్రలోనే భావోద్వేగ సందర్భం. అర్జెంటీనాకు ట్రోఫీ అందించడంతో అతడికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

**'ఎడారి'లో దాహం తీరింది..**

2022 కతార్‌లో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్.. ఒక రకంగా మెస్సీకి చివరి అవకాశం అని భావించారు. మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే సౌదీ అరేబియా చేతిలో ఓటమి. ఇంత గొప్ప ఆటగాడి కెరీర్ వరల్డ్‌కప్‌ను అందుకోకుండానే ముగుస్తుందా? అనే నిర్వేదం. కానీ, డీలా పడిన జట్టులో స్ఫూర్తిని రగిల్చిన మెస్సీ.. వరుస విజయాలతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఫ్రాన్స్‌తో టైటిల్ ఫైట్‌లో డ్రామా నడిచినా.. షూటౌట్‌లో అర్జెంటీనాను గెలిపించిన మెస్సీ.. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్'గా తనపేరును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకొన్నాడు. 2024లో మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా మరోసారి కోపా అమెరికా కప్ విజేతగా నిలవగా.. 2026 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనాను లియోనెల్ మరోసారి ఫైనల్‌కు చేర్చాడు.

**కుటుంబం..**

మెస్సీ తన చిన్ననాటి స్నేహితురాలు ఆంటో నెలా రొకుజోను కొన్నాళ్ల సహజీవనం అనంతరం 2017 జూలైలో పెళ్లాడాడు. వారికి ముగ్గురు సంతానం. పెద్దకొడుకు థియాగో మెస్సీ 2012లో, రెండో కుమారుడు మాటెయో మెస్సీ 2015లో, మూడో కొడుకు సిరో మెస్సీ 2018లో జన్మించారు. ఇక మెస్సీ తండ్రి జార్జ్ ఈ మధ్యే మృతిచెందారు. మెస్సీకి తల్లి, ఇద్దరు అన్నలు, ఓ చెల్లెలు ఉన్నారు.

మారడోనాతో..

## ఆటను శాసించాడు

అలనాటి దిగ్గజం పీలే, తరువాతి తరం హీరో డీగో మారడోనా..ప్రస్తుత స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కాదని లియోనెల్ మెస్సీయే సాకర్ 'ఆల్‌టైమ్ గ్రేట్' అనేందుకు లెక్కకు మిక్కిలి ఉదాహరణలున్నాయి..రెండు నెలల కిందట జరిగిన ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మెస్సీ చేసిన మాయాజాలాన్ని మరువగలమా ! మెగా టోర్నమెంట్‌లో కెప్టెన్‌గా ఒంటిచేత్తో జట్టుకు విజయాలు అందించాడు..అల్జీరియాతో ఆరంభ మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అదరగొట్టాడు..ఆస్ట్రియాపై రెండు గోల్స్‌తో అద్భుతం చేశాడు..మెగా టోర్నీలో అత్యధికంగా 18 గోల్స్‌తో ఆల్‌టైమ్ గ్రేట్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు..జోర్డాన్‌తో పోరులో కళ్లు చెదిరే ఫ్రీకిక్‌తో కొట్టిన గోల్‌ను ఏమని వర్ణించగలం ? ప్రీక్వార్టర్స్‌లో ఈజిప్టుతో, క్వార్టర్స్‌లో స్విట్జర్లాండ్‌తో, సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో నరాలు తెగే ఉత్కంఠభరిత మ్యాచ్‌లలో జట్టును నడిపించి, గెలిపించిన తీరు మెస్సీకే చెల్లు..

అంతర్జాతీయ పోటీలలో ఇకపై లియోనెల్ మెస్సీ మెరుపులను చూడలేకపోవచ్చు. కానీ క్లబ్ సాకర్‌లో 39 ఏళ్ల అర్జెంటీనా సూపర్ స్టార్ ఆటను కనులారా వీక్షించవచ్చు. రెండు దశాబ్దాల తన కెరీర్‌లో ఫుట్‌బాల్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిన ఘనత మెస్సీది. స్వయంగా గోల్స్ కొట్టడంలో ఎంత మేటో..సహచరులు గోల్స్ సాధించేలా అవకాశాలు సృష్టించడంలో మెస్సీ అంతకు మించిన మొనగాడు. ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఊపేసిన మెస్సీ..అసలు సాకర్‌కే పనికిరాడని స్వస్థలం రొసారియో కోచ్‌లు పొమ్మన్నారు. 'పొట్టిగా ఉన్నావు. ఈ ఆటకేం సరిపోతావు' అని ఎద్దేవా చేశారు. పైగా..11 ఏళ్ల వయసులో హార్మోన్ ఎదుగుదల లోపం బయటపడడం మెస్సీకి ప్రతికూలమైంది. కానీ అమ్మమ్మ సెలియా ఒలివేరాకు మనవడు మెస్సీ ప్రతిభపై ఎనలేని నమ్మకం. ఆ విశ్వాసంతో కోచ్‌లను ఒప్పించి మనవడికి శిక్షణ ఇప్పించింది. ఈ తరుణంలో అమ్మమ్మ మరణించడం అతడిని తీరని విషాదంలోకి నెట్టింది. అయితే తనను గొప్ప సాకర్ ఆటగాడిగా చూడాలన్న అమ్మమ్మ స్వప్నం నెరవేర్చే లక్ష్యంతో మెస్సీ ఆ విషాదాన్ని దిగమింగాడు. లియోనెల్ సాకర్ స్టార్‌గా ఎదగడంలో బార్సిలోనా క్లబ్‌ది కీలక పాత్ర. మిగతా క్లబ్‌లన్నీ నో చెప్పిన వేళ..మెస్సీని తమ క్లబ్‌లో చేర్చుకొని అతడి అనారోగ్యానికి చికిత్స ఇప్పించడంతోపాటు సాకర్ ప్లేయర్‌గా తీర్చిదిద్దింది. 2004లో 17 ఏళ్ల వయస్సులో బార్సిలోనా తరపున పోటీ సాకర్‌లోకి అడుగుపెట్టిన మెస్సీ, 2005లో హంగేరి జట్టుపై అర్జెంటీనాకు అరంగేట్రం చేశాడు. ఆపై ప్రపంచ ఫుట్‌బాల్‌పై చెరగని ముద్ర వేశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

**కెరీర్ ఘనతలు..**

- అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున 207 మ్యాచ్‌ల్లో 125 గోల్స్ చేశాడు.
- 8 సార్లు బాలన్ డీ ఓర్ అవార్డులు.
- తన కెప్టెన్సీలో అర్జెంటీనాకు ఓ ప్రపంచ కప్ (2022).
- తన సారథ్యంలో రెండు కోపా అమెరికా టైటిళ్లు (2021, 2024).
- ఒలింపిక్ క్రీడల (2008 బీజింగ్) స్వర్ణం.
- ఆరుసార్లు యూరోపియన్ గోల్డెన్ బూట్ అవార్డు.
- అత్యధిక మ్యాచ్‌లకు (133) కెప్టెన్సీ ఘనత.
- పది పర్యాయాలు హ్యాట్రిక్ గోల్స్.

## హైదరాబాద్‌తో అనుబంధం

భారత పర్యటనలో భాగంగా గత ఏడాది డిసెంబరు 13న మెస్సీ హైదరాబాద్‌కు విచ్చేశాడు. మెస్సీ రాకను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం అతడికి ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేసి.. ఔరా అనిపించింది. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో బస చేసిన మెస్సీ, తొలుత అక్కడ కొద్ది మంది అభిమానులతో ఫొటోలు దిగాడు. అనంతరం ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మెస్సీ కొద్దిసేపు ఆడడం ఈ పర్యటనకే హైలైట్‌గా నిలిచిపోయింది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పలువురు సెలెబ్రిటీలు ఉప్పల్ స్టేడియానికి తరలి వచ్చారు. మ్యాచ్ అనంతరం మెస్సీ స్టేడియం మొత్తం తిరుగుతూ తన కోసం వచ్చిన అభిమానులకు అభివాదం చేశాడు. ఆతర్వాత స్టేడియంలోనే యువ క్రీడాకారులతో కొద్దిసేపు ముచ్చటించి, వారికి కొన్ని సలహాలు కూడా ఇచ్చాడు.

**ఆఖరి మ్యాచ్ అలా..**

కెరీర్‌లో తానాడిన చివరి అంతర్జాతీయ మ్యాచ్ 39 ఏళ్ల మెస్సీకి తీవ్ర నిరాశను మిగిల్చింది. ఈ ఏడాది జూలై 19న స్పెయిన్‌తో జరిగిన ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో లియోనెల్ చివరిసారిగా బరిలోకి దిగాడు. ఆ మ్యాచ్‌లో అర్జెంటీనా సరికొత్త జెర్సీతో దిగింది. చివరికి 0-1తో ఓటమిపాలైంది. ఈ వరల్డ్‌కప్‌లో 8 గోల్స్, 4 అసిస్ట్‌లు చేసిన మెస్సీకి రెండో అత్యుత్తమ ఆటగాడికిచ్చే సిల్వర్‌బాల్ అవార్డు లభించింది. ఫ్రాన్స్ సూపర్‌స్టార్ ఎంబప్పేకి గోల్డెన్ బాల్ అవార్డు దక్కింది.

**అచ్చం సచిన్‌లాగే!**

క్రికెట్ దిగ్గజం సచిన్‌కు, ఫుట్‌బాల్ గ్రేట్ మెస్సీల ప్రపంచకప్ విజయాల్లో కొన్ని పోలికలున్నాయి. సచిన్ పదో నెంబర్ జెర్సీని ధరిస్తే.. మెస్సీది కూడా అదే నెంబర్ జెర్సీ. 2003 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఓటమిపాలైన సచిన్.. ఎనిమిదేళ్ల తర్వాత 2011లో విశ్వకప్‌ను అందుకున్నాడు. అలాగే 2014 ప్రపంచకప్ తుది పోరులో రన్నరప్‌నకు పరిమితమైన మెస్సీ.. సరిగ్గా ఎనిమిదేళ్ల అనంతరం 2022లో విశ్వవిజేతగా నిలిచాడు. ఇలా, వేర్వేరు క్రీడల్లో ఇద్దరు అత్యుత్తమ ఆటగాళ్ల మధ్య పోలికలుండడం విశేషమే కదా!

---

## హార్దిక్, నితీశ్ ఫిట్!

**సుందర్ కూడా ● అఫ్ఘాన్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధం**

హార్దిక్

**బెంగళూరు:** అఫ్ఘానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు భారత్‌కు శుభవార్త. గాయాలతో బాధపడుతూ పునరావాస శిబిరంలో ఉంటున్న హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్ కోలుకుంటున్నారు. జట్టు ఎంపిక కోసం జాతీయ సెలెక్టర్లు ఈ వారంలో సమావేశం కానున్నారు. ఈనేపథ్యంలో హార్దిక్, నితీశ్ పేర్లను పరిగణనలోకి తీసుకోనున్నారు. హార్దిక్ తన మకాంను ముంబై నుంచి బెంగళూరుకు మార్చిన విషయం తెలిసిందే. అటు ప్రస్తుతం చెన్నైలో ఉన్న సుందర్ జట్టు సెలెక్షన్‌కన్నా ముందే సీఓఈలో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరయ్యే అవకాశం ఉంది.

**ఆసియా క్రీడలకు బుమ్రా:** అఫ్ఘాన్‌తో సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉండేది సందేహంగా మారింది. గాయం నుంచి కోలుకుంటున్న అతను ప్రస్తుతం సీఓఈలోనే ఉన్నాడు. అయితే ఆసియాకప్‌నకు బుమ్రా ఎంపికయ్యే అవకాశం ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

## జొకోకు ఝలక్

**అర్జెంటీనా యువ ఆటగాడి చేతిలో ఓటమి ● యూఎస్ ఓపెన్**



తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం

మరీనో నవోన్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. నాలుగో సీడ్ నొవాక్ జొకోవిచ్ (39)కు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో జొకో 6-7(5), 7-5, 6-4, 2-6, 1-6తో మరీనో నవోన్ (అర్జెంటీనా) చేతిలో ఐదుసెట్లపాటు పోరాడి ఓడాడు. 4 గంటల 36 నిమిషాలపాటు సాగిన మారథాన్ మ్యాచ్‌లో జొకో కండరాల నొప్పులతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డాడు. అంతేకాకుండా మ్యాచ్ ముగిసిన తర్వాత కన్నీటి పర్యంతమయ్యాడు. యూఎస్ ఓపెన్‌లో నొవాక్ తొలిరౌండ్‌లోనే వెనుదిరగడం అతడి కెరీర్‌లో ఇదే మొదటిసారి. మరోవైపు 25 ఏళ్ల నవోన్ కెరీర్‌లో ఈ ఏడాదే తొలి ఏటీపీ టైటిల్ నెగ్గాడు. ఇతర మ్యాచ్‌ల్లో 15వ సీడ్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్) 6-4 6-2, 3-6, 6-1తో జె ఉల్ఫ్ (అమెరికా)పై, జైమ్ ఫరియా 6-3, 7-6(4), 4-6, 1-6, 6-2తో జాన్సన్ బ్రూక్స్‌బైపై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో 9వ సీడ్ ఎలెనా స్విటోలినా 6-1, 6-2తో సోలాన్ సియర్రా (అర్జెంటీనా)ను, కరోలినా ప్లిస్కోవా (చెక్) 2-6, 7-5, 6-3తో హన్నే వాండవింకిల్‌ను, 18వ సీడ్ ఎకటరీనా అలెగ్జాండ్రోవా 6-2, 6-2తో మెకార్తీ కెస్లర్‌ను ఓడించారు. కాగా, వీనస్ విలియమ్స్ 2-6, 6-7(6) సోఫియా కెనిన్ చేతిలో పరాజయం పాలైంది.

## వైభవ్ సెంచరీ మిస్

**దులీప్ ట్రోఫీ**

**ఈస్ట్‌జోన్ 266 ఆలౌట్**
**నార్త్‌పై తిలక్‌వర్మ శతకం**

వైభవ్ (92)

**బెంగళూరు:** ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో చెలరేగాడు. ఎడాపెడా షాట్లతో తన శైలిలో పరుగులు రాబట్టాడు. అయితే కొద్దిలో శతకం కోల్పోయాడు. సెంట్రల్ జోన్‌తో మ్యాచ్‌లో..సోమవారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్‌జోన్ 266 పరుగులకు ఆలౌటైంది. వైభవ్ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92), మరో ఓపెనర్ అభిమన్యు (69) మొదటి వికెట్‌కు 161 పరుగులు జోడించారు. ఆపై సెంట్రల్‌జోన్ బౌలర్లు విజృంభించడంతో ఈస్ట్‌జోన్ 266 పరుగులకే చేతులెత్తేసింది. సెంట్రల్‌జోన్ మొదటి ఇన్నింగ్స్‌లో 266 రన్స్ చేసిన విషయం విదితమే. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన సెంట్రల్‌జోన్ రెండో రోజు ఆఖరికి 45/3తో ఆడుతోంది.

**సూర్యవంశీ రికార్డు పుటల్లో:** అతి పిన్న వయస్సు (15 సంవత్సరాల 157 రోజులు)లో దులీప్ ట్రోఫీలో అర్ధ శతకం సాధించిన బ్యాటర్‌గా వైభవ్ రికార్డుల కెక్కాడు. ఈక్రమంలో 57 ఏళ్లనాటి(1969) లక్ష్మణ్ సింగ్ (16 ఏళ్ల 23 రోజులు) పేరిట ఉన్న రికార్డును దాటేశాడు.

తిలక్ వర్మ (106 బ్యాటింగ్)

**సౌత్‌జోన్ 285/9:** కెప్టెన్ తిలక్ వర్మ (106 బ్యాటింగ్) శతకబాదడంతో నార్త్‌జోన్‌తో సెమీఫైనల్లో సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకుంది. కిందటి రోజు స్కోరు 40/2తో సోమవారం, మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్‌జోన్ ఆట ముగిసే సరికి 285/9 పరుగులు చేసింది. తిలక్, గోపాల్ (87) ఆరో వికెట్‌కు 175 పరుగులు జోడించారు. నార్త్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.

## బరిలో లక్ష్య, సాత్విక్ జోడీ

**చైనా మాస్టర్స్ నేటి నుంచి**

**షెన్‌ఝెన్:** వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో అనామక ఆటగాడి చేతిలో కంగుతిన్న ఏస్ షట్లర్ లక్ష్య సేన్ మంగళవారం నుంచి జరిగే చైనా మాస్టర్స్‌లో టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగనున్నాడు. శ్రీకాంత్ కూడా బరిలో నిలవనున్నాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, తన్వీ శర్మ, దేవిక సిహాగ్ సత్తా చాటాలనుకొంటున్నారు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, అర్జున్-హరిహరన్, మిక్స్‌డ్‌లో కపిల-తనీషా, రోహన్ కపూర్-రుత్విక జోడీలు ఆడనున్నాయి.

## పారా ప్యాడ్లర్ల పతక మోత

**న్యూఢిల్లీ:** ఫిన్లాండ్ జరిగిన పారా టేబుల్ టెన్నిస్‌లో భారత ఆటగాళ్లు 16 పతకాలతో దుమ్ము రేపారు. 6 స్వర్ణ, 4 రజత, 6 కాంస్యాలతో పోటీలను ఘనంగా ముగించారు. సింగిల్స్ విభాగాలలోనే 10 పతకాలు కొల్లగొట్టారు. డబుల్స్‌లో 2 స్వర్ణ, ఒక రజత, 3 కాంస్యాలు లభించాయి.

www.andhrajyothy.com
అనంతపురము సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## మెస్సీ శకం ముగిసింది

- అంతర్జాతీయ కెరీర్‌కు లియోనెల్ మెస్సీ గుడ్‌బై
- అధికారికంగా ప్రకటించిన అర్జెంటీనా స్టార్
- జాతీయ జట్టు తరఫున 207 మ్యాచ్‌లలో 125 గోల్స్
- రెండు దశాబ్దాలకుపైగా కెరీర్‌లో ఎన్నో ఘనతలు, రికార్డులు
- సాకర్ దిగ్గజంగా, ప్రపంచకప్ సాధించిన కెప్టెన్‌గా ఖ్యాతి

11

మంగళవారం 1-9-2026
Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupati | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajahmahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వెలిగొండలో జల సవ్వడి

నిర్వాసిత రైతులతో కలిసి కృష్ణా జలాలను ఫీడర్ కెనాల్‌కు విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు

# కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర

## వెలిగొండ.. బంగారుకొండ: సీఎం.. ప్రాజెక్టు తొలి దశ జాతికి అంకితం

ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నాను. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భావి తరాల అభివృద్ధి కోసమే పనిచేస్తున్నాను. ఇదే కూటమి సిద్ధాంతం కూడా.
2019లో గొడ్డలి పార్టీ రాకతో వెలిగొండకు గ్రహణం పట్టింది. తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక అది వీడిపోయింది. ప్రాజెక్టును ప్రారంభించుకున్నాం. - సీఎం చంద్రబాబు

2 టన్నెల్స్.. 18 కి.మీ. కృష్ణమ్మ పరుగు

18 కి.మీ. టన్నెల్స్ గుండా ప్రయాణించి వెలిగొండ ఫీడర్ కెనాల్ దిశగా తరలుతున్న కృష్ణమ్మ

- ఫీడర్ కెనాల్ వద్ద కృష్ణమ్మకు శాస్త్రోక్తంగా జలహారతి
- కొండలు తొలిచి నీటిని తీసుకొచ్చాం
- కరువుతో పోరాడిన ఫ్లోరైడ్ బాధితుల మార్కాపురం గడ్డకు ఇక విముక్తి
- 3 దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేశా
- ఇప్పుడు నేనే ప్రారంభోత్సవం చేశా
- 2019లో గొడ్డలి పార్టీ రాకతో గ్రహణం
- వెలిగొండను పూర్తిగా గాలికొదిలేశారు
- 4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో పెట్టారు
- ఎన్నికల ముందు ప్రారంభమంటూ డ్రామాలు
- కూటమి రాకతో ఆ గ్రహణం వీడింది
- నల్లమల సాగర్‌కు గోదారినీ తెస్తాం: సీఎం
- జలవనరుల మంత్రి నిమ్మలపై పొగడ్తలు
- పూల సుబ్బయ్య కుమార్తెకు సత్కారం

కృష్ణమ్మకు సీఎం హారతి

వెలిగొండ సభలో ప్రజలతో కలిసి ఆకుపచ్చ కండువా తిప్పుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నిమ్మల, దుర్గేశ్

ఒంగోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 'శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయల్దేరిన కృష్ణమ్మ.. చెన్నకేశవుడు కొలువై ఉన్న మార్కాపురం నేలకు హారతి ఇస్తోంది. కరువు నేలకు కృష్ణమ్మను తెచ్చాం. ఇదీ మా నిబద్ధత' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తరాలుగా నష్టపోయిన ఈ ప్రాంతాన్ని ఆదుకునే అవకాశాన్ని భగవంతుడు తనకిచ్చాడని ఒకింత భావోద్వేగంతో అన్నారు. వెలిగొండ.. బంగారుకొండ అని.. ఈ ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని చెప్పారు. కృష్ణమ్మ నీటినే కాక నల్లమల సాగర్ (వెలిగొండ రిజర్వాయర్)కు గోదావరి జలాలను కూడా తెస్తామని ప్రకటించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా.. ప్రత్యేకించి ప్రస్తుత మార్కాపురం జిల్లాతోపాటు నెల్లూరు, కడప జిల్లాల పరిధిలో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను దోర్నాల మండలం గంటావానిపల్లి వద్ద ముఖ్యమంత్రి సోమవారం

మిగతా 11వ పేజీలో...

## రేపే అనకాపల్లికి గోదారి

తుని సమీపంలో నిర్మించిన అక్విడెక్టు వద్ద సీఎం జలహారతి

- అనంతరం గేట్లెత్తి నీటి విడుదల
- తొలి దశలో 1,48,000 ఎకరాలకు నీరు
- 2,87,320 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- 143 గ్రామాలకు చెందిన 4.23 లక్షల మందికి తాగునీరు
- పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి తొలిఅడుగు
- మలి దశలో విశాఖకు నీరు
- ఆ తర్వాత చీపురుపల్లి గడిగెడ్డ వరకు
- అంచనా వ్యయం రూ.17,050 కోట్లు

12

## టెన్త్ సర్టిఫికెట్లపై క్యూఆర్ కోడ్

2025-26 మార్కుల మెమోలపై ముద్రణ
స్కాన్ చేసి వివరాలు ధ్రువీకరించుకునే చాన్స్

10

10

## ప్రాణం తీసిన మందార పువ్వు

గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి.. అనంతలో విషాదం

## పంచాయతీల్లో 650 మందికి ఒక బూత్

1.36 లక్షల పోలింగ్ బూత్‌ల గుర్తింపు

7

## 212 కోట్లతో లోక్‌భవన్

12

- అమరావతిలో నిర్మాణానికి నిధులు విడుదల
- గవర్నర్ నివాసం, కార్యాలయం, అసెంబ్లీ దర్బార్
- అదే కాంపౌండ్‌లో సిబ్బంది క్వార్టర్లు కూడా
- ఏపీసీఆర్డీఏకు నిర్మాణ బాధ్యతలు

9

## రాహుల్‌పై ఎఫ్ఐఆర్

- కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారంటూ 'శ్రీరామ్‌సేన' సభ్యుడి ఫిర్యాదు
- పలు అభియోగాలతో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు
- కేసులు నా ఛాతీపై పతకాల వంటివి: రాహుల్
- ఖర్గేను అవమానించిందే గాంధీ కుటుంబం: బీజేపీ

పీఎంఏవై 2.0 కింద 17,912 ఇళ్లు
పరిపాలనా అనుమతులు జారీ

10

గ్రామీణ రోడ్లకు మరో రూ.81.93 కోట్లు
అదనపు నిధులు మంజూరు

అనలాగ్ పన్నీర్‌పై జొమాటో నిషేధం

9

స్వచ్ఛమైన డెయిరీ ఉత్పత్తులను వాడకుంటే తొలగిస్తామని వెల్లడి

9

మనీలాండరింగ్ కేసుల్లో ప్రతి రూ.100కు ఒక్క రూపాయే రికవరీ!
చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ వెల్లడి

# ఆ సంఘం నేత శాసిస్తాడు

- పదోన్నతుల్లో ఉన్నతాధికారుల వింత పోకడ
- ఓ వైపు 'సర్'.. మరోవైపు ఖరారుకాని సీనియారిటీ
- అయినా ఆ నేత అనుచరులకు తహసీల్దార్ చాన్స్
- హైకోర్టు ఆదేశాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు బేఖాతర్
- పదేపదే పదోన్నతుల కోసం ఫైలు
- డీటీల సీనియారిటీ ఫిక్స్ కాకుండానే జాబితా సిద్ధం

## రెవెన్యూ బాస్‌లు పాటిస్తారు

ఆ ఉద్యోగ సంఘం నేత అనుచరులకు, వారు సిఫారసు చేసిన మరికొందరికి ఉన్నపళంగా తహసీల్దార్లుగా పదోన్నతులు ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది. దీనికోసం రాష్ట్రపతి ఉత్తర్వులు, ప్రభుత్వ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్న వైనం రెవెన్యూ శాఖలోనే చర్చనీయాంశంగా మారింది. తమ అనుమతి లేకుండా జోనల్, మల్టీ జోనల్ పోస్టుల పదోన్నతులు ఇవ్వకూడదని సాధారణ పరిపాలన శాఖ, ఆర్థిక శాఖలు స్పష్టంగా తెలిపినా, విషయం ముందుకు కదులుతోంది. మొత్తం వ్యవహారంలో ఓ ఉద్యోగ సంఘం నేత ఒత్తిళ్లు ఉన్నతాధికారులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని, సీసీఎల్ఏ కార్యాలయంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఆయన 'సొంత మనిషి' మొత్తం మంత్రాంగం నడుపుతున్నారని సమాచారం.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూశాఖలో 100 తహశీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దార్‌లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారానే ఆ పోస్టులు భర్తీ చేయాలి. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (సర్) నడుస్తోంది. కాబట్టి అది పూర్తికాకుండా, ముందుగానే పదోన్నతులు, బదిలీలను చేపట్టడం సరైంది కాదని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు, పలు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ల సీనియారిటీని ఖరారు చేయాలి. రెవెన్యూశాఖ 2014-15 నుంచి 2017-18 వరకే డీటీల సీనియారిటీని ఖరారుచేసి ఇటీవల 300 మందికి

మిగతా 12వ పేజీలో...

## ఢిల్లీలో మరో 'నిర్భయ' కాండ

- కదులుతున్న బస్సులో ఇంటర్ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం
- అఘాయిత్యానికి పాల్పడిన కండక్టర్, డ్రైవర్
- తల్లి చీవాట్లతో అలిగి బంధువుల ఇంటికి బయల్దేరిన యూపీకి చెందిన విద్యార్థిని
- గమ్యస్థానానికి ముందే బస్సు దిగిన బాలిక
- మాయమాటలు నమ్మి మరో బస్సులోకి.. దాంట్లోనే దారుణం
- నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసిన పోలీసులు
- ఆగస్టు 4న ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి
- ఢిల్లీలో నర్సరీ చదివే చిన్నారిపై పాఠశాల బస్సు డ్రైవర్ లైంగికదాడి

9

## విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- కీలకమైన ఈ రంగాలపై ప్రభుత్వం దృష్టి
- ఇందుకు కలిసి పనిచేద్దాం: మంత్రి లోకేశ్
- విశాఖలో ఏఐజీ ఆస్పత్రికి శంకుస్థాపన
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చిరునామాగా వర్ణన
- డాక్టర్ నాగేశ్వరరెడ్డి అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని ప్రశంస
- అన్నివిధాలా సహకారం అందిస్తామని హామీ

విశాఖను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: నాగేశ్వరరెడ్డి

సోమవారం విశాఖలో ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి లోకేశ్, ఆస్పత్రి చైర్మన్ డి.నాగేశ్వరరెడ్డి

10

## కసిరెడ్డి కస్టడీపై సీరియస్‌గా ఉన్నారా?

- కోర్టు అనుమతి వచ్చాక విచారణకు సిద్ధంగా లేమంటే ఎలా?
- ఏపీ మద్యం కేసులో సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి
- రెండేళ్లుగా ఏం చేస్తున్నారని ఆగ్రహం

10

రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు నోటీసులు.. విచారణ 15వ తేదీకి వాయిదా

## మహిళలు వేదికెక్కితే మహా వినాశనం!

9

- వారు ఇంటికే పరిమితం కావాలి
- ఖురాన్ కూడా ఇదే చెబుతోంది
- అందుకే ఇస్లాంలో 'పరదా' సంస్కృతి
- మత పెద్ద కాంతాపురం వ్యాఖ్యలు
- ఆ కాలం పోయింది.. తెలుసుకోండి
- కేరళం మహిళా నేతల ఆగ్రహం
- మతాలన్నింటిలో ఇస్లాం పవిత్రమైనది
- కర్ణాటక మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు
- భగ్గుమన్న హిందూ సంఘాలు
- వెనక్కి తగ్గిన బసవరాజరాయరెడ్డి

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

## పచ్చి దోపిడీ..!

వెనెజువెలాలో 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు తమ అధీనంలోకి వచ్చే ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందంగా దీనిని అభివర్ణించారాయన. ఒక అర్థరాత్రివేళ అమెరికన్ సైనికబలగాలు విమానాల్లో దిగి, వందలాదిమంది వెనెజువెలా భద్రతా దళాలను కాల్చిచంపి, ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అపహరించుకుపోయి అమెరికా జైళ్ళలో కుక్కిన ఎనిమిది నెలల్లోనే ట్రంప్ అసలు లక్ష్యం నెరవేరడం మొదలైందన్నమాట.

అరవై ఐదు బిలియన్ బ్యారెళ్ళ చమురు నిల్వలున్న ఈ క్షేత్రాల పరిమాణం వెనెజువెలా మొత్తం చమురు క్షేత్రాల్లో ఐదోవంతు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న ఈ దేశంలోని క్షేత్రాలు పూర్తిగా అమెరికా నియంత్రణలోకి పోవడం ఇక ఎంతో దూరంలో లేదని అర్థం. అమెరికా సన్నిహితుడైన వెనెజువెలా వ్యాపారవేత్త అలెజాండ్రో బెటన్‌కోర్ట్ ఈ పదిహేడు క్షేత్రాల నుంచి తైలం తవ్వితీయబోతున్నారని, ఈ దెబ్బతో ఆయన కంపెనీ 'నార్త్ అమెరికన్ బ్లూ ఎనర్జీ పార్ట్‌నర్స్' ఆ దేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేటు చమురు కంపెనీగా అవతరిస్తుందని ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక అంటోంది. ఈ భారీ చమురు ఒప్పందంలో పెంటగాన్‌కూ వాటా దక్కబోతున్నదని, దాని 'ఆఫీస్ ఆఫ్ స్ట్రాటజిక్ క్యాపిటల్' (ఓఎస్‌సీ) పెన్నీవారెంట్‌తో అంటే, దాదాపు సున్నా పెట్టుబడితో 35శాతం వాటాని, ఉత్పత్తికి వ్యయానికే ఐదోవంతు చమురునూ కొనుగోలు చేయగలిగే హక్కులను పొందబోతున్నట్టు ఆ పత్రిక విశ్లేషించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, డోనాల్డ్ ట్రంప్ తన 200వ కార్యనిర్వాహక ఆదేశంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా నామకరణం చేసిన అమెరికా రక్షణశాఖ, తాను ఎనిమిది నెలల క్రితం చొరబడిన దేశంలో అతిపెద్ద చమురు క్షేత్రాలకు యజమానిగా అవతరించబోతున్నదని అర్థం.

వెనెజువెలాలో అమెరికా వీరవిధేయ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ ఈ ఒప్పదం గురించి ఏం చెబుతారో ఊహించడం కష్టం కాదు. వందబిలియన్ డాలర్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలతో దేశం కళకళలాడిపోతుందనీ, చమురు ఉత్పత్తి ద్విగుళం బహుళమై ఆర్థికవ్యవస్థ అద్భుతంగా తయారవుతుందన్నారు ఆమె. పూర్తి రహస్యంగా జరిగిన ఈ ఒప్పందం గురించి ట్రంప్ బయటకు చెప్పేవరకూ వెనెజువెలాలో ఎవరికీ తెలియదు. చమురు క్షేత్రాల కేటాయింపుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ కూడా, వందేళ్ళక్రితం అమెరికా అనుకూల నియంత గోమేజ్ అమెరికన్ కంపెనీలనుంచి వసూలు చేసినదానికంటే ఎంతో తక్కువట. ఈ ఏడాది ఆరంభంనుంచి అమెరికా తరలించుకుపోయిన చమురుకు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా వెనెజువెలాకు ఇంకా ఇవ్వలేదట. మొన్న జూన్‌లో గత 125 ఏళ్ళలో ఎన్నడూ లేనంత భయంకరమైన భూకంపంతో వెనెజువెలా భారీగా నష్టపోయింది. వందలాదిమంది మరణించారు, నిరాశ్రయులైన వేలాది మంది ఇంకా టెంట్లలోనే జీవిస్తున్నారు. కేవలం రెండు నెలల్లో కుదిరిన ఈ ఒప్పందం ఆ దేశాన్ని ఆదుకోవడం కాక, దోచుకోవడం మీద అమెరికాకు ఉన్న శ్రద్ధను తెలియచెబుతోంది. అమెరికా పెట్టిన 'నార్కో టెర్రరిజం' కేసులతో బ్రూక్లిన్ జైల్లో ఉన్న మదురో భూకంపం సమయంలో తన ప్రజలకు సంఘీభావంగా విడుదల చేసిన ఫోటో ఒకటి, ఈ చమురు ఒప్పందం కుదిరిన మర్నాడే వెలుగుచూడటం చక్కగా అతికినట్టు సరిపోయింది.

ఇరాన్ యుద్ధంలో చేయి కాల్చుకొని, రేటింగ్ కూడా బాగా పడిపోయిన ట్రంప్ నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరగబోతున్న తరుణంలో, ఈ ఒప్పందాన్ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇప్పటికే వ్యూహాత్మక చమురు నిల్వలు వేగంగా ఖాళీ అవుతూ, కేవలం ఈ ఎనిమిది నెలల కాలంలోనే మూడోవంతు ఖర్చయిన నేపథ్యంలో, వెనెజువెలా చమురు మన ఖాళీ పీపాలను నింపుతుందని ట్రంప్ ప్రజలకు హామీ ఇస్తున్నారు. అమెరికన్ రిఫైనరీలకు కారుచవుక వెనెజువెలా చమురు వచ్చి చేరి, ఇంధన ధరలు విపరీతంగా తగ్గి జనానికి మేలు చేకూరుతుందని హామీ ఇస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్‌మీద పుతిన్ చేస్తున్న యుద్ధానికి ఇంధనం అందిస్తున్నారంటూ భారత్ సహా పలుదేశాల మీద ట్రంప్ వీరంగం వేస్తూ ఆంక్షలూ సుంకాలతో వాటికి ఆర్థికంగా ఊపిరాడకుండా చేస్తున్నారు. తానుమాత్రం వెనెజువెలా చమురుతో ఇరాన్, రష్యాల మీద యుద్ధానికి ఏ అడ్డంకులూ రాకుండా చూసుకుంటున్నారు.

# హిమాలయ 'సునామీ'కి బాధ్యులెవరు?

నేపాల్‌ను విషాదసీమగా మార్చివేసిన మహా విపత్తు అది. హిమాలయ మంచుకొండల మీద హిమనీనదాలు కరిగిపోయాయి. నిటారుకొండలు తమ గర్వాన్ని వీడి కూలిపోయాయి. నదులు వరద జలాలతో పోటెత్తాయి. అనూహ్యమైన జలప్రళయమది. హిమాలయ ప్రాంతాల్లో సంభవించిన ఈ విపత్తు అసాధారణమైనది. విపత్తు దృశ్యాలు భయానకమైనవి. దశాబ్దానికి పైగా అంతర్జాతీయ వాతావరణ విధానంపై కృషి చేస్తున్న నేపాలీ పౌరుడిగా నేను ఈ విపత్తుకు తీవ్రంగా కలత చెందాను. ఆవేదనకు మించిన ఆగ్రహం నన్ను కుదిపివేసింది. ఇటువంటి ప్రళయం విరుచుకుపడవచ్చని శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలుగా హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రపంచ వాతావరణ కార్యాచరణలో జాప్యమే ఈ జల ప్రళయం, సందేహం లేదు. హరితగృహ వాయు ఉద్గారాలను తగ్గించి, భూ తాపాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఉన్న ప్రపంచ వాతావరణ కార్యాచరణ విషయంలో ప్రపంచ దేశాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఇటువంటి ప్రళయం జరిగేదేనా? ఆగస్టు 26న మంచు, నీరు, బండరాళ్లు, బురదతో కూడిన రాకాసివరద అశేష ప్రజలను కకావికలు చేసింది. లక్షలాది గృహాలను ధ్వంసం చేసింది, మార్కెట్లు, వంతెనలు, రోడ్లు రూపు లేకుండా పోయాయి. ఇటు నేపాల్‌లోను, అటు టిబెట్‌లోను విద్యుదుత్పాదన కేంద్రాలు కొట్టుకుపోయాయి. వందలాది మంది మరణించగా, జాడలేకుండా పోయినవారు వేల సంఖ్యలో ఉన్నారు. అనూహ్య వేగంతో ఈ విధ్వంసం చోటుచేసుకున్నది. పర్వతాగ్రాలపై మొదలైన విపత్తు క్షణాల్లో దిగువ ప్రాంతాలకు వ్యాపించింది. ఈ విపత్తు ఒక వాస్తవాన్ని స్పష్టంగా ఎత్తిచూపింది: నేపాల్‌కు మరింత బలమైన ముందస్తు విపత్తు హెచ్చరిక వ్యవస్థలు, హిమనీనదాలు, అస్థిర కొండవాలుల నిరంతర మెరుగైన పర్యవేక్షణ, నేపాల్, టిబెట్‌లో ఉమ్మడి జల వనరుల పరివాహక ప్రాంతాలు ఉన్నందున ఈ రెండు హిమాలయ ప్రాంతాల మధ్య సరిహద్దు సమాచార మార్పిడి, మరీ ముఖ్యంగా ప్రాకృతిక విపత్తుల సన్నద్ధతలో భారీ ఎత్తున నిధుల వినియోగం అత్యవసరం.

నేపాల్‌లో మెరుపు వరదలు ఒక మౌలిక వాస్తవాన్ని బహిర్గతం చేశాయి: సమస్య ముందస్తు హెచ్చరికల వ్యవస్థ లేకపోవడం కాదు; వాతావరణ సంక్షోభం సృష్టిస్తున్న ప్రమాదాలు ఊహింపదగిన విపత్తులకు భిన్నంగా ఉంటున్నాయి; ఫలితంగా హెచ్చరిక వ్యవస్థలు ఆ అనూహ్య అపాయాల సంభవాన్ని గ్రహించలేకపోతున్నాయి. హిమాలయ పర్వతాల పరివేష్టిత భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాలను ముంచివేసిన వరదే అందుకొక ఉదాహరణ. బురద, కొండరాళ్లతో ఆకస్మికంగా విరుచుకుపడిన ఆ వరద నది ఎగువ ప్రాంతంలోని హైడ్రాలాజికల్ కేంద్రాలను, నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టి హెచ్చరికలను జారీ చేయక ముందే ధ్వంసం చేసింది. క్రమంగా పెరిగే నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టేందుకు ఆ హెచ్చరిక వ్యవస్థను రూపొందించారు. అయితే ఆగస్టు 26న సంభవించిన రాకాసి వరద ఆ హెచ్చరిక వ్యవస్థను ముందుగానే సమూలంగా ధ్వంసం చేసింది. ఇదెలా జరిగింది? శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనా ప్రకారం, ఒక భారీ హిమనీనదం కూలిపోవడం కారణంగా ఇది సంభవించింది. పర్వతాల పై భాగంలో జరిగిన ఈ సంఘటన దిగువ ప్రాంతాలలో హింసాత్మక వరదకు దారితీసింది. ఈ క్రమం తీరుతెన్నులను కచ్చితంగా నిర్ధారించేందుకు ఇంకా అధ్యయనాలు జరుగుతున్నాయి. అంతిమంగా శాస్త్రవేత్తల వివరణ ఏమైనప్పటికీ వేడెక్కిన పర్వత ప్రాంతాలలో ప్రమాదాలు ఎంత త్వరితంగా మహా విపత్తులుగా పరిణమిస్తాయనేదానికి ఈ సంఘటనే తిరుగులేని నిదర్శనం. స్పష్టంగా చెప్పాలంటే విపత్తును పసిగట్టడానికి ఉద్దేశించిన సాధనాలే దానివల్ల పనిచేయకుండా పోయాయి. ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమైనది. గతంలో సంభవించిన వరదలను బట్టి రూపొందించిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థ భవిష్యత్తులో తీవ్రమైన విపత్తుల ముందు సరిపోనిదిగా మిగలవచ్చు. అంత మాత్రాన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు నిష్ప్రయోజనకరమని భావించనవసరం లేదు. అయితే వాటి పరిమితులను మనం గుర్తించాలి, అంగీకరించాలి.

వాతావరణ అనుసరణ (వాతావరణ మార్పు, దాని ప్రభావాలకు అనుగుణంగా నష్టాన్ని తగ్గించడానికి సర్దుబాటు చేసుకునే ప్రక్రియ)కూ పరిమితులున్నాయి. మౌలిక సదుపాయాలను పటిష్ఠపరచుకోవడం, విపత్తుల నెదుర్కొనే సంసిద్ధతను మెరుగుపరచుకోవడం, జీవనాధారాలకు రక్షణ కల్పించడం మొదలైన చర్యలతో అటువంటి సర్దుబాటుకు నేపాల్ చాలా సంవత్సరాలుగా చురుగ్గా ప్రయత్నిస్తున్నది. అయితే వాతావరణ సంక్షోభానికి చారిత్రకంగా బాధ్యత ఉన్న పారిశ్రామిక సంపన్న దేశాల నుంచి నేపాల్‌కు తగు ఆర్థిక సహాయం లభించనే లేదు. తీవ్రమవుతున్న వాతావరణ ప్రమాదాలను, వినాశనకర వరదలను ఎదుర్కోవడానికి నేపాల్‌కు అంతర్జాతీయ సహకారం అత్యవసరం. ఎందుకంటే హిమాలయ ప్రాంతాల్లో సంభవించే ప్రాకృతిక విపత్తులు జాతీయ సరిహద్దులకు ఆవల ఉద్భవిస్తాయి. కనుక సంబంధిత దేశాల మధ్య సహకారం, సకాలంలో సమాచార మార్పిడి ఉండి తీరాలి.

నేపాల్ ప్రాంతపు హిమాలయాలు వేగంగా మారుతున్నాయి. హిమనీనదాలు క్షీణిస్తున్నాయి. భూతాపం హిమాలయ ప్రాంతాల సుస్థిర పరిస్థితులను వేగంగా మార్చివేస్తోంది. ఈ సంక్షోభ పరిస్థితులు మరింత తీవ్రతరం కాకుండా నివారించడమే మొదటిపని కావాలి. దశాబ్దాలుగా శిలాజ ఇంధనాల ఆధారిత అభివృద్ధి నుంచి అత్యధికంగా ప్రయోజనం పొందిన పారిశ్రామిక సంపన్న దేశాలకు కాలుష్యకారక ఉద్గారాలను వేగంగా తగ్గించాల్సిన ప్రత్యేక బాధ్యత ఉంది. ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతికతలు ఆ దేశాలకు సమృద్ధిగా ఉన్నాయి. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాల వినియోగానికి వారు శీఘ్రగతిన పరివర్తన చెంది తీరాలి. అది ఆవశ్యక న్యాయ బద్ధమైన మార్పు. అయితే సంపన్న దేశాలు ఈ మార్పు దిశగా ప్రస్థానించడం లేదన్నది ఒక కఠోర సత్యం.

ఈ పరిస్థితుల నుంచి నేపాల్ విధిగా ఒక పాఠాన్ని నేర్చుకోవాలి. వాతావరణ సంక్షోభానికి కారణమైన ఆర్థికాభివృద్ధి నమూనాను అనుకరించకూడదు. ఒక భిన్నమైన వ్యవస్థను నిర్మించుకునే అవకాశం తనకు ఉందనే వాస్తవాన్ని నేపాల్ గుర్తించాలి. అభివృద్ధి పేరిట సహజ వనరులను విచక్షణారహితంగా ఉపయోగించుకోవడాన్ని నిలిపివేయాలి. ప్రజల జీవనోపాధులకు, పర్యావరణ సమతౌల్యతకు ప్రాధాన్యమిచ్చే ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాలి. కాలుష్యకారక వాయువుల ఉద్గారాలలో నేపాల్ వాటా చారిత్రకంగా ఎప్పుడూ 0.1శాతం కంటే తక్కువగా ఉంటోంది. నేపాల్ తలసరి ఉద్గారాలు ప్రపంచంలోనే చాలా తక్కువ. అయినప్పటికీ తాను సృష్టించని, వాతావరణ సంక్షోభానికి ఆ దేశం అధిక మూల్యం చెల్లిస్తోంది. ఇది న్యాయవిరుద్ధం కాదూ? వాతావరణ మార్పుల ఫలితంగా అనివార్యమవుతున్న ఆర్థిక, ఆర్థికేతర నష్టాల నుంచి కోలుకునేందుకు నష్టపరిహార సహాయం అందించాలని నేపాల్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు పదే పదే డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవలి మహా విపత్తులో సంభవించిన అపార నష్టం నుంచి కోలుకునేందుకు విధిగా పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవల్సిన పరిస్థితిని నేపాల్‌కు కల్పించకూడదు. ఇది సంపన్న దేశాల నైతిక బాధ్యత. ఇప్పటికే అందిస్తున్న అధికారిక అభివృద్ధి సహాయానికి అదనంగా నష్ట పరిహార ఆర్థిక సహాయాన్ని అందించాలి. ఈ అదనపు సహాయాన్ని సులభ షరతులపై ఉదారపూర్వకంగా అందించాలి. సంపన్న దేశాలు ప్రస్తుతం తాము ఉపయోగించుకుంటున్న శిలాజ ఇంధనాల పరిమాణాన్ని యథావిధిగా కొనసాగించిన పక్షంలో, నేపాల్ మొదలైన అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవి ఎంత అధిక మొత్తంలో నష్టపరిహార సహాయం అందించినా ప్రయోజనం ఉండదు.

భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాల ప్రజలు హిమాలయాలు వేడెక్కడాన్ని కోరుకోలేదు. మంచు పర్వతాలు వేడెక్కడానికి కారణమైన శిలాజ ఇంధన ఆర్థిక వ్యవస్థను కూడా వారు ఎంచుకోలేదు. తగినంత ఆర్థిక, సాంకేతికత మద్దతు లభిస్తే పరిస్థితులకు అనుగుణంగా మారి తమ భవిష్యత్తును పదిలం చేసుకోగలరు. హిమనీనదాలు కరగడాన్ని నివారించలేకపోయినప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక సహకారం, అధునాతన సాంకేతికతల తోడ్పాటుతో వాతావరణ విపత్తులను ముందుగానే పసిగట్టి, వాటి నుంచి సురక్షితంగా లేదా సాధ్యమైనంత తక్కువ నష్టంతో బయటపడగలరు. నష్టపరిహార సహాయం అనేది దాతృత్వం కాదు. తాము చేయని అపరాధానికి భారీగా నష్టపోయిన ప్రజల శ్రేయస్సు పట్ల తమ బాధ్యతగా ఆ సహాయాన్ని పారిశ్రామిక సంపన్న దేశాలు అందించాలి.

> **కాలుష్యకారక వాయువుల ఉద్గారాలలో నేపాల్ వాటా ఎప్పుడూ 0.1 శాతం కంటే తక్కువే. అయినప్పటికీ తాను సృష్టించని వాతావరణ సంక్షోభానికి ఆ దేశం అధికమూల్యం చెల్లిస్తోంది. ఇటీవలి మహావిపత్తులో సంభవించిన అపారనష్టం నుంచి కోలుకునేందుకు పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవలసిన పరిస్థితిని నేపాల్‌కు కల్పించకూడదు. ఇది సంపన్న దేశాల నైతిక బాధ్యత.**

■ సునీల్ ఆచార్య
అంతర్జాతీయ వాతావరణ విధాన నిపుణుడు
(ది గార్డియన్)

## ఏడుపదుల ఎల్ఐసీ.. ఎదురులేని ప్రస్థానం!

దేశీయ పొదుపును ప్రోత్సహించడం, ప్రజల పొదుపునకు భద్రత కల్పించడం, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని సామాజిక బాధ్యతగా అందించడం వంటి లక్ష్యాలతో స్వాతంత్ర్యానంతరం ఎల్ఐసీ ఏర్పాటైంది. ప్రభుత్వ తరపున సార్వభౌమ హామీ కల్పిస్తూ, ప్రీమియం రూపంలో ప్రజల పొదుపును సమీకరించడం, ప్రైవేటు వ్యక్తుల మోసాల బారి నుంచి ప్రజల సొమ్మును పరిరక్షించడం ద్వారా ఆర్థిక రంగంలో ఎల్ఐసీ ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది.

సెప్టెంబర్ 1వ తేదీన 70వ సంస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఇన్సూరెన్స్ దిగ్గజం.. ప్రభుత్వరంగ 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' దేశానికే గర్వకారణం. ఎల్ఐసీ సంస్థాపక దినోత్సవం సందర్భంగా, దేశ ఆర్థిక రంగంలో ఈ సంస్థ నిర్వహించిన కీలకపాత్రను మననం చేసుకోవడం ముదావహం.

ప్రజల వద్ద నుంచి 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రీమియం రూపంలో వసూలు చేసిన మొత్తాలను తమ సొంత ప్రయోజనాలకు వాడుకుంటూ పాలసీదారులను మోసం చేస్తున్న నేపథ్యంలో అన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను కలిపి భారతీయ జీవిత బీమా వ్యాపారాన్ని నాడు జాతీయం చేశారు. ఏ లక్ష్యాలతో అయితే భారతీయ జీవిత బీమా వ్యాపారాన్ని జాతీయం చేసి 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'గా ఏర్పాటు చేశారో... ఆ జాతీయాకరణ లక్ష్యాలను సాధించటంలో ఎల్ఐసీ కృతకృత్యమైంది.

సెప్టెంబర్ 1, 1956న పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పడిన ఎల్ఐసీ.. గత డెబ్బై ఏళ్లుగా దేశీయ ఆర్థిక రంగానికి వెన్నెముకగా నిలుస్తోంది. ఆర్థికరంగ అభివృద్ధికి లక్షల కోట్ల రూపాయలను పెట్టుబడులుగా ఉంచింది. ఎల్ఐసీ మొత్తం పెట్టుబడులలో 82శాతం గవర్నమెంట్ సెక్యూరిటీలుగా, దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిర్దేశించినవే.

1956లో కేవలం 5 కోట్ల పెట్టుబడితో ప్రారంభమై.. 2011లో 'ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ' నియమాల ప్రకారం 100 కోట్లు పెట్టుబడిగా మార్చుచేసుకుంది. 'ప్రజల సొమ్ము ప్రజల శ్రేయస్సుకే' అనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 14.57 లక్షల మంది ఏజెంట్స్‌తో పటిష్ఠమైన మార్కెటింగ్ నెట్‌వర్క్‌తో వివిధ స్థాయిలలో 3,836 ప్రాంతాలకు తన కార్యాలయాలను విస్తరింపజేసింది. 25 కోట్లకు పైగా వ్యక్తిగత పాలసీదారులను, 10 కోట్లకు పైగా గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీదారులను కలిగి ఉంది.

సెబీ నిబంధనల ప్రకారం, 10 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ కలిగి ఉండాలనే సాకు చూపి, 'ఆఫర్ ఫర్ సేల్' (ఓఎఫ్ఎస్) పేరుతో, ఎల్ఐసీ 1:1 బోనస్ షేర్లను జారీ చేసిన అనంతరం మరొక 6.5శాతం ప్రభుత్వ వాటాను ఉపసంహరించారు. ఈ ఓఎఫ్ఎస్ 3.32 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యి.. 31,552 కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమయ్యాయి. ఎల్ఐసీపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని ప్రభుత్వం అమ్ముకోవడం సర్వత్రా విమర్శలకు దారితీసింది.




ప్రతికూల స్టాక్ మార్కెట్ పరిణామాల నేపథ్యంలో ఎల్ఐసీ షేర్లు, విలువ తగ్గి డిస్కౌంట్‌తో ట్రేడై మదుపరులను నిరుత్సాహపరిచిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇది మొత్తం స్టాక్ మార్కెట్ ట్రెండ్‌లో భాగంగా జరిగిన పరిణామమైనప్పటికీ ఈ ప్రక్రియ ఎల్ఐసీ ప్రతిష్ఠకు భంగం కలిగించింది. ఎల్ఐసీ షేరుకు స్టాక్ మార్కెట్‌లో ఉన్న విలువ కన్నా, ఆ సంస్థ అంతర్గత విలువ అనేక రెట్లు అధికమనేది అంగీకరించాల్సిన అంశం. ఎల్ఐసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 63.7 బిలియన్ డాలర్లుగా నమోదుచేసి, దేశంలోని అత్యధిక క్యాపిటలైజేషన్ కలిగిన కంపెనీల జాబితాలో పదో స్థానంలో నిలిచింది.

స్టాక్ మార్కెట్‌లో ఎల్ఐసీ షేరు విలువ తీరుకు, వాస్తవ ఎల్ఐసీ వ్యాపార పనితీరుకు అంతరం ఉంది. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో పోల్చినపుడు ఈ సంస్థ పనితీరు మెరుగ్గా ఉంది. ఎల్ఐసీ నిర్మాణశైలి షేర్ విలువ లాభాలకన్నా, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన అంశాలతో ముడిపడి ఉంటుంది.

కేవలం నష్టాలలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ, వాటాల ఉపసంహరణ చేస్తామని పేర్కొనే ప్రభుత్వం, దీనికి భిన్నంగా ప్రతిష్ఠాత్మకమైన ఫార్చ్యూన్–500 కంపెనీల జాబితాలో నిలిచి దేశానికే వన్నెతెచ్చిన ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థ ఎల్ఐసీ వాటాలను అమ్ముకుని బడ్జెట్ లోటును పూడ్చుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవడాన్ని పౌర సమాజం హర్షించదు.

2047 నాటికి ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్స్‌ను అందించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన ప్రస్తుత తరుణంలో, ఆదాయ అంతరాలను తగ్గిస్తూ, ప్రజలకు సామాజిక భద్రతను కల్పిస్తూ, రాజ్యాంగ పీఠిక ప్రబోధించిన సమానత్వం, సార్వభౌమత్వం అనే కీలక అంశాలే ప్రాతిపదికగా, అద్భుత పనితీరుతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన, దేశ ఆర్థిక వ్యవస్థకు అమృత తుల్యమైన ఎల్ఐసీ వంటి ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థను డిజిన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రభుత్వ వాటాలను అమ్ముకోవడం ప్రజామోదయోగ్యం కాదు.

● జి. కిశోర్‌కుమార్
జాయింట్ సెక్రటరీ, SCZIEF

## జెన్‌జీ ఉద్యమాన్ని నీరుగార్చలేరు!

ఈ దేశంలో జరుగుతున్న జెన్‌జీ ఉద్యమానికి లేని ఉద్దేశ్యాలను, లక్ష్యాలను ఆపాదించి విద్యార్థుల న్యాయమైన అసంతృప్తిని డీలెజిటిమైజ్ చేయడానికి ఒక విఫల ప్రయత్నం చేశారు వ్యాసకర్త అరవిందరావు (20 ఆగస్టు 2026న ఆంధ్రజ్యోతిలో తాను రాసిన వ్యాసంలో). ఉద్యమం వెనుక బుద్ధిజీవులున్నారని, 'దేశాన్ని బలహీనపరచడం, అంతర్గతంగా విచ్ఛిన్నం చేయడమే' వారి ఎజెండా అని రాశారు. ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్స్'కు ఇది నిర్వచనం, కొనసాగింపు. అంతేగాక 'రాజకీయ పార్టీలు విద్యార్థుల వీపులపై స్వారీ చేసి ప్రభుత్వాన్ని దించాలని ఆశపడుతున్నాయి' అన్నారు. ఈ వాదనల నిరూపణకు చైనాను ఉదహరించారు. ఇంకా అన్యాయంగా, అసందర్భంగా దీనికి పూర్తి వ్యతిరేకమైన బెర్నార్డ్ షాను వాడారు.

పేపర్ లీక్‌లు, పరీక్ష మోసాలు పరిశీలిస్తే.. 2005–2026 మధ్యకాలంలో 21 రాష్ట్రాలలో 220 సంఘటనలు నమోదయ్యాయి. ఇందులో 2015కు ముందు 72 కేసులు నమోదు కాగా, 2015 తర్వాత 148 కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలు అన్ని ప్రభుత్వాల హయాంలలోనూ జరిగాయి. కానీ బీజేపీ, దాని మిత్రపక్షాల పాలనలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మొత్తం 220 కేసులలో ఎన్డీఏ పాలనలో 128 కేసులు (58శాతం), కాంగ్రెస్, దాని మిత్రపక్షాల పాలనలో 55 కేసులు (25 శాతం) నమోదయ్యాయి. 2015 తర్వాత బీజేపీ వాటా ఇంకా పెరిగింది. నమోదైన 148 కేసులలో 99 కేసులు (67 శాతం) ఎన్డీఏ పాలనలోనే చోటుచేసుకున్నాయి.

'పేపర్ లీక్‌లు కావడం కాంగ్రెస్ హయాంలో అతి సాధారణమైన విషయం' అని వ్యాసకర్త వ్యాఖ్యానించారు. కానీ గణాంకాలు దానికి వ్యతిరేకంగా ఉన్నాయి. 2015కు ముందు నమోదైన కేసుల్లో కేవలం 12 కేసుల్లోనే సీబీఐ శిక్ష వేయించగలిగింది. కానీ, 2015 తర్వాత 148 కేసులలో కేవలం ఒక్క కేసులోనే నేరం రుజువై శిక్ష పడింది. అది కూడా చండీగఢ్‌లోనే. సీబీఐకి 2015 తర్వాత కనీసం 17 కేసులు దర్యాప్తునకు అప్పగించారు. అందులో శిక్ష నమోదు రికార్డు సున్నా! అదే సమయంలో 11 కేసులలో ఈడీ పనితీరు శూన్యం. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం కుప్పకూలిపోయింది. అంచెల కుల సమాజంలో పరీక్ష వ్యవస్థలకు ఉండే సమానత్వ సామర్థ్యం దెబ్బతిని, సాధికారతే ప్రశ్నార్థకం అయింది.

యూజీసీ నెట్–2024 పేపర్ లీక్ ఘటనలో నేను కూడా బాధితుడినే. ఈ ఏడాది కూడా ప్రశ్న పత్రంలో అక్షరదోషాల వల్ల మూడు పేపర్లను రద్దు చేశారు. ఇంతటి తీవ్ర సంక్షోభానికి సమాధానం అడగవలిసిన వ్యవస్థలు ఈ దేశ విద్యార్థులకు నిరాశను మిగల్చడమే కాక 'బొద్దింకలు' అని అవమానపరిచాయి. దిగజారిన రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను, జవాబుదారీతనాన్ని తట్టి లేపి, తిరిగి తన న్యాయమైన స్థానంలో పునరుద్ధరించడం కోసమే ఈ ఉద్యమం. ఎంత దాడి జరిగినా విద్యార్థి ఉద్యమం మాత్రం సమాజాన్ని మానవీకరించే దిశగా, వ్యవస్థలను ప్రజాస్వామీకరించి కాపాడుకునే దిశగానే సాగుతుంది.

○ పి. ఆనంద్
పీహెచ్‌డీ విద్యార్థి, పుదుచ్చేరి

# డేటా సెంటర్లకు తాగు నీరు.. ఒక దుష్ప్రచారమే!

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రేపు పాయకరావుపేట వద్ద జరగనున్న 'జలహారతి' కార్యక్రమం ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు విడుదల కాబోతున్నాయి. ఒక వైపు ఇలా పోలవరం కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర ముఖ ద్వారాన్ని తాకుతుంటే, మరోవైపు ఈ నీటి వినియోగంపై దుష్ప్రచారం పెచ్చుమీరుతున్నది. విశాఖపట్నం నగరవాసులకు దక్కాల్సిన మంచి నీటిని ఈ డేటా సెంటర్లు తోడేస్తాయన్నది ఈ ప్రచారం సారాంశం.

కానీ, శాసనసభలో ఐటీ మంత్రి లోకేశ్ ఇచ్చిన అధికారిక సమాచారం, క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ డేటాను పరిశీలిస్తే, ఈ ఆరోపణలన్నీ అవగాహనా రాహిత్యంతో చేస్తున్నవేనని తెలుస్తుంది. విశాఖపట్నం ప్రజల మున్సిపల్ తాగు నీటి సరఫరా వ్యవస్థకు, గూగుల్ డేటా సెంటర్లకు వాడే నీటి వ్యవస్థకు సాంకేతికంగా కానీ, భౌతికంగా కానీ ఎటువంటి సంబంధమూ లేదు. విశాఖపట్నం ప్రజల కోసం కేటాయించిన ఒక్క నీటి చుక్కను కూడా ప్రభుత్వం పరిశ్రమలకు మళ్లించదని మంత్రి లోకేశ్ స్పష్టంగా చెప్పారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ–అనకాపల్లి ప్రాంతానికి అందుబాటులోకి వచ్చే మొత్తం 23.44 టీఎంసీల నీటిలో ప్రభుత్వం స్పష్టమైన విభజనను అమలు చేస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం, పరిసర పట్టణాల్లోని ఇళ్లకు వాడే మంచినీటి కోసం 12 టీఎంసీలు కేటాయించారు. ఈ కోటాను పరిశ్రమలకు మళ్లించడం అసాధ్యం. గూగుల్, అదానీ ఏఐ డేటా సెంటర్ల పూర్తి స్థాయి వినియోగానికి కావలసిన 3.5 టీఎంసీలతో కలుపుకుని, పారిశ్రామిక కారిడార్ అవసరాలకు మొత్తం 4 టీఎంసీలు కేటాయించారు. ఇక అనకాపల్లి, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 7.44 టీఎంసీలు కేటాయించారు. ప్రతి ఏడాది సముద్రంలో వృథాగా కలిసే 3,000 టీఎంసీల గోదావరి జలాల నుంచే ఈ కేటాయింపులు జరుగుతున్నాయి తప్ప, రైతుల కోసమో, నగర వాసుల కోసమో కేటాయించిన నీటిని ప్రభుత్వం తీసుకోవడం లేదు.

గూగుల్, అదానీ డేటా సెంటర్ల కోసం నిర్మించే నీటి లైన్లు మిగతా వాటితో పూర్తిగా సంబంధం లేకుండా ఉంటాయి. నగరంలో ఇళ్ళకు నీటిని సరఫరా చేసే మున్సిపల్ పైప్‌లైన్లకు, గ్రేటర్ జీవీఎంసీ నిర్వహించే తాగునీటి రిజర్వాయర్లకు ఈ పారిశ్రామిక పైప్‌లైన్లతో ఎలాంటి కనెక్షన్ ఉండదు. కాబట్టి డేటా సెంటర్లు ఎంత నీటిని వినియోగించినా అది నగర వాసుల తాగునీటి సరఫరాపై ఎటువంటి ప్రభావాన్నీ చూపించదు.

> **గూగుల్, అదానీ డేటా సెంటర్ల కోసం నిర్మించే నీటి లైన్లు మిగతా వాటితో పూర్తిగా సంబంధం లేకుండా ఉంటాయి. నగరంలో ఇళ్లకు నీటిని సరఫరా చేసే మున్సిపల్ పైప్‌లైన్లకు, గ్రేటర్ జీవీఎంసీ నిర్వహించే తాగునీటి రిజర్వాయర్లకు ఈ పారిశ్రామిక పైప్‌లైన్లతో ఎలాంటి కనెక్షన్ ఉండదు. కాబట్టి డేటా సెంటర్లు ఎంత నీటిని వినియోగించినా అది నగరవాసుల తాగునీటి సరఫరాపై ఎటువంటి ప్రభావాన్నీ చూపించదు.**




పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఈ ప్రాంతానికి నీటిని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.1,050కోట్లు ఖర్చు చేసి, కాలువ నిర్మాణంలో ఉన్న అనేక అడ్డంకులను తొలగించింది. 181.99కి.మీ పొడవైన ఈ ఎడమ ప్రధాన కాలువలో మట్టి తవ్వకం పనులు దాదాపు పూర్తయ్యాయి. కాలువ ద్వారా ఇప్పటికే తూర్పు గోదావరి, పిఠాపురం పరిసర ప్రాంతాలకు నీరు ప్రవహిస్తోంది. అనకాపల్లి వద్దకు చేరుకొనే ఈ జలాల నుంచే ఒకవైపు వ్యవసాయ భూములకు సాగునీరు, మరోవైపు పరిశ్రమలకు ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా నీటి తరలింపు జరుగుతుంది.

ప్రభుత్వం గూగుల్ వంటి పారిశ్రామిక దిగ్గజాలకు ప్రజాధనంతో ఉచితంగా నీటి మౌలిక వసతులను కల్పిస్తోందనే ఆరోపణ పూర్తిగా వాస్తవదూరం. పోలవరం ప్రధాన ప్రాజెక్టు మౌలిక వసతులను ప్రభుత్వం పూర్తి చేస్తున్నప్పటికీ, ఈ కాలువ నుంచి తార్లవాడ, అడవివరం, రాంబిల్లి వంటి డేటా సెంటర్ కారిడార్ క్యాంపస్‌లకు నీటిని తీసుకెళ్లే బల్క్ ఇన్–టేక్, ప్రాజెక్టు అంతర్గత మౌలిక సదుపాయాల వ్యయాన్ని రాష్ట్ర పారిశ్రామిక కేటాయింపుల విధానాలకు, ఆయా సంస్థలతో చేసుకున్న ఒప్పంద నిబంధనలకు అనుగుణంగానే చేపడుతున్నారు. దీని ద్వారా సాధారణ పన్ను చెల్లింపుదారులపైన గానీ, నగర మున్సిపల్ నిధులపైన గానీ ఎలాంటి అనవసర భారమూ పడదు.

ఇక డేటా సెంటర్లు నీటిని తాగేస్తాయన్న ప్రచారం కూడా నిజం కాదు. ఐటీ, పర్యావరణ నిబంధనల ప్రకారం, గూగుల్ వంటి సంస్థలు అత్యంత అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తున్నాయి. వారు వాడే క్లోజ్డ్–లూప్ ఎయిర్-కూలింగ్ టెక్నాలజీల వల్ల ఇతర భారీ పరిశ్రమలతో పోలిస్తే నీటి వాడకం అత్యంత తక్కువ. విశాఖపట్నం ఐటీ కారిడార్ దాని గరిష్ఠ సామర్థ్యమైన 6.5 గిగావాట్లకు చేరుకున్నప్పుడు మాత్రమే డేటా సెంటర్లకు ఏటా 3.0 నుంచి 3.5 టీఎంసీల నీరు అవసరమవుతుంది. ఏటా గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలిసే 3 వేల టీఎంసీల జలాలతో పోలిస్తే ఇది కేవలం 0.1శాతం మాత్రమే.

డేటా సెంటర్ల నిర్మాణంలోని ప్రస్తుత దశలో అతి తక్కువ నీరు సరిపోతుంది. 2028–29 నాటికి ఫేజ్ 1 ప్రారంభ సమయానికి సర్వర్ల కమిషనింగ్ మొదలైనప్పుడే అసలు నీటి వాడకం ప్రారంభమవుతుంది. అంటే, నగరానికి శాశ్వత తాగునీటి పైప్‌లైన్లు పూర్తయిన తర్వాతే డేటా సెంటర్ల వాడకం క్రమంగా పెరుగుతుంది.

మరోపక్క గూగుల్ సంస్థ కూడా 2030 నాటికి వాటర్ పాజిటివ్ కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అంటే, వినియోగించే నీటి కంటే ఎక్కువ నీటిని స్థానిక భూ గర్భజలాల పునరుద్ధరణ ద్వారా, రీసైక్లింగ్ ద్వారా, చెరువుల పునరుజ్జీవనం ద్వారా తిరిగి సమాజానికి అందిస్తుందన్నమాట. పరిశ్రమల కోసం కేటాయించిన 4 టీఎంసీల కోటాకు అదనంగా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా శుద్ధి చేసిన వ్యర్థ జలాలను, 100 ఎంఎల్డీ సామర్థ్యంతో ప్రతిపాదించిన సముద్రపు నీటి శుద్ధీకరణ ప్లాంట్లను ప్రత్యామ్నాయ వనరులుగా డాటా సెంటర్లకు ఉపయోగిస్తారు. దీని వల్ల వేసవిలో కూడా నగరానికి అందే మంచి నీటి నిల్వల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా పరిశ్రమలకు మళ్లించాల్సిన అవసరం ఉండదు.

విశాఖ తీర ప్రాంతంలో చేపడుతున్న ఆందోళనలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవీ లేదా సమాచార లోపం వల్ల చేస్తున్నవి. విశాఖపట్నంలో ప్రస్తుతం రోజువారీ నీటి డిమాండ్ 480 మిలియన్ లీటర్లు కాగా, సరఫరా 410 మిలియన్ లీటర్లు మాత్రమే. ఈ పాత కొరతను సాకుగా చూపిస్తూ, 'మనం డేటాను తాగలేం' వంటి ఆకర్షణీయమైన నినాదాలతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. అంతా పారదర్శకమైన విధానాల ద్వారాను, స్పష్టమైన చట్టబద్ధమైన కేటాయింపుల మార్గంలోను జరుగుతున్నప్పుడు విపక్షాల అసత్య ప్రచారాలను పక్కన పెట్టాలి. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈ సాంకేతిక విప్లవాన్ని స్వాగతించాలి.

● నీలాయపాలెం విజయ్‌కుమార్
జాతీయ అధికార ప్రతినిధి– తెలుగుదేశం పార్టీ

## నేడు పింఛన్ పంపిణీ

**అనంతపురం అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** సెప్టెంబరు నెలకు సంబంధించిన పింఛన్ సొమ్మును మంగళవారం ఉదయం నుంచి పంపిణీ చేయనున్నారు. ఈ నెలలో జిల్లాలోని 2,76,238 మందికి రూ.123.68 కోట్ల పింఛన్ సొమ్ము మంజూరైంది. మంగళవారం ఉదయం నుంచి స్వర్ణ గ్రామ, వార్డు సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ సొమ్మును పంపిణీ చేయనున్నారు. తొలి రోజు పింఛన్ తీసుకోని వారు బుధవారం స్థానిక స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల దాకా పొంద వచ్చని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శైలజ తెలిపారు.

# పింఛన్ ఆశలు!

## ఈనెలలోనే దరఖాస్తుల స్వీకరణ

- తొలుత వృద్ధులు, వితంతువులకు అవకాశం
- తర్వాత మిగతా కేటగిరీలకు ఇవ్వాలన్న యోచన
- అర్హులందరికీ ఒకేసారి ఇవ్వాలని లబ్ధిదారుల వేడుకోలు
- మండలాల వారీగా వివరాల సేకరణ
- జిల్లాలో 36,857 మంది ఎదురుచూపు



**అనంతపురం అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** కొత్త పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు గంపెడాశలు పెట్టుకున్నారు. సెప్టెంబరులో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికారికంగా జిల్లా యంత్రాంగానికి ఉత్తర్వులు అందాల్సి ఉంది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. తాజాగా ప్రభుత్వం నిర్ణయంతో లబ్ధిదారుల మూడేళ్ల నిరీక్షణకు తెరపడింది. తొలుత వృద్ధులు, వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ తర్వాత దశల వారీగా మిగతా కేటగిరీల వారికి మంజూరు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. వైసీపీ హయాంలో వేలాదిమంది అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేయకుండా అన్యాయం చేశారు. కూటమి అధికారంలోకి రావడంతో తమకు కొత్త పింఛన్లు ఇస్తారని ఆశించినా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు సెప్టెంబరులో దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించడంతో అర్హులైన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, వితంతువులతోపాటు అర్హులైన మిగిలిన కేటగిరీల వారికి ఒకేసారి పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయా లబ్ధిదారులు వేడుకుంటున్నారు. మరి ఏ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

### ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఇస్తేనే..

కొత్త పింఛన్ల కోసం సెప్టెంబరులో దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. సెప్టెంబరు ఆఖరులోగానీ, అక్టోబరులోగానీ స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఆలోగా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణతోపాటు మంజూరు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అందుకు సమయం తక్కువగా ఉండటంతో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే కొత్త పింఛన్ల మంజూరుకు అవకాశం ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని, సత్వరమే కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. లేదంటే మరింత కాలం అర్హులైన లబ్ధిదారులు కొత్త పింఛన్ల కోసం నిరీక్షించాల్సి వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### వేలమంది ఎదురుచూపు

జిల్లాలో ప్రస్తుతం ప్రతినెలా 2.76 లక్షల మందికి రూ.124 కోట్లుదాకా పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటి దాకా జిల్లా స్థాయి, మండల కేంద్రాల్లో జరిగే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికల్లో కొత్త పింఛన్ల కోసం వేలాదిమంది లబ్ధిదారులు అర్జీలు ఇచ్చారు. ఇందులో ఎక్కువ శాతం వృద్ధులు, దివ్యాంగులు, వింతంతు పింఛన్ల కోసమే అర్జీలు పెట్టుకోవడం గమనార్హం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వకపోవడంతో ఆయా లబ్ధిదారులకు నిరీక్షణే మిగిలింది. తాజాగా సెప్టెంబరులో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం నిర్ణయించడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఎంతమంది లబ్ధిదారులు పింఛన్లు అడుగుతున్నారన్న వివరాలను డీఆర్‌డీఏ యంత్రాంగం సేకరించింది. జిల్లా వ్యాప్తంగా 36,857 మంది కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు నివేదికలు తయారు చేశారు. ఇందులో వృద్ధాప్య పింఛన్ల కోసం 17,853 మంది, వితంతువులు 9,098, దివ్యాంగులు 6,725 మంది, మెడికల్ హెల్త్ కేటగిరీలో 524 మంది, మిగిలిన విభాగాల్లో 2,657 మంది ఉన్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ఇంతకంటే ఎక్కువ సంఖ్యలోనే లబ్ధిదారులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

### నిబంధనలు సడలించాలి..

కొత్త పింఛన్ల మంజూరులో నిబంధనలు సడలించాలి. నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ కరెంటు బిల్లు కట్టకూడదన్న నిబంధనను సడలించాలి. మూడేళ్లుగా కొత్త పింఛన్లు ఇవ్వకపోవడంతో ముఖ్యంగా వితంతువులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడే వారు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం నుంచి ప్రజాసాధికార సర్వే చేయకపోవడంతో కొత్తగా పెళ్లైన కుటుంబాలు తల్లిదండ్రుల నుంచి వేరయ్యే అవకాశం లేకుండాపోయింది. రేషన్‌కార్డులు వేర్వేరుగా ఇస్తున్నా వారందరినీ ఒకే కుటుంబం పరిధిలోకి ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ప్రజాసాధికార సర్వేలో కుటుంబాన్ని విభజించకపోవడంతో ఇబ్బందిగా మారింది. తద్వారా అనేకమంది పింఛన్ లబ్ధిదారులు పింఛన్లు పొందలేని పరిస్థితి ఉంది.

**-అశ్విని, ఐద్వా అనంతపురం నగర కార్యదర్శి**

### తక్షణమే కొత్త పింఛన్లు ఇవ్వాలి

జిల్లాలోని అర్హులైన దివ్యాంగులందరికీ తక్షణమే కొత్త పింఛన్లు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జిల్లాలో వేలాదిమంది అర్హులైన దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో అర్జీలు పెట్టుకున్నారు. దివ్యాంగులు కావడంతో బయట పనులు చేయలేక, దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్నారు. అలాంటి దివ్యాంగులందరికీ కొత్త పింఛన్లను తక్షణమే మంజూరు చేయాలి. సెప్టెంబరులో దరఖాస్తుల స్వీకరణలో వృద్ధులు, వితంతువులతో పాటు దివ్యాంగులకు ఒకేసారి పింఛన్లు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**- హరినాథ్‌రెడ్డి, ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు**

### వైసీపీ హయాంలో అన్యాయం

కొత్త పింఛన్ల మంజూరు కోసం నిబంధన లు సడలించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వైసీపీ హయాంలో పింఛన్ల మం జూరు కోసం పలు రకాల కొత్త నిబంధనలు అమలు చేయడం ద్వారా అనేకమంది లబ్ధికి దూరమయ్యారు. లబ్ధిదారుడికి ఆధార్, రేషన్ కార్డు తప్పనిసరి. లబ్ధిదారుల కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగిగానీ, పెన్షనర్ గానీ ఉండకూడదు. కుటుంబంలోని సభ్యులకు 10 ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉండాలి. నాన్‌ట్రాన్స్‌పోర్టు ఫోర్‌వీలర్ ఉండకూడదు. నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ బిల్లు చెల్లించేవారు అనర్హులు. కుటుంబంలో ఆదాయపు పన్ను, జీఎస్టీ చెల్లించేవారు ఉండకూడదు. మున్సిపాలిటీ ప్రాంతాల్లో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నివాస స్థలం ఉంటే అనర్హులుగా తేల్చారు. ఇందులో నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ కరెంటు బిల్లు కట్టేవారిని అనర్హులుగా తేల్చడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ హయాం నుంచి జిల్లాలో ప్రజాసాధికార సర్వే నిలిపేశారు. ప్రస్తుతం కొత్తగా పెళ్లయిన వారు తల్లిదండ్రుల నుంచి రేషన్‌కార్డుల్లో వేరవుతున్నారు. రేషన్‌కార్డుల్లో వేరైనా తల్లిదండ్రులు, కొత్త జంటలను ఒకే కుటుంబం పరిధిలోనే చూపిస్తోంది. ప్రజాసాధికార సర్వేలో హౌస్‌హోల్డ్ షిఫ్టింగ్‌గానీ, మ్యాపింగ్‌గానీ చేస్తేనే కుటుంబంలోని సభ్యులను వేర్వేరు కుటుంబాలుగా ఆన్‌లైన్‌లో విభజించవచ్చు. వైసీపీ హయాం నుంచి ఈ ప్రక్రియను ఆపేశారు. దీంతో కుటుంబం నుంచి విడిపోయిన కుమారుడి పేరుపై కారు ఉన్నా.. 10 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో పొలం ఉన్నా... నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ కరెంటు బిల్లు కడుతున్నా.. ఆ ప్రభావం పింఛన్ లబ్ధిదారులపై పడుతోంది. ఈ పరిస్థితుల్లో అనేక మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీల లబ్ధిదారులు పింఛన్లకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కొత్త పింఛన్ల మంజూరులో నిబంధనలు సడలించి అర్హులకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## చవితి వేడుకలకు శ్రీకారం

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** నగరంలో వినాయక చవితి వేడుకలకు సోమవారం శ్రీకారం చుట్టారు. సప్తగిరి సర్కిల్ వినాయక్ చౌక్ వద్ద మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 44 ఏళ్లుగా వినాయక్ చౌక్‌లో చవితి వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. పర్యావరణ హితంగా పండుగ చేసుకోవాలని సూచించారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు కాకుండా మట్టితో చేసిన వాటిని పూజించాలన్నారు. ఉత్సవాలకు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, నాగన్న, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహమ్మద్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పరుచూరి రమేష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, నాయకులు లలిత్‌కుమార్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యోద్యమంలో సంచార జాతుల పాత్ర అమోఘం

- బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి
- ఘనంగా సంచార జాతుల దినోత్సవం

4

సంచార జాతుల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి

## పాక్షిక రద్దు.. దారి మళ్లింపు

- రైళ్ల వివరాలను ప్రకటించిన అధికారులు
- నాన్ ఇంటర్‌లాకింగ్ పనులే కారణం

5

## జడ్పీలో 59 మందికి కారుణ్య ఉద్యోగాలు

- చివరిరోజు వరకూ నాన్చి.. ఇచ్చిన పెద్దలు

## ఉత్తమ ఉద్యోగి.. లంచావతారి..!

### ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

### సార్ కోసం వెళ్లి.. ఇరుక్కున్న పారిశుధ్య కార్మికుడు

రిపబ్లిక్ డే రోజు తీసుకున్న ప్రశంసాపత్రంతో హిదయతుల్లా

హిదయతుల్లా..! ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాలలో పురస్కారం అందుకున్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సగర్వంగా ఫొటో దిగారు. ఏడు నెలలు తిరిగాక, తన కార్యాలయంలో ఫొటోలకు ముఖం చూపించేందుకు సిగ్గుపడ్డారు. వేలాది రూపాయలు జీతం తీసుకునే ఆయన, లంచానికి అలవాటుపడ్డారు. ఇంటి నిర్మాణ ప్లాన్ అప్రూవల్ ఇచ్చేందుకు లంచం అడిగారు. ఆ సొమ్మును తెచ్చేందుకు వెళ్లిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కంబగిరిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సర్ చెప్పిన పనిచేసినందుకు ఆయన కూడా తోడుగా జైలుకు వెళ్లాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నాడు.

(వివరాలు 5లో)

## అప్పులు, జల్సాల కోసం గొలుసు చోరీలు

### ఇద్దరు నిందితుల అరెస్టు..

రూ.7.50 లక్షల సొత్తు స్వాధీనం

5

## మాటలు కలిపి బంగారం మాయం!

- టీచర్ బ్యాగ్ నుంచి 50 గ్రాముల నగల అపహరణ

## క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి

- ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి విష్ణుమూర్తి

**అనంతపురం వైద్యం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) ప్రోగ్రాం అధికారి డాక్టర్ విష్ణుమూర్తి సూచించారు. 30 ఏళ్లు నిండిన వారు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్థానిక రెండోరోడ్డులోని యూపీహెచ్‌సీ ముందు పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులైన సిగరెట్లు, చుట్టలు, గుట్కాల వినియోగంతో క్యాన్సర్లు వస్తాయన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతి మంగళ, బుధవారాల్లో ఉచితంగా పరీక్షలు చేసి, వైద్యం అందిస్తారన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేలో భాగంగా గుర్తించిన క్యాన్సర్ లక్షణాలున్న అనుమానితులను సర్వజన వైద్యశాలకు రెఫర్ చేయాలని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచించారు. అనంతరం పలు దుకాణాల వద్ద పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ విభాగాధికారి శ్రీరాములు, డాక్టర్ కావ్య, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ విష్ణుమూర్తి

## అగ్రస్థానంలో నిలపండి సర్

- జిల్లా పరిశీలకుడు కిషోర్‌కుమార్

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** ప్రత్యే క ఓటరు జాబితా సవరణ (సర్) అమలులో రాష్ట్రంలోనే అనంతను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా పరిశీలకుడు కిషో ర్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం సర్‌పై కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశీలకుడు మాట్లాడుతూ.. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పోటీతత్వంతో పని చేయాలన్నారు. సర్ డేటా నమోదు సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. డేటా దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కలెక్టర్ ఆనంద్.. జిల్లాలో సర్ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, ఈఆర్వోలు అనంతపురం, కళ్యాణదుర్గం ఆర్డీవోలు ప్రేమంత్‌కుమార్, వసంతబాబు, ఎస్డీసీలు రామ్మోహన్, రమేష్‌రెడ్డి, కిరణ్మయి, రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చెరువులకు హంద్రీనీవా నీరు

- మంత్రి పయ్యావుల కేశవ్

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కేశవ్

**అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** హనిమిరెడ్డిపల్లి, కోనాపురం చెరువులకు హంద్రీనీవా నీరివ్వాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో బెళుగుప్ప మండలం హనిమిరెడ్డి, కోనాపురం గ్రామాల చెరువులను హంద్రీనీవా ఎస్ఈ రాజగోపాల్, ఈఈ శ్రీనివాసనాయక్, డీఈలు పరిశీలించారు. సోమవారం స్థానిక రామ్‌నగర్‌లోని మంత్రి నివాసంలో హంద్రీనీవా ఇంజనీర్లు సమావేశమయ్యారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ప్యాకేజీ 36ఏ, 36బీ ద్వారా హనిమిరెడ్డిపల్లి, కోనాపురం చెరువులకు నీటిని సరఫరా చేయడానికి ఉన్న సాంకేతిక అవకాశాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. నరసాపురం, గంగవరం, శ్రీరంగాపురం, కోనంపల్లి చెరువులను కూడా పరిశీలించాలని ఆదేశించారు. హంద్రీనీవా నీటిని తరలిస్తే ఆయాప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి, బోర్లు రీచార్జి అవుతాయని మంత్రి తెలిపారు.

### ప్రజాదర్బార్

అనంతపురం క్రైం: మంత్రి కేశవ్ రాంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు అర్జీలు సమర్పించారు. వారితో ముఖాముఖి మాట్లాడారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

# బాబోయ్.. దొంగలు!

## తాళం వేసిన ఏ ఇంటినీ వదలని వైనం

## హడలెత్తుతున్న జనం

## కర్రలతో కాపలా

## •బందోబస్తుకు పోలీసులు •దొంగల స్వైరవిహారం

తలుపు గడియను కట్టర్‌తో కత్తిరించిన దుండగులు

**గుంతకల్లు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కసాపురం రోడ్డు కాలనీల్లో దొంగలు వారం రోజులుగా స్వైర విహారం చేస్తున్నారు. తాళం వేసిన ఏ ఇంటినీ వదలకుండా దోచుకుంటున్నారు. ఇళ్లలో జనం నిద్రపోతున్నా కిటికీ అద్దం పగుల గొట్టి లోపలి గడియ తీయడానికి యత్నించడంతో కసాపురం రోడ్డులోని సిద్ధార్థనగర్, బార్బర్స్ కాలనీ, గౌడకాలనీ, పిరమిడ్ కాలనీ, నేసేకాలనీ తదితర ప్రాంతాలకు చెందిన వారు రాత్రి సమయాల్లో భయాందోళనలకు లోనవుతున్నారు. చోరీలు జరుగుతున్నాయని ఫిర్యాదుచేసినా పోలీసు పహారా ఏమాత్రం లేకపోవడంతో ప్రజలే రాత్రి సమయాల్లో గస్తీ తిరుగుతున్నారు. రాత్రి 12 గంటల నుంచి జట్లుగా ఏర్పడి కర్రలు చేతబట్టుకుని, ఇళ్లపై రాళ్లు పెట్టుకుని కాపలా కాస్తున్నారు. దొంగలు భయోత్పాతం సృష్టిస్తున్నా పోలీసుల పెట్రోలింగ్ లేకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఇంటికి తాళంవేస్తే బద్దలే..

కసాపురం రోడ్డు శివారు కాలనీల్లో వారం రోజులుగా దొంగలు పేట్రేగిపోతున్నారు. రాత్రి 2 గంటలు దాటిన తర్వాత ముఖానికి ముసుగులు వేసుకుని చేతుల్లో పెద్ద ఇనుప రాడ్డు, కట్టర్లతో తాళం వేసిన ఇళ్లను వెతికి చొరబడుతున్నారు. భయం, బెరుకు లేకుండా గేట్లు దూకి పై అంతస్తుల్లోకి సైతం మెట్లెక్కి వెళ్లి తాళం వేసిన ఇంటి తలుపులను తెరిచేస్తున్నారు. తాళం వేసిన గడియ కింద ఉన్న డోర్ బోల్ట్ స్ట్రైక్ ప్లేట్‌ను కట్టర్‌తో కట్ చేసి తాళాన్ని లాగేస్తున్నారు. దర్జాగా లోపలికి చొరబడి వచ్చిన పని కానిచ్చేస్తున్నారు. బార్బర్స్ కలనీలో అస్లాంబాషా ఇంట్లో తులం, చాగ తిక్కయ్య ఇంట్లో ఆరుతులాల బంగారం, 24 తులాల వెండి వస్తువులు, రూ.80 వేలు దోచుకున్నట్లు సమాచారం. డేవిడ్ అనే వ్యక్తి ఇంట్లో నీటి మోటారు, మరొకరి ఇంట్లో రూ.8 వేల విలువైన గృహోపకరణాలను ఎత్తుకెళ్లారు. దొంగలు స్వేచ్ఛగా తిరుగుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో చూసి కాలనీల ప్రజలు డబ్బు, బంగారాన్ని ఇళ్లలో పెట్టకుండా గోల్డ్ ఫైనాన్స్, లాకర్లలో దాచుకున్నారు.

### బందోబస్తు విధులకు..

జిల్లాలో వీవీఐపీల పర్యటన కారణంగా ఇటీవల గుంతకల్లు పోలీసులకు బందోబస్తు డ్యూటీలు ఎక్కువ అయ్యాయి. దీంతో పట్టణంలో రాత్రి సమయాల్లో గస్తీలు తగ్గిపోయాయి. కసాపురం పోలీసు స్టేషన్ సమీప కాలనీల్లో దొంగలు స్వైరవిహారం చేస్తుండడంతో పోలీసులు ఏం చేస్తున్నారంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బందోబస్తుల కారణంగా సిబ్బంది లేరని పోలీసులు తెలిపారు. గత్యంతరం లేక

సిద్ధార్థనగర్‌లో రాత్రి పూట కాపలా కాస్తున్న స్థానికులు

బార్బర్స్ కాలనీ, సిద్ధార్థ నగర్, గౌడ్ కాలనీ, నేసే కాలనీ, పిరమిడ్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకూ కట్టెలు చేతబట్టుకుని కాపలా కాస్తున్నారు. కొందరు ఇళ్లపైన రాళ్లు పోగుచేసుకుని రోడ్లలోని మనుషులను గమనిస్తున్నారు. శుక్రవారం రాత్రి రెండున్నర సమయంలో ముగ్గురు అనుమానితులు ద్విచక్రవాహనంపై చీకట్లో నుంచి రాగా వారిని వెంబడించినా వేగంగా బైక్ నడిపి పారిపోయారు. కాపలా తిరుగుతున్నా రోజూ దొంగలు వచ్చి హల్‌చల్ చేస్తున్నారనీ, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### బిహార్ వర్కర్ల పనేనా?

పట్టణంలో చేపడుతున్న పైపులైన్లు, రైల్వే ఆర్‌వోఆర్ పనుల కోసం బిహార్ నుంచి దాదాపు 50 మంది వర్కర్లు గుంతకల్లుకు వచ్చారు. వారు సిద్ధార్థనగర్‌లో రేకుల షెడ్లు వేసిన భగత్ సింగ్ కాలనీలో ఎవరూ నివాసం లేకపోవడంతో అందులో ఉండి పనులకు వెళ్తున్నారు. వారు పనుల్లో ఉపయోగించే రాడ్ కట్టర్ల సాయంతోనే తలుపుల తాళాలను కట్ చేస్తున్నారన్న అనుమానాలను స్థానికులు వ్యక్తంచేశారు. ఈ మేరకు కసాపురం పోలీసులు వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారు. వారి ఫొటోలను సేకరించి వారి స్వస్థలాల్లో క్రైం రికార్డు ఉందేమో పరిశీలించే పనిలో పడ్డారు. కాగా అన్వర్ బాషా అనే వ్యక్తి ఇంటి తలుపుల గడియలు కత్తిరించి లోపలికెళ్లిన దొంగలకు ఏ వస్తువులూ దొరకలేదు. రామాంజనేయులు అనే వ్యక్తి ఇంట్లో ఉండగానే తలుపు పక్కనున్న కిటికీ తలుపును విరగ్గొట్టి డోర్ లోపలి గడియలను తీయడానికి దొంగలు యత్నించారు. అది చూసిన ఆ గృహస్థుడు బిగ్గరగా కేకలు వేయడంతో దొంగలు బయటి నుంచి గడియపెట్టి పారిపోయారు. కోర్టు సమీపంలో ఆగిపోయిన అంబేడ్కర్ భవన నిర్మాణంపై కొందరు రగ్గులను వదలి వెళ్లారు. అది దొంగల పనే అని భావిస్తున్నారు. చోరీ చేయబోయే ఇళ్ల పక్కనున్న వారి ఇళ్లకు బయటి నుంచి గడియలు పెడుతుండటంతో దొంగలు తమ ఇళ్ల ముంగిట వరకూ వచ్చారని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా గస్తీ రెండు రోజులు చేపట్టి, వదిలేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఊహకందని ధర!

**వరిపొట్టు ధరకు రెక్కలు**
**టన్నుపై నాలుగైదువేలు పెంపు**
**అల్లాడిపోతున్న కోళ్లఫారాల యజమానులు**

ఫారంలో పెరుగుతున్న కోడిపిల్లలు

**మడకశిర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** వరి పొట్టు ధర పెరగడంతో కోళ్ల ఫారాల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదారు నెలల కిందటి వరకు టన్ను రూ.5600 నుంచి రూ.6500 వరకు ఉన్న ధర ప్రస్తుతం పది పదకొండు వేల రూపాయలకు చేరింది. తీవ్ర వర్షాభావంతో వరి సాగు తగ్గడం, అదే సమయంలో కోళ్ల ఫారాలు పెరగడంతో వరి పొట్టుకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా ధరలు పెరగడంతో పెట్టుబడి అంచనాలకు మించిపోతోందని కోళ్లఫారాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కోళ్ల పెంపకానికి వరి పొట్టు కీలకం**

ఫారాలలో కోళ్ల పెంపకానికి వరి పొట్టును ఎక్కువగా వాడుతారు. కోడి పిల్లలను షెడ్డులోకి వదిలడానికంటే ముందే బ్రూడింగ్ ఏర్పాటు చేసి అందులో పొట్టు పరుస్తారు. తర్వాత దానిపై కోడి పిల్లలను వదులుతారు. ఒక ఫారంలో 10 వేల కోళ్లను పెంచితే 3.5 టన్నుల నుంచి 4టన్నుల వరకు వరి పొట్టు అవసరం అవుతుంది. దీంతో పెద్ద సంఖ్యలో కోళ్లను పెంచే ఫారాలకు దాదాపు 30 నుంచి 40 టన్నుల వరకు వరి పొట్టు అవసరం అవుతుంది. ఉమ్మడి జిల్లాలోని ఫారాలలో 45 లక్షలు కోళ్లు పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో వరిపొట్టు సరఫరా తగ్గడంతో డిమాండ్‌తో పాటు ధరా పెరిగింది.

**భారం పెరిగింది**

కోళ్ల పెంపకానికి వరిపొట్టు తప్పనిసరిగా కావాలి. ఆరు నెలల కిందటి వరకు ఈ పొట్టు ధర రూ.5600లు ఉండేది. ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.11వేల దాకా పలుకుతోంది. దీంతో పెట్టుబడి గణనీయంగా పెరిగింది. దీనికితోడు కరెంట్ బిల్లులు, కూలీల కూలి, ఇతర ఖర్చులు కూడా పెరిగాయి. ప్రభుత్వం పౌల్ట్రీ ఫారాలకు సబ్సిడీ అందించి, వరి పొట్టు సరఫరా విషయంలో సహకరిస్తే మాలాంటి చిన్న, మధ్య తరహా పెంపకందారులకు ఊరట లభిస్తుంది.

-హనుమంతు, వలస, అమరాపురం మండలం

## స్వాతంత్య్రోద్యమంలో సంచార జాతుల పాత్ర అమోఘం

**బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి**

● ఘనంగా సంచార జాతుల దినోత్సవం

ర్యాలీ చేస్తున్న సంచార జాతుల ప్రజలు

**అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** స్వాతంత్య్రోద్యమంలో సంచార జాతుల పాత్ర అమోఘమని బీజేపీ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సంచార జాతులు దేశమంతా తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తెచ్చారన్నారు. సంచార జాతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్‌లోని లలితకళాపరిషత్తు నుంచి సుభాష్ రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు కొనసాగింది. ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 70 ఏళ్లకు సంచార జాతులను గుర్తించి, డీఎన్‌టీ సర్టిఫికెట్లు ఇచ్చిన ఘనత బీజేపీకి దక్కిందన్నారు. బీసీ వర్గానికి చెందిన నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేసింది కూడా బీజేపీయేనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలను గుర్తించి రిజర్వేషన్లు కల్పిస్తూ రాజకీయ ప్రాధాన్యత ఇచ్చింది ఎన్టీఆర్ అని కొనియాడారు. 2019 వరకు బీసీ రిజర్వేషన్లు పెంచుతానని ప్రగల్భాలు పలికిన జగన్ 42 శాతం అంటూనే... కోర్టులో పిటీషన్ వేయించి 24 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు వెన్నుపోటు పొడిచాడన్నారు. అదంతా పెద్ద కుట్ర అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి మరోసారి ఘన విజయం సాధించి, ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. సంచారజాతుల అభివృద్ధి కూటమితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రకుమార్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, అధికార ప్రతినిధి వెంకటేశ్వరరెడ్డి, కార్యవర్గసభ్యులు అంకాల్‌రెడ్డి, లలిత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, సెల్స్ రాష్ట్ర కన్వీనర్ చిరంజీవిరెడ్డి, బేడబుడగ జంగాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, బీజేపీ నేత గుడిసె దేవానంద్ పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు ఉద్యమం

**ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రావు**

**జేసీకి ఉద్యమ నోటీసు అందజేత**

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఉద్యోగుల హక్కుల సాధన కోసం దశలవారి ఉద్యమం చేపడుతున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అసోసియేషన్ ఆధ్వర్యంలో జేసీ విష్ణుచరణ్‌ను కలిసి ఉద్యమకార్యాచరణకు సంబంధించిన నోటీసు అందజేశారు. దివాకర్‌రావు మాట్లాడుతూ... ఉద్యమ కార్యాచరణలో భాగంగా సెప్టెంబరు 1 నుంచి 11వతేదీ వరకు దశలవారీ ఉద్యమం చేపడుతున్నామన్నారు. ఆ తర్వాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

వినతిపత్రాలు స్వీకరిస్తున్న జేసీ

**486 అర్జీలు**

జిల్లా ప్రజలు 486 అర్జీలు సమర్పించారు. వాటిలో రెవెన్యూ క్లినిక్‌కు 255, పీజీఆర్ఎస్‌కు 231 వినతులు అందాయి. వాటిని స్వీకరించిన జేసీ విష్ణుచరణ్.. వెంటనే పరిష్కరించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.

## బ్రహ్మోత్సవ శోభ

అలంకరణలో నేమకల్లు అంజన్న

**బొమ్మనహాళ్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పుణ్యాహవచనం, నాంది, రక్షాబంధనం, పంచజన్య, గోపూజ, ధ్వజారోహణం, కలశస్థాపన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు.. స్వామివారిని దర్శించుకున్నారు.

## కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేయాలి

● కాంట్రాక్టు నర్సుల డిమాండ్

సర్వజన వైద్యశాల ముందు ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

**అనంతపురం వైద్యం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వ కాంట్రాక్టు నర్సుల సంఘం (ఏపీజీసీఎన్ఏ).. ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపీ వైద్య, ఆరోగ్య కాంట్రాక్టు ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు సోమవారం 11వ రోజు కొనసాగాయి. సర్వజన వైద్యశాల ముందు భారీ ప్రదర్శన, సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు నాగేంద్ర, ఆర్వీ నాయుడు మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంట్రాక్ట్ నర్సులు సేవలందిస్తున్నారన్నారు. 16ఏళ్లుగా రెగ్యులర్ నర్సింగ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంతి, వైస్ ప్రెసిడెంట్ సుజిత, జేఏసీ కన్వీనర్ లావణ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నారాయణమ్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చాందిని, నేతలు మహేష్, వలి, అశోక్, పవన్, కెఫా, అనంతలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

## డ్వాక్రా లీడర్లకు పోస్టల్ ఏజెంట్లుగా అవకాశం

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** డ్వాక్రా సంఘాల లీడర్లకు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లు, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లుగా పనిచేసే అవకాశం కల్పిస్తున్నట్లు అనంతపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా మహిళలకు అదనపు ఆదాయం కల్పించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జీవిత బీమా అందించే దిశగా భారత తపాలాశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతపురం డివిజన్ పరిధిలో డ్వాక్రా సంఘాల లీడర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9959856926 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## టెట్ చట్టాన్ని సవరించాలి

● యూటీఎఫ్ డిమాండ్

**అనంతపురం విద్య, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** సర్వీస్ టీచర్లకు టెట్ నిబంధన సరికాదనీ, ఈ చట్టాన్ని పార్లమెంటులో సవరించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేసారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లాకేంద్రంలో నిరసన చేపట్టారు. ఆర్ట్స్ కళాశాల నుంచి బైక్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ రోడ్డుపై నిల్చుని టెట్ నిబంధనలు సవరించాలని నినాదాలు చేశారు. యూటీఎఫ్ ఆందోళనకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ సంఘీబావం తెలిపారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న టీచర్లకు ఇప్పుడు టెట్ పాస్ కావాలని చెప్పడం సరికాదన్నారు. వెంటనే టెట్ నిబంధన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రమ్మ, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు రమణయ్య, గోవిందరాజులు, నాగేంద్ర, అనిల్‌కుమార్, గంగాధర్, సరళ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ శ్రేణులు

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## సరికొత్తగా 'వేట'

'కమిటీ కుర్రోళ్లు' ఫేమ్ సందీప్ సరోజ్, సాత్విక జంటగా అశోక్ కోటిపల్లి తెరకెక్కిస్తున్న 'వేట' చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఫణి అడపాక, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకులు కేఎస్ రవికుమార్ క్లాప్ కొట్టగా, సాయిరాజేశ్, ఎస్‌కేఎన్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. నటుడు, నిర్మాత నాగబాబు మేకర్స్‌కు స్ర్కిప్ట్‌ను అందించారు. ఈ సందర్భంగా సందీప్ సరోజ్ మాట్లాడుతూ 'మెగాస్టార్ చిరంజీవి సినిమా టైటిల్‌తో వస్తున్న 'వేట' కథాంశం సరికొత్తగా ఉంటుంది' అని అన్నారు. కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ 'ఇందులో ఊర్లో పెద రాయుడు టైప్ పాత్ర నాది. బాగా నచ్చింది. జెన్‌జీ ఆడియన్స్‌కి కూడా ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు. నిర్మాత ఫణి అడపాక మాట్లాడుతూ 'ఈటీవీ విన్‌తో కలిసి చేస్తున్న మూడో ప్రాజెక్ట్ ఇది. 'కమిటీ కుర్రోళ్లు' లాగా ఇది కూడా ఓ గ్రామీణ కథే. సినిమా ఎంతో సహజంగా ఉంటూనే కమర్షియల్ పంథాలో ఉంటుంది' అని తెలిపారు. దర్శకుడిగా తనకు ఇదే తొలి ప్రయత్నం అని అశోక్ కోటిపల్లి చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకులు యదు వంశీ, అనుదీప్ కేవీ, మెహర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిదాయకంగా ఉంది

**- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

క్యాన్సర్‌ను జయించి జీవితంలో అత్యున్నత శిఖరాలను చేరిన ధీరవనిత చురుకంటి సుమతి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన డాక్యుమెంటరీ 'పునర్నవి'. డా. భీమగాని సుధాకర్ గౌడ్ దర్శకత్వంలో సంతోష్ ఫిల్మ్స్ నిర్మించింది. తాజాగా ప్రముఖుల కోసం ఈ డాక్యుమెంటరీని ప్రత్యేకంగా ప్రదర్శించగా తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'విశేషమైన కృషి, సంకల్పం, పట్టుదలతో అంతర్జాతీయ వేదికలపై భారతదేశానికి గొప్ప పేరును తెచ్చిన సుమతి జీవితం ఆధారంగా రూపొందిన ఈ డాక్యుమెంటరీ అద్భుతంగా ఉంది. క్యాన్సర్‌ను జయించి అందాల పోటీలతో పాటూ క్రీడా రంగాల్లో ఎన్నో విజయాలు సాధించిన ఆమె స్ఫూర్తిదాయక జీవితం అందరికీ ఎంతో ఆదర్శాన్ని ఇస్తుంది' అని అన్నారు.

**మా అబ్బాయి ఉగ్రవాది కాదు..**

## కష్టపడి పైకొచ్చాడు

● యశ్ తల్లి కీలక వ్యాఖ్యలు

'మా అబ్బాయి ఎదుగుదల చూసి కొందరు ఓర్వలేకపోతున్నారు. అందుకే అతడిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారు. మా వాడు ఉగ్రవాది కాదు.. అందరిలా అతను ధనిక కుటుంబంలో పుట్టలేదు. ఒక బస్ డ్రైవర్ కొడుకుగా పుట్టి, తన సొంత కష్టంతో ఈ స్థాయికి ఎదిగాడు' అంటూ కన్నడ స్టార్ హీరో యశ్ తల్లి పుష్ప చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె తన వ్యాఖ్యల్లో ఎవరి పేరూ ప్రస్తావించలేదు కానీ గతంలో అల్లు అరవింద్ 'కేజీఎఫ్ ముందు యశ్ ఎవరు?' అంటూ చేసిన కామెంట్ ఈ మధ్య సోషల్ మీడియాలో బాగా వైరల్ కావడంతో పుష్ప స్పందించి ఆయనని ఉద్దేశించి ఈ తాజా వ్యాఖ్యలు చేశారని నెటిజన్లు అభిప్రాయ పడుతున్నారు. 'కేజీఎఫ్'తోనే యశ్‌కు స్టార్‌డమ్ వచ్చిందనే విషయాన్ని కూడా పుష్ప అంగీకరించలేదు. 'ఆ సినిమాకు ముందు మా అబ్బాయికి ఐదు హిట్లు వచ్చాయి. అప్పటికే వాడికి మంచి గుర్తింపు ఉంది. యశ్‌కు పాన్ ఇండియా స్టార్‌డమ్ ఒక్కరోజులో రాలేదు. కన్నడ చిత్ర పరిశ్రమలో ఎన్నో ఏళ్ల పాటు కష్టపడి, అనేక సవాళ్లను ఎదుర్కొన్న తర్వాతే ఈ స్థాయికి చేరుకున్నాడు. మా వాడి ఎదుగుదల చూసి ఓ తల్లిగా నేనెంతో గర్విస్తున్నా' అని అన్నారు పుష్ప.

## 'కూర్మ అవతార్'... సర్‌ప్రైజ్ చేస్తుంది

**శివరాజ్‌కుమార్**

'కూర్మ అవతార్' టీజర్ అద్భుతంగా ఉంది. విజువల్స్ చాలా బాగున్నాయి. 'ఇరుముడి', 'మహావతార్ నరసింహ' సినిమాల్లాగే మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని దిల్ రాజు అన్నారు. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో హర్షవర్ధన్ కడియాల తెరకెక్కిస్తున్న చిత్రం 'కూర్మ అవతార్'. నరేంద్ర కొండ సమర్పణలో పూజిత, సేవిత నిర్మిస్తున్నారు. సాయికుమార్, రాజ్‌తరుణ్, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి దిల్‌రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి టీమ్‌కు బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో భాగం కావడాన్ని అదృష్టంగా భావిస్తాను. గొప్ప విజన్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం అందరినీ సర్‌ప్రైజ్ చేస్తుంది' అని తెలిపారు.

## ఇంతకీ.. పిల్లి బతికుందా?

హీరో కిరణ్ అబ్బవరం సమర్పణలో కేఏ ప్రొడక్షన్స్, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రం 'హతః'. నల్లపిల్లి కనిపిస్తున్న ఆసక్తికరమైన పోస్టర్‌తో మేకర్స్ టైటిల్ అనౌన్స్ చేశారు. 'ఈ పిల్లి బతికి ఉందా లేక..' అనే క్యాప్షన్ ఆకట్టుకుంటోంది. అనుష్ గోరక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. శివశంకర నాయుడు.వై నిర్మాత. కుష్బు, రెహమాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టుస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కొత్త తరహా కథను స్ర్కీన్ మీద ప్రెజెంట్ చేయబోతున్నాం. మరిన్ని అప్‌డేట్స్‌ని త్వరలో వెల్లడిస్తాం' అని మేకర్స్ తెలిపారు. జేసిన్ జార్జి సంగీతం అందిస్తున్నారు.

**అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి**

## ముస్తాబవుతున్న కశ్మీర్

అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి కశ్మీర్ సిద్ధమవుతోంది. జమ్ముకశ్మీర్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7 నుంచి 10 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. 'చలనచిత్రాల నిర్మాణం, సాంస్కృతిక అధ్యయనం, సృజనాత్మక సహకారానికి కశ్మీర్ కీలక వేదిక కావాలన్నదే ఈ ఉత్సవం ప్రధాన ఉద్దేశం. కశ్మీర్‌తో సినిమాకున్న అనుబంధాన్ని పునర్నిర్మించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. స్థానిక ప్రతిభావంతులకు అవకాశాలు కల్పించడం, గ్లోబల్ సినిమా మ్యాప్‌లో కశ్మీర్‌కి తగినంత గుర్తింపు కలగజేయడం, పర్యాటక అభివృద్ధి వంటివి కీలక అంశాలు' అని నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలకు గానూ ఛాయాగ్రాహకుడు, దర్శకుడు సంతోష్ శివన్ సహా ఐదుగురితో జ్యూరీని ఏర్పాటు చేశారు. 41 దేశాలకు చెందిన 135 చలనచిత్రాలను ఉత్సవంలో ప్రదర్శించనున్నారు. వాటిలో 64 ఎంట్రీలు మన దేశానికి సంబంధించినవి. తొమ్మిది విభాగాల్లో చలనచిత్రాలను ఎంపిక చేసి మొత్తం రూ.96 లక్షల నగదును అందించనున్నారు. ఉత్తమ చలనచిత్రానికి రూ.25 లక్షలను, ఉత్తమ దర్శకుడికి, ఉత్తమ తొలి చిత్ర దర్శకుడికి తలా రూ.15 లక్షలను ఇవ్వనున్నారు. 'ఉత్తమ చిత్రం - జమ్మూకశ్మీర్ సెలక్ట్' కేటగిరీలో రూ.10 లక్షలను, ఉత్తమ నటీనటులకు తలా రూ.8 లక్షలను, ఉత్తమ ఛాయాగ్రాహకుడు, సౌండ్ డిజైనర్, ఉత్తమ ఎడిటర్‌కి తలా రూ.5 లక్షలను ప్రకటించారు. దాల్ లేక్ మీద ఫ్లోటింగ్ స్ర్కీన్ ఏర్పాటు చేయాలనే ప్రణాళిక కూడా అమలులోకి రానుంది.

## ప్రయాణానికి ప్రతిబింబం

శ్రీవిష్ణు హీరోగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ సినిమాను తెరకెక్కిస్తోంది. హారిక సూర్యదేవర నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పిస్తున్నారు. సన్నీ సంజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ మొదలైంది. తాజాగా మేకర్స్ గ్లింప్స్ విడుదల చేశారు. 'నేటి యువత జీవితంలో ఎదుర్కొనే అనుభవాలు, భావోద్వేగాలు, కలలు, ఆశలు, ఆకాంక్షలు, సవాళ్లను ప్రతిబింబించే కథతో చిత్రం రూపొందుతోంది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే సన్నివేశాలు, అన్నీ రకాల భావోద్వేగాలతో కూడిన సరికొత్త ప్రయాణంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఏదో ఒక సందర్భాన్ని గుర్తుచేసేలా ఉండబోతోంది. ఇది మనందరి కథ అనే భావనను కలగజేస్తుంది' అని మేకర్స్ తెలిపారు.

## జీవితాంతం తోడూనీడగా..!

ఇందుమూలంగా అందరికీ తెలియజేయునది ఏమనగా అంటూ 'బలగం' చిత్ర కథానాయిక కావ్య కల్యాణ్‌రామ్‌ని ప్రేమిస్తున్న విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు ప్రముఖ స్వరకర్త కీరవాణి తనయుడు, యువ సంగీత దర్శకుడు కాలభైరవ. కావ్యతో ఉన్న ఫొటోలను పంచుకుంటూ మనసులోని మాటలను పోస్ట్ చేశారు. 'నీతో ఉంటే పర్వతాల దగ్గర కూర్చుని, ప్రవాహాన్ని చూస్తున్నట్టుంటుంది. నీతో కలిసి చేసే ఏ పనైనా, కొనసాగితే బావుంటుందనిపించే విహారయాత్రలా మారుతుంది. శీతాకాలపు ఉదయం నచ్చిన కాఫీ తాగినట్టుంటుంది నీతో మాట్లాడుతుంటే.. ఇంకా ఇలా ఎన్నెన్నో.. ఈ అనుభూతికి ఏం పేరు పెట్టాలో తెలియలేదు. ప్రయాణం కొనసాగుతున్నప్పుడే నాకు అర్థమైంది. ఇల్లంటే ఇలాగే ఉంటుందని. దాన్నే కుటుంబం అంటారని. నిన్ను తొలిసారి చూసినప్పుడు, నువ్వు కొత్త వ్యక్తిలా అనిపించలేదు' అని అందులో పేర్కొన్నారు. తామిద్దరూ జీవితాంతం ఒకరికొకరు తోడూనీడగా ఉంటామన్న విషయాన్ని పంచుకోవడానికి ఆనందంగా ఉందన్నారు. కావ్య కల్యాణ్‌రామ్ కూడా కాలభైరవతో తన బంధాన్ని గురించి పోస్ట్ చేశారు. 'నా జీవితానికి సంబంధించి ఒక అప్‌డేట్. నా ఎల్లో పేపర్ డైసీ అంటే ప్రత్యేకమైన వ్యక్తిని కనిపెట్టేశాను. కొందరు మన జీవితాల్లోకి వచ్చినప్పుడు గులాబి రంగు అద్దాలు అంతేం బాలేనట్టు అనిపించవు. మనం భగవంతుడికి అత్యంత ఇష్టమైన బిడ్డేమో అనిపిస్తుంది. మామూలుగా సాగే నా రోజుల్లో వెలుగులు నింపి, నేను ఈ ప్రపంచంలో గొప్ప అదృష్టవంతురాలినని అనిపించేలా చేసినందుకు ధన్యవాదాలు' అని రాశారు. వీరిద్దరికీ సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

## తెలుగులోకి బెత్లెహెం కుడుంబ యూనిట్

నివిన్ పౌలీ, మమితా బైజు లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'బెత్లెహెం కుడుంబ యూనిట్' సినిమా తెలుగులో అదే పేరుతో సెప్టెంబర్ 4న విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను విడుదల చేస్తోంది. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ దర్శకత్వం వహించారు. తాజాగా తెలుగు ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్‌లో జస్టిన్ అనే పాత్రలో కనిపించారు నివిన్ పౌలీ. తనను తాను ఎంపీ3 కింగ్‌గా పరిచయం చేసుకోవడం ఆకట్టుకుంటోంది. మమిత కాలేజీ విద్యార్థినిగా, గిటార్ వాయిస్తూ.. ఆల్టర్నేటివ్ రాక్ మ్యూజిక్‌ని ఇష్టపడే అమ్మాయిగా కనిపించారు. ప్రేమ, హ్యూమర్, నాస్టాల్జియా, కమ్యూనిటీ డ్రామాను కలగలిపిన ట్రైలర్ సినిమా మీద ఆసక్తి పెంచుతోందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ రిలీజ్, ఫ్యూచర్ రన్ అప్ ఫిల్మ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. దిలీప్ పోతన్, ఫహద్ ఫాసిల్, శ్యామ్ పుష్కరన్ నిర్మాతలు.

# అప్పులు, జల్సాల కోసం గొలుసు చోరీలు

## ఇద్దరు నిందితుల అరెస్టు.. రూ.7.50 లక్షల సొత్తు స్వాధీనం

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ పుల్లయ్య

**అనంతపురం క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఇద్దరూ బాల్య స్నేహితులు. అప్పులు, జల్సాలు తీర్చుకునేందుకు చైన్ స్నాచింగ్‌ల బాటపట్టారు. ఉదయమే నంబర్ ప్లేట్ లేని బైక్‌పై వస్తారు. ఒంటరిగా వెళ్లే వృద్ధులు, మహిళలను టార్గెట్ చేస్తారు. ఒకరు బైక్ నడుపుతుంటే.. మరొకరు చైన్ లాగేస్తాడు. ఇలా బంగారం గొలుసు చోరీలకు పాల్పడే ఇద్దరు నిందితులు ఎట్టకేలకు అనంతపురం టూటౌన్ పోలీసులకు చిక్కారు. కేసు వివరాలను సీఐ పుల్లయ్య.. ఎస్‌ఐలు రిషేంద్ర, రామకృష్ణ, కరిష్మాతో కలిసి సోమవారం వెల్లడించారు. రాజీవ్ కాలనీకి చెందిన షాహిద్, విజయ్ కుమార్ స్నేహితులు. బేల్దారి పనులు చేసుకునేవారు. ఈ క్రమంలో అప్పులు తీర్చేందుకు, వ్యసనాలకు ఈజీగా డబ్బు సంపాదించాలనుకున్నారు. అందుకు చైన్ స్నాచింగ్‌లు మొదలెట్టారు. టూటౌన్ పరిధిలో గతనెల 11న, ఈ నెల 26న గొలుసు చోరీ కేసులు నమోదయ్యాయి. వీటిపై పోలీసులు దృష్టి సారించారు. పక్కా సమాచారంతో నాయక్ నగర్ వద్ద మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచీ రూ.7.50 లక్షల విలువైన 50 గ్రాముల బంగారం గొలుసులు, రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## ఇంటి తాళం పగులగొట్టి..

**గుత్తి రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండలపరిధిలోని కె.ఊబిచెర్లలో గోవిందు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. గోవిందు కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 28న జీవనోపాధి కోసం హైదరాబాదుకు వలస వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయం తెలుసుకున్న దొంగలు చోరీకి పాల్పడ్డారు. హైదరాబాదు నుంచి ఆదివారం రాత్రి వచ్చిన గోవిందు, ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు అనుమానించాడు. బీరువాలను పగులగొట్టి, అందులోని 12 తులాల బంగారం ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మాటలు కలిపి బంగారం మాయం!

### టీచర్ బ్యాగ్ నుంచి 50 గ్రాముల నగల అపహరణ

బాధితురాలు పుష్పలత

ఖాళీగా నగల బాక్సు

**డి. హీరేహాళ్ (బొమ్మనహాళ్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** పరిచయం చేసుకుని మాటలు కలిపిన ఓ మహిళ తోటి ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారు నగలను అపహరించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. డి.హీరేహాళ్ మండలం లింగామనహళ్లికి చెందిన పుష్పలత కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకా రాంపురం గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం కణేకల్లులో నాగులదేవతకు పాలు పోసేందుకు వెళ్లిన ఆమె అనంతరం కణేకల్లు నుంచి సాయంత్రం రాయదుర్గం వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. కణేకల్లు క్రాస్ వద్ద ఓ మహిళ బస్సులో ఎక్కి పుష్పలత పక్కన కూర్చుంది. ఆమెతో పరిచయం చేసుకుని మాటలు కలుపుతూ ఉండగా పుష్పలత దృష్టి మరలిన సమయంలో హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న సుమారు 50 గ్రాముల బంగారు నగలను అపహరించింది. అనంతరం ఆ మహిళ రాయదుర్గం పట్టణంలోని గ్రౌండ్ వద్ద బస్సు దిగి వెళ్లిపోయింది. పుష్పలత పాత బస్టాండ్‌లో దిగిన అనంతరం హ్యాండ్‌బ్యాగ్‌ను పరిశీలించగా బంగారు నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే రాయదుర్గం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఎస్‌ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**గుంతకల్లుటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** స్థానిక ధర్మవరం గేట్ సమీపాన రైలు కింద పడి అముదాల శ్రీనివాసులు(40) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక హనుమేష్ నగర్‌కు చెందిన శంకర్ కుమారుడు శ్రీనివాసులుకు వివాహం కాలేదు. వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు సోమవారం మధ్యాహ్నం ధర్మవరం గేటు సమీపంలోని రైలు పట్టాలపై గూడ్స్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

## అనంతలో గుర్తుతెలియని వ్యక్తి..

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** నగర శివారులోని రాజీవ్ కాలనీ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడు. అనంతపురం-తాటిచెర్ల రైల్వే స్టేషన్‌ల మధ్య సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. బెంగళూరు నుంచి కాచిగూడకు వెళుతున్న వందే భారత్ రైలు(20704) కింద ఆ వ్యక్తి పడ్డాడని రైల్వే ఎస్‌ఐ వెంకటేషులు తెలిపారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతదేహం చెల్లాచెదురుగా పడిందని, మృతుడు తెలుపు చొక్కా, నీలం రంగు పంచె ధరించి ఉన్నారని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించామని, ఆ వ్యక్తిని గుర్తుపట్టేవారు 9247575613 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తిపై దాడి

**నార్పల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** స్థానిక తిక్కయ్యస్వామి వీధిలో నివాసముంటున్న పాముల రాజాపై కుటుంబ కలహాలతో సోమవారం వేటకొడవలితో దాడి చేశారు. పాముల రాజాపై అల్లుడు, మరో వ్యక్తి కలిసి దాడి చేసి, చేతులపై విచక్షణారహితంగా నరికారు. స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో ఆ ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, దాడి చేసిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన రాజాను 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
అనంతపురం : 9985411608
రాప్తాడు : 9000406723
శింగనమల : 9676794155
తాడిపత్రి : 9666204042
గుంతకల్లు : 9985411657
గుత్తి : 8886854127
ఉరవకొండ : 8886540027
కళ్యాణదుర్గం : 9701120019
రాయదుర్గం : 7353839559
హిందూపురం, : 9985445760
మడకశిర, : 9985445760
పెనుకొండ : 9985445760
ధర్మవరం : 9963160529
పుట్టపర్తి : 9740532522
కదిరి : 9052518170
డిసిఎమ్: 9985411154

# సేంద్రియ బాట!

- మారిన రైతు ఆలోచన
- పెరిగిన పేడ ఎరువుల వినియోగం
- తగ్గనున్న పెట్టుబడులు, తెగుళ్లు
- మేలైన దిగుబడులతో లాభాలు

పొలంలో సేంద్రియ ఎరువు కుప్పలు

**కళ్యాణదుర్గం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** అన్నదాతల్లో మార్పు వస్తోంది. రసాయన ఎరువుల నష్టాలపై అవగాహన వస్తోంది. వాటికి దూరంగా జరుగుతున్నారు. సేంద్రియ ఎరువులకు సై అంటున్నారు. వీటి వినియోగంపై అవగాహన పెంచుకుంటున్నారు. లాభాలు తెలుసుకుని, సేంద్రియ సాగుబాట పట్టారు. అన్నదాతను ఆర్థికంగా గట్టెక్కించాలని వ్యవసాయ శాఖాధికారులు సలహాలు ఇస్తున్నారు. సేంద్రియ ఎరువులను వాడాలని ప్రోత్సహిస్తున్నారు. అందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది.

**మేలైన దిగుబడులు**

కర్బూజ, కళింగర సాగుకు సేంద్రియ ఎరువులు ఉపయోగిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చు. తెగుళ్లు కూడా దరిచేరవు. పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పేడ ఎరువు లభ్యత తగ్గింది. దీంతో డిమాండ్ విపరీతంగా పెరిగింది.

-హరీష్, రైతు, కరిగానిపల్లి

### భూసారం పెంపొందించుకునే చర్యలు

రసాయన ఎరువుల అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. వీటి వినియోగంతో భూసారం దెబ్బతింటున్న విషయాన్ని శాస్త్రవేత్తలు, అధికారులు వివరిస్తున్నారు. తెగుళ్లు కూడా విపరీతంగా ఆశిస్తున్న విషయాన్ని తెలియజేస్తున్నారు. దీంతో భూసారాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. పశువులు, మేకలు, గొర్రెల ఎరువుల పొలాలకు తోలుతున్నారు.

### రెండు వేల హెక్టార్లకు పైబడి సాగు

ఖరీఫ్, రబీలో ఏటా కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 2 వేల హెక్టార్లకుపైబడి వేరుశనగ సాగుచేస్తున్నారు. అంతర పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్న ఆలోచనలో రైతులున్నారు. కర్బూజ, కళింగర, టమోటా, బొప్పాయి, మిర్చి, బీర పంటలకు కూడా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నారు. తద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గడమే కాకుండా మేలైన దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. దీంతో పేడ ఎరువులు కొనుగోలు చేసి, పంటలకు వేస్తున్నారు.

### రసాయన ఎరువులతో పెరిగిన పెట్టుబడి

రసాయన ఎరువుల ధరలు రోజురోజుకీ పెంచేస్తున్నారు. వాటి కోసం రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వెరసి పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. రసాయన ఎరువుల వాడకం వల్ల చీడపీడలు సోకి, పంట దిగుబడి తగ్గిపోతోంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే దిశగా రైతులు ఆలోచిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకానికి మొగ్గు చూపుతున్నారు.



**తగ్గిన ఖర్చు**

సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి తగ్గింది. తద్వారా లాభం పెరిగింది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల భూమి గట్టి పడి పంటలకు రోగాలు ఎక్కువ వచ్చేవి. పశువుల ఎరువు వాడకంతో భూమి గుల్ల బారి ఎక్కువ కాలం భూమిలో సత్తువ ఉంటోంది. రోగాలు కూడా తక్కువే. మేలైన దిగుబడులు వస్తున్నాయి. అందుకే ఏటా పశువుల ఎరువునే వాడుతున్నా.

-రామాంజనేయులు, రైతు, కరిగానిపల్లి



**అనేక లాభాలు**

సేంద్రియ ఎరువులతో రైతుకు అనేక లాభాలున్నాయి. ఎక్కువ కాలం భూమిలో తేమ నిల్వ ఉంటుంది. తద్వారా చీడపురుగులు నశిస్తాయి. తెగుళ్లు కూడా తక్కువే. రైతుకు ఖర్చు తగ్గి, అధిక ఫలసాయం లభిస్తుంది.

-ఎల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

# ఉత్తమ ఉద్యోగి.. లంచావతారి..!

### ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

### సర్ కోసం వెళ్లి.. ఇరుక్కున్న పారిశుధ్య కార్మికుడు



రుద్రంపేట పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఇతర అధికారులు, ఇన్‌సెట్‌లో కంబగిరి, హిదయతుల్లా

**అనంతపురం క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఇద్దరు పంచాయతీ కార్యాలయ ఉద్యోగులు ఏసీబీకి ఇచ్చారు. రూ.10 వేలు డిమాండ్ చేసి, రూ.8 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన బోయ నాగేంద్రకు అనంతపురం రూరల్ మండలంలోని కక్కలపల్లి పొలం సర్వే నంబర్ 122/3బీ, ప్లాట్ నంబర్ 21లో 4 సెంట్ల స్థలం ఉంది. అందులో ఇంటిని నిర్మించుకునేందుకు ప్లాన్ అప్రూవ్ చేయాలని పంచాయతీ అధికారులకు దరఖాస్తు చేశారు. దీనికోసం కక్కలపల్లి పంచాతీయ కార్యదర్శి (రుద్రంపేట ఇన్‌చార్జి కార్యదర్శి) హిదయతుల్లా రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.8 వేలకు దిగివచ్చారు. దీనిపై బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు పంచాయతీ కార్యదర్శికి లంచం ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఆయన తరఫున అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో, ఓ టీ స్టాల్ వద్దకు కక్కలపల్లి పంచాయతీ శానిటేషన్ వర్కర్ కంబగిరి వచ్చి రూ.8 వేలు లంచం సొమ్ము తీసుకున్నారు. ఆ వెంటనే ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. నగదును సీజ్ చేసి, కంబగిరిని రుద్రంపేట పంచాయతీ కార్యాలయంలో ఉన్న కార్యదర్శి హిదయతుల్లా వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఇద్దరినీ విచారించారు. అనంతపురం ప్రహ్లాద్ నగర్‌లో ఉన్న హిదయతుల్లా ఇంట్లో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. హిదయతుల్లా భార్య ఎక్సైజ్ కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్నారు.

### ఉత్తమ ఉద్యోగి..

ప్లాన్ అప్రూవల్ కోసం లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి హిదాయతుల్లా ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాలలో ఉత్తమ ఉద్యోగి పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డు అందుకున్న 7 నెలల్లోనే ఏసీబీకి చేతికి చిక్కారు. కక్కలపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఆయన 2024లో బాధ్యతలు చేపట్టారు.

# పాక్షిక రద్దు.. దారి మళ్లింపు

### రైళ్ల వివరాలను ప్రకటించిన అధికారులు

### నాన్ ఇంటర్‌లాకింగ్ పనులే కారణం

**గుంతకల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ముంబై నుంచి గుంతకల్లు మీదుగా వెళ్లే పలు రైళ్లను ఈ నెల, వచ్చే నెలలో దారిమళ్లిస్తామని, లేదా పాక్షికంగా రద్దు చేస్తామని రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. సెంట్రల్ రైల్వేలోని పూనా, హడప్సర్ యార్డుల్లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రైళ్ల మళ్లింపు, పాక్షిక రద్దు ఉంటాయని తెలియజేశారు. బెంగళూరు సిటీ-ముంబై సీఎస్‌ఎంటీ ఎక్స్‌ప్రెస్‌ను(నంబర్ 11302) ఈ నెల (సెప్టెంబరు) 22వ తేదీన షోలాపూర్, కురుద్వాడి, మీరజ్, సతారా, పూనా స్టేషన్ల మీదుగా మళ్లిస్తామని తెలిపారు. ముంబై సీఎస్‌ఎంటీ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ను (22159) ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకూ, అక్టోబరు 4వ తేదీన కళ్యాణ్, ఇగట్పురి, మన్మాడ్, డౌండ్ స్టేషన్ల మీదుగా మళ్లిస్తామని తెలిపారు. నాగర్‌కోయిల్-ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌ను (16340) ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ, చెన్నై సెంట్రల్-ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌ను (12164) అక్టోబరు 2, 3 తేదీల్లో షోలాపూర్, కురుద్వాడి, డౌండ్, అహిల్యానగర్, మన్మాడ్, ఇగట్పురి, కళ్యాణ్ మీదుగా మళ్లిస్తామని తెలిపారు. ముంబై ఎల్‌టీటీ-కోయంబత్తూరు-ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌ను(11013/14) అక్టోబరు 3న, తిరువనంతపురం-ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌ను (16332) ఈ నెల 20న డౌండ్, అహిల్యానగర్, మన్మాడ్, ఇంగ్‌పురి, కళ్యాణ్ స్టేషన్ల మీదుగా మళ్లిస్తామని తెలిపారు. కేఎస్‌ఆర్ బెంగళూరు సిటీ-ముంబై సీఎస్‌ఎంటీ ఎక్స్‌ప్రెస్‌ను (11302) అక్టోబరు 3న, దీని తిరుగు ప్రయాణపు రైలును(11301) అక్టోబరు 4న ముంబై-షోలాపూర్ మధ్య రద్దుపరచి, షోలాపూర్-బెంగళూరు సిటీ మధ్య నడుపుతామని తెలిపారు. వీటితోపాటు పలు రైళ్ల సమయాలను అవసరాల మేరకు సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో మార్చి నడుపుతామని ప్రకటించారు.

# జడ్పీలో 59 మందికి కారుణ్య ఉద్యోగాలు

### చివరిరోజు వరకూ నాన్చి.. ఇచ్చిన పెద్దలు

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈవో విజయలక్ష్మి

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఐదేళ్ల నుంచి కారుణ్య ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. జిల్లా పరిషత్ పరిధిలో 59 మందికి సోమవారం ఉద్యోగాలను కల్పించి, పోస్టింగ్ ఇచ్చారు. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈవో విజయలక్ష్మి వారికి నియామక పత్రాలను అందించారు. వారు ఇచ్చి అప్షన్‌కు అనుగుణంగా స్థానాలను కేటాయించారు. కారణ్య నియామకాలకు ప్రభుత్వం ఇచ్చిన సడలింపు సోమవారంతో ముగిసింది. చివరి రోజు వరకూ నాన్చి, ఎట్టకేలకు ఉద్యోగాలు ఇచ్చారు. 24 మంది జూనియర్ అసిస్టెంట్, 24 మంది టైపిస్టు, 11 మందికి ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్) ఉద్యోగాలను కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో కృష్ణమూర్తి, ఏవోలు నియాజ్ బాషా, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సత్యసాయి కార్మికుల సమ్మె

**కూడేరు, తాడిమర్రి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సత్యసాయి తాగునీటి ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులు మంగళవారం నుంచి సమ్మెకు వెళుతున్నట్లు ప్రకటించారు. మొత్తం 543 మంది కార్మికులు సమ్మెలోకి వెళుతుండటంతో 800 గ్రామాలకు తాగునీటి సరఫరాను సోమవారం నిలిపివేశారు. ఆరు నెలలుగా తమకు వేతనాలు అందడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని, జడ్పీలోకి విలీనం చేయకూడదని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించేదాకా సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు.

## ఇతరుల కార్ల తాకట్టు కేసులో నిందితుడి అరెస్టు

**ఉరవకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** అధిక బాడుగలు చెల్లిస్తామని యజమానులకు ఆశ చూపి, వారి వాహనాలను తాకట్టు పెట్టిన కేసులో ఉరవకొండ అంబేడ్కర్ కాలనీకి చెందిన హనుమంతును అరెస్టు చేశామని సీఐ మహానంది తెలిపారు. సుమారు 13 కార్లను అద్దెకు తీసుకుని, యజమానులకు తెలియకుండానే నిందితుడు కుదువ పెట్టాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 21వ తేదీన కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడి నుంచి 9 కార్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, నిందితుడిని కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. ఎస్‌ఐ జనార్దన్‌నాయుడుతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

# రెండుచోట్ల ఘర్షణ

మేడికుర్తిలో గుమికూడిన ఇరువర్గాలు

**యల్లనూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి):** మండలంలో రెండు వేర్వేరు గ్రామాల్లో సోమవారం వైసీపీ, టీడీపీ వర్గీయులు ఘర్షణ పడ్డారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి మండల పర్యటనలో భాగంగా సోమవారం 11 గంటలకు మేడికుర్తి గ్రామానికి చేరుకున్నారు. ఆ సమయంలో రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద ముళ్లచెట్టును తొలగిస్తుండగా వైసీపీ వర్గీయులు అడ్డుతగిలారు. ఈ విషయంలో టీడీపీ, వైసీపీ శ్రేణులు గొడవ పడడంతో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం 4గంటల సమయంలో చిలమకూరులో జేసీ ప్రభాకర్‌రెడ్డి నడుచుకుంటూ వెళ్తుండగా వైసీపీ వర్గానికి చెందిన కొంతమంది అటుగా రావడంతో గొడవ మొదలైంది. ఈ గొడవలో వైసీపీ వర్గానికి చెందిన భాస్కర్‌కు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. ఈ విషయంలో రెండు గ్రామాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# దాడికేసులో నలుగురు అరెస్టు

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నబీరసూల్

**బొమ్మనహాళ్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని శ్రీధరఘట్ట గ్రామంలో ఈనెల 29వ తేదీ శనివారం చరణ్ అనే యువకుడిపై వేడకొడవళ్లతో దాడి చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన మేరకు, ఉరవకొండ మండలం పెద్ద ముష్టూరు గ్రామానికి చెందిన చరణ్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. దీంతో ఇరుకుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఇరువర్గాల వారు ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టుకుని, రాజీ అయ్యారు. చరణ్ ఆ యువతితో గతంలో దిగిన ఫొటోలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇటీవల అప్‌లోడ్ చేశాడు. దీంతో తమ కుటుంబం పరువు పోయిందని యువతి తండ్రి ఆగ్రహించాడు. చరణ్ శ్రీధరఘట్టలో ఉన్నాడని తెలుసుకుని, హత్య చేసేందుకు సిద్ధమయాడ్యడు. రెండు మచ్చు కొడవళ్లు తీసుకుని మునీంద్ర, నారాయణస్వామి, వన్నూరుస్వామి, ప్రసాద్ అలియాస్ బొంబాయి అనే నలుగురు కలిసి శ్రీధరఘట్టకు వెళ్లి చరణ్‌పై దాడి చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసిన పోలీసులు.. నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు మచ్చు కొడవళ్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రాయదుర్గం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

## టమోటా కిలో రూ.20

**అనంతపురంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** కక్కలపల్లి క్రాస్‌లోని ప్రైవేట్ మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠ ధర రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్‌యార్డు ఇన్‌చార్జ్ కార్యదర్శి మల్లికా సోమవారం తెలిపారు. సరాసరి రూ.15, కనిష్ఠ ధర రూ.10తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 3,500టన్నుల కాయలు వచ్చాయన్నారు.

ఆంధ్రజ్యోతి
సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును. గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర॥7382114647.
AJA- 287934

కావలెను
అనంతపురం టౌన్‌లో ప్రవేట్ ఫ్యాక్టరీ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్ కావలెను. గమనిక:రాయడం మరియు చదవడం రావాలి.
PH:938183814.
AJA-ATP

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
చిన్న ప్రకటన పెద్ద స్పందన

నర్సింగ్ అడ్మిషన్స్
అమెరికన్ కాలేజ్ & స్కూల్ ఆఫ్ నర్సింగ్ నందు అడ్మిషన్లు జరుగుచున్నవి. B.Sc. Nursing (4 Years Course) & GNM (3 Years Course) Paramedical Course (2Years), Cardiology, Anaesthesia, DMLT, DMPHA కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురం సెల్: 9989953273, 7013370612.
AJA -855

WANTED EX- SERVICEMAN
Required Ex-Serviceman, Rolla Tolla plaza NH-544E, Madakasira to Sira, Sri Satya Sai (dist) A.P. Contractor: Coral Associates, Send your Resume to Rollatollplaza01@gmail.com.
AJA - 287692

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

న్యూస్ బాక్స్

## ముగిసిన రాయర ఆరాధనోత్సవాలు

భక్తులకు కుంకుమ, పండు అందిస్తున్న స్వామీజీ

**అనంతపురం క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** జగద్గురు మంత్రాలయ రాఘవేంద్రస్వామి(రాయర) తృతీయ ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక రుద్రంపేటలో సద్గురు రవీంద్రస్వామీజీ స్వగృహంలో తృతీయ ఆరాధనలో భాగంగా ఉదయం, సాయంత్రం శ్రీరాఘవేంద్ర స్వామి, పంచముఖ ఆంజనేయస్వామి దేవతా మూర్తులకు, చిత్రపటాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామీజీ భక్తులకు కుంకుమ, గంధం, పండ్లు అందించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించారు. స్వామీజీ మాట్లాడుతూ దైనందిన జీవితంలో నిత్యం భగవన్నామస్మరణ చేయాలన్నారు. ఎంత బిజీగా ఉన్నా, ఏ పనిచేస్తున్నా ఇష్టదైవాన్ని స్మరిస్తూ ఉండాలన్నారు. ఇలా క్రమక్రమంగా చేస్తుండటం వల్ల ఆలోచనరహితస్థితి వస్తుందన్నారు. తద్వారా సత్సంగత్వానికి దారి చూపుతుందన్నారు.

### మొదటి రోడ్డులో..

ఊరేగింపులో కళాకారుల నృత్యం

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** మొదటిరోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠంలో స్వామివారి 355వ ఆరాధన మహోత్సవాలు ముగిశాయి. చివరిరోజైన సోమవారం స్వామివారి బృందావనానికి ఉత్తరారాధన పూజలు, అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం రంగులపూవులతో అలంకరించిన పూలరథంపై స్వామివారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి నగరంలోని మొదటి, రెండో రోడ్లలో ఊరేగించారు. ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ నిర్వాహకురాలు దేవరకొండ కౌసల్య శిష్యబృందం నిర్వహించిన సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపు అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మఠం నిర్వాహకులు, కళాకారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు

కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయంలో విఘ్నరాజుకు పూజలు

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని నగరంలోని పలు వినాయక ఆలయాల్లో సోమవారం సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. రైల్వేస్టేషను వద్దనున్న వరసిద్ధి వినాయకుడు, చెరువుకట్టపై వెలసిన విజయగణపతి, మల్లేశ్వరిరోడ్డు, మూడోరోడ్డు సాయిబాబా ఆలయం, మొదటిరోడ్డులో వెలసిన వినాయక ఆలయాల్లో మూలవిరాట్టులకు శుద్ధోదక స్నానం, క్షీరాభిషేకం చేశారు. విఘ్నాలు తొలగి కార్యసిద్ధి కలగాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని కోరుతూ వినాయకుడికి గరిక, జిల్లేడుపూలు, కుడుములు, పిండివంటలు నైవేద్యంగా ఉంచి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం పూజలు నిర్వహించారు.

## డిప్యూటీ సీఈవో పీఠం దక్కేదెవరికో..?

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో పీఠం దక్కేదెవరికనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ఉన్న డిప్యూటీ సీఈవో కృష్ణమూర్తి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ స్థానంలో ఇన్‌చార్జిని నియమించేందుకు ముగ్గరితో కూడిన జాబితాను కలెక్టర్‌కు పంపారు. ఇందులో డీడీవో శకుంతల, ఏవోలు మల్లికార్జున, శ్రీనివాసులు ఉన్నట్లు తెలిసింది. డీడీవో సీనియర్ అధికారి అయినా ఇప్పటికే డీఎల్‌పీవో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే శ్రీనివాసులు పేరు జాబితాలో ఉన్నా జూనియర్ ఏవో కావడంతో సీనియర్ ఏవో అయిన మల్లికార్జున ఇప్పటికే ఇన్‌చార్జి డిప్యూటీ సీఈవో బాధ్యతలు చేపట్టిన అనుభవం ఉండటంతో దాదాపు ఆయనకే దక్కే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అయితే కలెక్టర్ ఎవరికి ఆమోదం తెలుపుతారన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

### నేడు ఎమ్మెల్యే రాక

**రాప్తాడు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** రాప్తాడులో ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉదయం 10 గంటలకు హాజరుకానున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సచివాలయ సబ్బంది హాజరుకాలని ఆయన కోరారు.

## అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి

మాట్లాడుతున్న సీడీపీవో ఉమాశంకరమ్మ

**రాప్తాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సీడీపీవో ఉమా శంకరమ్మ ఆదేశించారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. చిన్నారుల వయసుకు తగ్గ బరువు, ఎత్తు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం లబ్ధిదారులే వినియోగించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్‌వైజర్ శ్రీవాణి పాల్గొన్నారు.

# సేవ చేయడమే పరిటాలకు ఘనమైన నివాళి

● ఎమ్మెల్యే పరిటాల సునీత

చిరువ్యాపారులకు తోపుడుబండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**కనగానపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** పేదలకు సేవా కార్యక్రమాల ద్వారా ఆదుకోవడమే పరిటాల రవీంద్రకు ఇచ్చే ఘనమైన నివాళి అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. పరిటాల రవీంద్ర 68వ జయంతిని మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం చిరువ్యాపారులకు తోపుడుబండ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు తరుపున నియోజకవర్గవ్యాప్తంగా రూ.18లక్షల విలువైన 120 తోపుడు బండ్లను చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే అందజేసారు. ముందుగా కేక్ కట్ చేసి పరిటాల రవీంద్ర జయంతి జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిక్షణం పేదప్రజల కోసం తపించే పరిటాల రవీంద్ర జయంతి రోజున ఆయన అభిమానులు పలుప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి విషయంలో రాజీలేకుండా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రం ఆర్థికంగా లోటు బడ్జెట్‌లో ఉన్నా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 16,347 టీచర్ పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశారన్నారు. ఎంతో కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే, సైకో జగన్ డీఎస్సీపై విషంచిమ్మి ఉపాధ్యాయులను అవమానించారన్నారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టి రానున్న పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె సూచించారు. డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, మాజీ ఎంపీపీ సరిపూటి ముకుందనాయుడు, ప్రధానకార్యదర్శి పతకమూరి అంజి, బిల్లే దాము పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా కేజీబీవీలు

● ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప

**గార్లదిన్నె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం కార్పొరేట్‌గా దీటుగా కస్తూర్బా పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తోందని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. విద్యాలయంలో బాలికలకు అందిస్తున్న భోజన నాణ్యత, కూరలను పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా అని ప్రిన్సిపాల్ నాగసత్యను అడిగి తెలుసుకున్నారు. భోజనాలు రుచికరంగా ఉంటున్నాయా? ఇంకా సమస్యలు ఏవైనా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో ఎలాంటి సమస్యలు లేవని, భోజనాలు రుచికరంగా, నాణ్యత ఉన్నాయని విద్యార్థులు తెలపడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ బాలికలు పుస్తకాల జ్ఞానమే కాదు, భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలబడేలా సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్రీడల్లోనూ, సాంస్కృతిక కార్యక్రమాల్లో బాలికలకు ప్రోత్సాహం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగి, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న వెంకటప్ప

## ఆకట్టుకున్న అరంగేట్రం

నృత్యం చేస్తున్న చిన్నారులు

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** నగరంలోని శ్రీనృత్య కళానిలయం వ్యవస్థాపకురాలు సంధ్యామూర్తి నేతృత్వంలో కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణపొందిన నూతన విద్యార్థినుల అరంగేట్రం నృత్యాలు ఆకట్టుకున్నాయి. సోమవారం హెచ్చెల్సీకాలనీలోని యూవీబీ కన్వెన్షన్ హాల్‌లో శ్వేతశ్రీ, సుదీక్షరెడ్డి, జయిని, శ్రీనిధి, పావని, హరిణి, శాంతిప్రియ, వీక్షిత, వైష్ణవి, సిరికుందన తదితరులు వినాయక స్తుతి, పలుకే బంగారమాయనా, సుందర... సుందర శివాశివా, వినరో భాగ్యం విష్ణుకథ.. తదితర పాటలకు చేసిన ఏక, బృంద నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలువులు కళాకారులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### డయల్ యువర్ ఎస్ఈకి 9 ఫిర్యాదులు

**అనంతపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎస్ఈ శేషాద్రి శేఖర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందాయి. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఇద్దరు, 11కేవీ, 33కేవీ విద్యుత్‌లైన్ మార్పు, స్మార్ట్‌మీటర్, కొత్త విద్యుత్ కనెక్షన్, విద్యుత్ స్తంభం తొలగింపునకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. అధిక బిల్లింగ్ వచ్చిందని ఇద్దరు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను సకాలం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఈ తెలిపారు.

### చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు

పతకాలు సాధించిన క్రీడాకారులు

**అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** జాతీయ చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. బెంగళూరులోని ఫోనిక్స్ మాల్ ఆఫ్ ఏషియాలో నిర్వహించిన నేషనల్ స్పోర్ట్స్ సెంట్రిక్ చెస్ చాంపియన్‌షిప్-2026 పోటీలు ని ర్వహించారు. దేశవ్యాప్తంగా 500 మంది వరకు క్రీడాకారులు పాల్గొనగా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన సీనియర్ క్రీడాకారుడు అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు ఓపెన్ క్యాటగిరీలో తృతీయ స్థానంలో నిలిచి నగదు బహుమతి అందుకున్నాడు. జూనియర్ ఓపెన్ విభాగంలో దుర్గాప్రసాద్, అండర్-9 క్యాటగిరీలో శ్రీనిక్ రక్షణ్, అండర్-7 క్యాటగిరీలో శ్రేయాన్స్ విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. విజేతలకు పలువురు చెస్ కోచ్‌లు, తోటి క్రీడాకారులు అభినందించారు.

## ఆరోగ్య కేంద్రంలో పిచ్చిమొక్కల తొలగింపు

ఆరోగ్య కేంద్రంలో శుభ్రం చేయిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి స్పందన

**గార్లదిన్నె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** గార్లదిన్నె ప్రాథమిక ఆ రోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) అవరణలో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారింది. అపరిశుభ్రత నడుమ ఆరోగ్య కేంద్రం అనే శీర్షికన ఆదివారం కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పం దించిన వైద్యఆరోగ్య శాఖ అధికారులు సోమవారం పిచిమొక్కలు, గడ్డిని ట్రాక్టర్ ద్వారా తొలగించారు. దీంతో ఆరోగ్య కంద్రానికి వచ్చే రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ద్రాక్షతోటలో నిట్రాళ్ల ధ్వంసం

పడిపోయిన నిట్రాయి

**అనంతపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** పూలకుంటలోని ద్రాక్షతోటలో ఏర్పాటు చేసిన నిట్రాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామానికి చెంది న తిరుపాల్ రెడ్డి తన భూమిలో ద్రాక్షపంట సాగు చేశాడు. ద్రాక్ష చెట్లు కిందకు పడకుండా ఉండేందుకు నిట్రాళ్లు ఏర్పాటు చేశారు. వాటిలో 20కిపైగా రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఒక్కటి రెండు పూర్తిగా పడిపోగా, మిగిలినవన్నీ విరిగాయి. ద్రాక్షచెట్లకు రాళ్లకు తంతి ఏర్పాటు చేయడంతో అవి పడిపోలేదని రైతులు తెలిపారు. రాళ్లు పడిపోతే పంట పూర్తిగా పడిపోయేదని రైతు చెప్పుకొచ్చాడు. రూ.20వేల వరకు నష్టం వాటిల్లిందన్నారు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

### ఇద్దరికి జరిమానా

**అగళి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్రవాహనం నడిపిన ఇద్దరికి జరిమానా విధించినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. పి.బ్యాడిగెర గ్రామానికి చెందిన నవీన్‌కుమార్, రొళ్ల మండలానికి చెందిన అశ్వత్థప్ప మద్యం సేవించి వాహనం నడుపుతుండగా వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వారిని మడకశిర జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐ సూచించారు.

## విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

**అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** నిబంధనలు విరుద్ధంగా నిర్మాణదశలో ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో చాలా విద్యాసంస్థలు నిర్మాణదశలో ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహిస్తూ, పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. జాతీయరహదారిలో ఉన్న ఓ పాఠశాల పైభాగంలో నిర్మాణం, కింది భాగంలో తరగతులు నిర్వహించడం దారుణమన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా సీబీఎస్ఈ పాఠశాలలో స్టేట్‌బోర్డు సిలబస్‌తో నడుపుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆయా పాఠశాలలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అంకిరెడ్డి, విజయ్, నాగార్జున, ముకేష్ పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

**అనంతపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాల తుది జాబితాను అధికారులు ప్రదర్శించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటనాయుడు జాబితాను ప్రదర్శించారు.



పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల్లో 276 వార్డులున్నాయన్నారు. ఇందులో 310 పోలింగ్ కేంద్రాలు గుర్తించి ప్రదర్శించామన్నారు. ఎంపీడీవో కార్యాలయంతో పాటు తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు.

**గార్లదిన్నె:** పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు, పంచాయతీ కార్యాలయాల ముందు అధికారులు ప్రదర్శించారు. తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీవో బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా అవసరమైన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆమోదంతో తుది జాబితా ప్రచురించామన్నారు. మండల వ్యాప్తంగా 18 పంచాయతీలకు 190 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంఈవో తారా చంద్రానాయక్, పీఆర్ జేఈ శ్రీనివాసులు, జీఎస్‌డబ్ల్యూఎస్ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

ఏకలవ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

## గిరిజనుల ఆరాధ్యదైవం ఏకలవ్యుడు

● విగ్రహావిష్కరణలో వక్తలు

**అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** గిరిజనుల ఆరాధ్య దైవం ఏకలవ్యుడని ఎస్టీ సంఘాల నాయకులు అన్నారు. స్థానిక హౌసింగ్‌బోర్డు ప్రధాన రహదారి నవోదయకాలనీ సర్కిల్‌లో గిరిజన సంఘాల నాయకులు కావేటి ఉమామహేశ్వరి, సాకే చిరంజీవి, కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహాన్ని గిరిజనసంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు, ఆర్ఎంవో డాక్టర్ గుజ్జల హేమలత, ఫైర్ ఆఫీసర్ సాకే లింగమయ్య ప్రారంభించారు. ప్రధాన రహదారిలో గిరిజనుల్లో ఐక్యత, చైతన్యం పెంచేందుకు ఏకలవ్య విగ్రహం ఏర్పాటు దోహదం చేస్తుందని నాయకులు అన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, నగరపాలక సంస్థ ఉద్యోగుల సంఘాలు, గిరిజనులు పాల్గొన్నారు.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రజక సంఘం నాయకులు

**అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** అత్యంత వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి కమ్మన్న మాట్లాడుతూ దేశంలో 17 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారన్నారు. అయితే 10రాష్ట్రాల్లో బీసీ జాబితాలో ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇదివరకే సీఎం చంద్రబాబు రజకులకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ జాబితాలో చేర్చేందుకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్సీ నారాయణ స్వామి, రంగనాథ్, సహాయ కార్యదర్శులు రంగనాయకులు, సాయి, నగర అధ్యక్షుడు సాయిప్రసాద్, రాజు, పెద్దన్న, వెంకటేష్, హరి పాల్గొన్నారు.

## అంకితభావంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

● చైర్మన్ సాంబశివారెడ్డి ● ఎస్ఆర్ఐటీలో ఆరంభ్-2026

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ సాంబశివారెడ్డి

**బుక్కరాయసముద్రం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ప్రతి విద్యార్థి అంకితభావంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ ఆలూరు సాంబశివారెడ్డి, ఆమ్డాక్స్ వైస్ ప్రెసిడెంట్ చక్రవర్తి అన్నారు. సోమవారం రోటరీపురం గ్రామం వద్దనున్న ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆరంభ్-2026 కార్యక్రమాన్ని ఘనంగా నిరహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచి కళాశాలను ఎంచుకుని ఇంజనీరింగ్‌లో చేరడంతో విద్యార్థుల బాధ్యత పూర్తి కాదన్నారు. యాజమాన్యం, అధ్యాపకులు కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ బాలకృష్ణ, డీన్ సాయి చైతన్య కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగుల సేవలు మరువలేనివి: వీసీ

దేవేంద్రనాయక్ దంపతులను సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ఉద్యోగులు

**అనంతపురం ఉన్నతవిద్య, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ బోధన, బోధనేతర ఉద్యోగుల సేవలు మరువలేనివని వీసీ జ్యోతికుమార్ అన్నారు. సోమవారం ఎస్కేయూలో ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ అసిస్టెంట్ దేవేంద్రనాయక్, జూనియర్ అసిస్టెంట్లు సీమియన్ కేఫా, నరసింహులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వీసీ, రిజిస్ట్రార్ రమేష్‌బాబు వారిని ఘనంగా సన్మానించారు. వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయనికి బోధనేతర ఉద్యోగులు ఎనలేని సేవలందించారన్నారు. సంవత్సరాల పాటు సేవలందించిన వారు పదవీవిరమణ పొందడం బాధాకరంగా ఉన్నప్పటికీ... ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదన్నారు. ఫైనాన్స్ ఆఫీసర్ లోకేశ్, పరీక్షల విభాగం కంట్రోలర్ శ్రీరాములు నాయక్, ప్రొఫెసర్ జీవీ రమణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆలూరి లక్ష్మణరావు, బోధనేతర ఉద్యోగులు వెంకటరాముడు, శ్రీనివాసులు, నరేష్, పెద్దన్న పాల్గొన్నారు.

### ఉద్యోగి సేవలను మరువరాదు: జేఎన్‌టీయూ వీసీ

నూర్ మహమ్మద్ దంపతులను సత్కరిస్తున్న వీసీ తదితరులు

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పనసరని... ఆ ఉద్యోగి సేవలను సంస్థ ఎప్పుడూ మరువరాదని జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు అన్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్, వీసీ సెక్రటరీ నూర్ మహమ్మద్ దంపతులకు వీసీ, రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ చేతుల మీదుగా సన్మానించారు. వీసీ మాట్లాడుతూ నూర్ మహమ్మద్ దాదాపు 26 సంవత్సరాల నుంచి ఇంజనీరింగ్ కళాశాలకు అందించిన సేవలు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి యూనివర్సిటీ, కళాశాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. వీసీ ఓఎస్డీ దేవన్న, ఏఆర్, డీఆర్‌లు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తేలును తలపై పెట్టుకున్న బాలిక, తేలును నాలుకపై పెట్టుకున్న యువకులు

# కొండలరాయుడికి నైవేద్యంగా తేళ్లు

## కర్నూలు జిల్లా కోడుమూరులో వింత ఆచారం

కోడుమూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దేవుళ్లకు పళ్లు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించడం చూస్తుంటాం.. అయితే అక్కడ మాత్రం తేళ్లను నైవేద్యంగా సమర్పిస్తారు. కొండలరాయుడు కొలువైన ఆ కొండపై ఏ రాయిని కదిపినా తేళ్లు కనిపిస్తుంటాయి. భక్తులు ఆ తేళ్లను పట్టుకొని చేతులపై, నాలుక, తలపై పెట్టుకొని ఆ తర్వాత స్వామికి సమర్పిస్తారు. ఈ వింత ఆచారం కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ కేంద్రంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఏటా శ్రావణమాసం మూడో సోమవారం భక్తులు తేళ్ల పండుగను నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో కొండ్రాయి కొండపై వెలసిన కొండలరాయుడు (వేంకటేశ్వరస్వామి) ఆలయంలో సోమవారం తేళ్ల పండుగను వైభవంగా నిర్వహించారు.

# వైభవంగా రాఘవేంద్రుడి మహా రథోత్సవం



అశేష జనవాహిని మధ్య కొనసాగుతున్న రాఘవేంద్రస్వామి మహారథోత్సవం.. ఇన్‌సెట్‌లో ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మంత్రాలయంలో మహారథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. రాఘవేంద్రస్వామి 355వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం అత్యంత ప్రాముఖ్యమైన ఉత్తరారాధనలో వజ్ర వైఢూర్య, రత్నాలతో పొదిగిన హారం, బంగారు ఆభరణాలతో అలంకృతుడైన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను(రాఘవేంద్రస్వామి) పల్లకిలో తీసుకొచ్చి మహారథంపై అధిష్ఠింపి పురవీధుల్లో ఊరేగించారు.

## పసిప్రాయపు ప్రతిబింబం..

# 'తుమ్మెదరెక్కల మీద మువ్వన్నె విల్లుల ఆకాశం'

▸▸ కెనడాలో యార్లగడ్డ రాఘవేంద్రరావు కవితాసంపుటి ఆవిష్కరణ

కెనడాలో తన కుటుంబంతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ రాఘవేంద్రరావు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఓ శిశువు పుట్టిన నాటి నుంచి ఏడాది నిండే వరకు ఉండే అమాయక చూపులు, లేత నవ్వులు, ముద్దుముద్దుగా పాకే తీరులు, బుడిబుడి అడుగుల దశలను పదచిత్రాలుగా మలుస్తూ ప్రముఖ కవి యార్లగడ్డ రాఘవేంద్ర రావు రచించిన కవిత సంపుటి 'తుమ్మెద రెక్కల మీద మువ్వన్నె విల్లుల ఆకాశం'. ఈ పుస్తకంలో మొత్తం 63 హృద్యమైన కవితలు ఉన్నాయి. ఈ కవితలకు తగిన ఇంగ్లీష్ అనువాదం కూడా జోడించడం విశేషం. కెనడాలోని ఆస్టా పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో తన మనుమరాలు 18 నెలల అవ్యానాతో రాఘవేంద్రరావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరింపజేశారు. అనంతరం ఇన్‌ప్రిన్సికా అనువాదకులు సవ్యసాచి, కల్యాణి శ్యామల, మండలపర్తి కిషోర్ మాట్లాడుతూ.. కవి అనుభవాల గాఢత నుంచి ఒలికిన ఈ పదచిత్రాలు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. అక్షరాలు, ఛాయాచిత్రాలు కలగలిసి ఒక తాతయ్య మనోఫలకంపై విరిసిన ఈ వాత్సల్య వసంత కవితల దండ, పసిప్రాయపు మాధుర్యాన్ని ప్రేమించే ప్రతి హృదయానికి దక్షిణ అమూల్యమైన కానుక అంటూ విమర్శకుడు ఎన్.విజయరామిరెడ్డి అభివర్ణించారు. పుస్తక సమీక్షకులు నందవరం మృదుల మాట్లాడుతూ, ఈ పుస్తకాన్ని చదివినప్పుడు పురిటింటి బాటసారిని ఇంతలా వర్ణించిన కవిని మరొక చోట చూడలేము అనిపించిందన్నారు. గుర్రం జాషువా పాపాయి పద్యాలలో ఇందులోని ప్రతి కవితలో సార్వజనీన ప్రతిఫలిస్తోందని ప్రశంసించారు.

## రామచంద్రనాయుడుకు నాయుడమ్మ అవార్డు

▸▸ 10న ప్రదానం చేయనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దివంగత శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ అవార్డుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, అమర్‌రాజా బ్యాటరీస్ సంస్థ చైర్మన్ గల్లా రామచంద్రనాయుడును ఎంపిక చేశారు. ఈ విషయాన్ని అవార్డు కమిటీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు సోమవారం గుంటూరు జిల్లా తెనాలిలో ప్రకటించారు. నూతన టెక్నాలజీ వినియోగించి అత్యున్నత నాణ్యతతో బ్యాటరీలను తయారు చేయడంతో పాటు అత్యధిక పన్ను చెల్లింపుదారుగా అమర్‌రాజా సంస్థను రామచంద్రనాయుడు అభివృద్ధి చేశారని చెప్పారు. 2026 నాయుడమ్మ స్మారక అవార్డును ఆయనకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందజేయనున్నట్టు చెప్పారు. అవార్డు ప్రదానోత్సవం ఈ నెల 10న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరుగుతుందని రఘునాథబాబు వెల్లడించారు.

## డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

▸▸ ఏపీ రాష్ట్ర ఆల్ డ్రైవర్స్ జేఏసీ డిమాండ్

నర్సరావు జంక్షన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు, కుటుంబ సభ్యుల సామాజిక భద్రత, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'ఏపీ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు (డ్రైవర్ల సంక్షేమ బోర్డు)' ఏర్పాటు చేయాలని ఏపీ రాష్ట్ర ఆల్ డ్రైవర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ ఏలేటి వాసు డిమాండ్ చేశారు. సోమవారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ తిమ్మాపురంలో ఏపీ రాష్ట్ర ఆల్ డ్రైవర్ల జేఏసీ మొదటి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారిపై జరుగుతోన్న దాడులు, అధికారుల నుండి తరచూ ఎదురయ్యే సమస్యలను చర్చించారు. ఒడిసా, కర్ణాటక రాష్ట్రాల్లో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఉందని, మన రాష్ట్రంలోనూ కార్మికుల సంక్షేమ బోర్డు తరహాలో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జేఏసీ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ బోర్డు ఏర్పాటుతో ప్రమాదవశాత్తూ మరణించినా, సహజ మరణం, శాశ్వత వైకల్యం చెందినా వారి కుటుంబ సభ్యులకు భరోసా కలుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే పలు సంక్షేమ పథకాలను కూడా పొందే వెసులుబాటు ఉందని తెలిపారు. డ్రైవర్లు, కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.

## మారికవలస గురుకులాలను యథావిధిగా కొనసాగించాలి: ఎస్ఎఫ్ఐ

విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా మారికవలసలోని గిరిజన గురుకులాలను యథావిధిగా కొనసాగించాలని, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ కోచింగ్ సంస్థలకు అప్పగించే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే పేరుతో గురుకులాలను తరలించి, పేద విద్యార్థులను కార్పొరేట్ కోచింగ్ సంస్థలకు అప్పగించే చర్యలు సరికాదని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని.. దీనికోసం ఇప్పటికే ఉన్న గురుకులాలను ఖాళీ చేయించి ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించాల్సిన అవసరం లేదన్నారు. కోచింగ్ సెంటర్లను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఏపీఎస్పీ పరేడ్ గ్రౌండులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

## నేటి నుంచి పోలీసు క్రీడోత్సవాలు

▸▸ ప్రారంభించనున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

మంగళగిరి సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఏపీ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల ఒకటి నుంచి 4వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరగనున్న ఈ క్రీడా సంబరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీసు రేంజ్‌లు, యూనిట్ల నుంచి సుమారు 1900 మంది క్రీడాకారులు తలపడనున్నారు. ఈ పోటీల్లో తొలిసారిగా మినిస్టీరియల్ స్టాఫ్‌కు చెందిన క్రీడాకారులు బరిలో దిగనున్నారు. ఏపీఎస్పీ బెటాలియన్‌లోని పరేడ్ గ్రౌండులో మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా క్రీడా పోటీలను ప్రారంభించనున్నారు. వీఐటీ-ఏపీ యూనివర్సిటీ, అమరావతి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానాలు పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు వేదికలుగా నిలవనున్నాయి. వీఐటీలో ఇండోర్, అవుట్ డోర్ క్రీడలు, ఏఎన్‌యూలో ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు, మంగళగిరిలో ఈత పోటీలు, కృష్ణానదిలో జలక్రీడలు, తాడేపల్లి నులకపేటలోని ఫైరింగ్ రేంజ్‌లో షూటింగ్, ఫైరింగ్ పోటీలు నిర్వహిస్తారు. కాగా.. మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌లో పోలీసు క్రీడా పోటీల ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం పరిశీలించి, అధికారులతో సమీక్షించారు.

# వదలని 'శానిటైజర్' మత్తు!

▸▸ తెగ తాగేస్తున్న మందుబాబులు

▸▸ విజయవాడలోని మూడు దుకాణాల్లో గత మూడేళ్లలో 75 వేల బాటిళ్ల విక్రయం

▸▸ లిక్కర్ బ్రాండ్‌ల కంటే తక్కువ ధర

▸▸ శానిటైజర్‌లో 70 శాతం ఇథైల్ ఆల్కాహాల్

▸▸ ఈ మత్తుకు బానిసైన చాలా మంది

విజయవాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తి సమయంలో మద్యం దొరక్క.. మత్తు కోసం 'శానిటైజర్' రుచి మరిగిన మందుబాబులు ఇప్పటికీ దానిని వదలడం లేదు! లిక్కర్ బ్రాండ్‌ల కంటే తక్కువ ధరకే వస్తుండడంతో దీన్ని తెగ తాగేస్తున్నారు!! దీంతో మెడికల్ షాపుల్లోని శానిటైజర్ బాటిళ్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దుకాణాదారులు బిల్లులు లేకుండా వీటి అమ్మకాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. విజయవాడలో ఓ వ్యక్తికి చెందిన మూడు దుకాణాల్లో గత మూడేళ్లలో సుమారు 75 వేల బాటిళ్లు అమ్ముడుపోయినట్లు ఔషధ నియంత్రణ విభాగం అధికారులు గుర్తించారు. అతనికి చెందిన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నగరంలోని పలు మెడికల్ షాపులపైనా డ్రగ్స్ కంట్రోల్ అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. తయారీ కంపెనీల నుంచి శానిటైజర్ కొనుగోలు బిల్లులను తనిఖీ చేస్తున్నారు.

### ఒకే షాపునకు రోజుకు 30 మంది

విజయవాడకు చెందిన ఓ వ్యక్తికి పటమట హైస్కూల్ సమీపంతో పాటు మరో రెండు చోట్ల మెడికల్ షాపులు ఉండేవి. ఈ మూడింటిలో కలిపి గత మూడేళ్లలో దాదాపు 75 వేల శానిటైజర్ బాటిళ్లు అమ్ముడుపోయాయి. బిల్లులు లేకుండానే వీటి విక్రయాలు సాగించారు. శానిటైజర్ కొనుగోలు కోసం రోజుకు 30 మంది వరకు తన దుకాణానికి వచ్చేవారని అధికారుల విచారణలో ఆ షాపు యజమాని చెప్పడం గమనార్హం. వీటిల్లో రెండు షాపులు రెండేళ్లే నడిచాయి. నగరంలోని మరో రెండు మెడికల్ దుకాణాల్లోనూ ఒక్కో షాపు నుంచి 3-5 వేల బాటిళ్ల విక్రయాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై షాపుల యజమానులను అధికారులు ప్రశ్నించగా.. మద్యానికి బానిసైన వ్యక్తులు శానిటైజర్‌ను తాగుతున్నారని వారు చెప్పారు. రూ.50కే 100 మిల్లీలీటర్ల శానిటైజర్ బాటిల్ దొరుకుతుండడం దీనికి కారణమని అంటున్నారు. శానిటైజర్‌లో 70 శాతం ఇథనాల్ (ఇథైల్ ఆల్కాహాల్) ఉంటుంది.

### కొవిడ్ తర్వాత కొరవడిన పర్యవేక్షణ

కొవిడ్ సమయంలో శానిటైజర్ల విక్రయాలకు లైసెన్స్ అవసరం లేదని, ఎవరైనా విక్రయించుకోవచ్చని అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే వైరస్ ప్రభావం తగ్గిన తర్వాత ఆ అనుమతులను వెనక్కి తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు. శానిటైజర్ల విక్రయాలపై ఔషధ నియంత్రణ విభాగం పర్యవేక్షణ కొరవడింది. గతంలోనూ పలుమార్లు మెడికల్ షాపుల్లో తనిఖీలు చేసిన అధికారులు.. ఔషధాలు, సర్జికల్ వస్తువుల విక్రయాల గురించి మాత్రమే ఆరా తీసేవారు. ఇదే అదనుగా భావించిన మెడికల్ షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా శానిటైజర్ అమ్మకాలు సాగించారు. అధికారులు తాజాగా తనిఖీలు నిర్వహించిన మెడికల్ షాపుల్లో కంపెనీల నుంచి శానిటైజర్ కొనుగోలు బిల్లులున్నాయి కానీ.. అమ్మినట్టు బిల్లులు లేకపోవడం గమనార్హం.

### ఎక్కువగా లిక్విడ్ శానిటైజర్

మందుబాబులు ఎక్కువగా ద్రవ రూపంలో ఉన్న శానిటైజర్‌ను తాగుతున్నట్టు షాపుల యజమానులు చెప్పినట్టు అధికారులు తెలిపారు. జెల్ రూపంలో ఉండే శానిటైజర్లు తాగడానికి వీలుపడదు. దీంతో ద్రవ రూప శానిటైజర్ బాటిళ్లు అధికంగా అమ్ముడుపోతున్నట్టు అధికారులు తెలిపారు. అధికారుల తనిఖీల్లో మరో కీలక విషయం బయటపడింది. తనిఖీలు నిర్వహించిన అన్ని మెడికల్ షాపుల్లో శానిటైజర్ బాటిళ్లు ఒకే కంపెనీకి చెందినవి కావడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఎన్టీఆర్ జిల్లాలోని జి.కొండూరులో ఒక కంపెనీ శానిటైజర్ బాటిళ్లను తయారు చేస్తోంది. విజయవాడలోని వన్‌టౌన్‌కు చెందిన హోల్‌సేల్ షాపు నుంచే నగరంలోని మెడికల్ దుకాణాలకు ఈ శానిటైజర్లు సరఫరా అవుతున్నాయని అధికారులు వెల్లడించారు.

## పొగాకు, మద్యం, షాపుల వద్ద

# హెచ్చరిక బోర్డులు

▸▸ హైకోర్టులో పిల్.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ

▸▸ కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశం

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జువైనల్ జస్టిస్ మోడల్ రూల్స్ 2016లోని నిబంధనల ప్రకారం పిల్లలకు మద్యం, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరంగా పేర్కొంటూ షాపుల వద్ద హెచ్చరిక బోర్డులు ప్రదర్శించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ, కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, స్త్రీ శిశు సంక్షేమశాఖ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, హోం, రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, పాఠశాల విద్యాశాఖల ముఖ్యకార్యదర్శులు, జువైనల్ వెల్ఫేర్ డైరెక్టర్, రాష్ట్ర డీజీపీ, ఆరోగ్యశాఖ కమిషనర్, తదితరులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్/ మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. పిల్లలకు మద్యం, పొగాకు ఉత్పత్తులు విక్రయించేవారికి ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించబడుతుందని బోర్డులపై స్పష్టంగా పేర్కొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపించారు. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల చట్టం-2003 ప్రకారం విద్యా సంస్థలకు 100గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయించడానికి వీల్లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరిపినందుకు 2025-26లో 35,449 కేసులు నమోదయ్యాయని వివరించారు. చట్టం అమలు పర్యవేక్షణకు ఏర్పాటైన హైపవర్ కమిటీ క్రమం తప్పకుండా సమావేశం కావాల్సి ఉండగా, 2022 జనవరిలో మాత్రమే చివరి సమావేశం జరిగిందని తెలిపారు. దీనిపై తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## 'కారుమూరి' రిమాండ్ పొడిగింపు

విజయవాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మద్యం రవాణా టెండర్లలో అక్రమాల కేసులో వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్‌కుమార్‌కు ఏసీబీ కోర్టు సెప్టెంబరు 11 వరకు రిమాండ్‌ను పొడిగించింది. ఈడీ అరెస్టు చేసిన కేసులో సునీల్‌కుమార్ హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. రిమాండ్ గడువు ముగియడంతో జైలు అధికారులు ఆయనను సోమవారం విజయవాడలోని ఏసీబీ కోర్టుకు వర్చువల్‌గా హాజరుపరిచారు. దీంతో రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి ఎల్.తేజోవతి ఉత్తర్వులు ఇచ్చారు.

### రౌడీషీటర్ సాయికృష్ణ కేసులో నిందితులకు కూడా..

రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో నిందితులకు కోర్టు సెప్టెంబరు 11 వరకు రిమాండ్‌ను పొడిగించింది. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ సీఐ నాగరాజు, మచిలీపట్నం, ఏలూరు జిల్లా జైళ్లలో ఉన్న మాజీ హెడ్‌కానిస్టేబుళ్లు పోతర్లంక అశోక్‌కుమార్, జంగం నాని, అవనిగడ్డ, గన్నవరం సబ్‌జైళ్లలో ఉన్న మాజీ కానిస్టేబుళ్లు కె.బాబూరావు, జి.సాంబయ్య, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న మాజీ హోంగార్డు కోనేటి వెంకటరాజుకు రిమాండ్ గడువు ముగియడంతో వారిని సోమవారం విజయవాడలోని రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు వర్చువల్‌గా హాజరుపరిచారు. దీంతో రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి ఎస్.శ్రీకాంత్ ఉత్తర్వులు ఇచ్చారు.

# 'పంచదార్ల కొండపై మైనింగ్' వివరాలివ్వండి

▸▸ రాష్ట్ర ప్రభుత్వం, గనులశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

▸▸ 2.153 హెక్టార్ల పరిధిలో నో మైనింగ్ జోన్‌గా జీవో జారీ: ఎస్‌జీపీ

▸▸ ఒక మైనింగ్ లీజు మాత్రమే రద్దు చేశారన్న పిటిషనర్



అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం, పంచదార్ల కొండపై మైనింగ్‌కు అనుమతులు మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, గనులశాఖ అధికారులను ధర్మాసనం ఆదేశించింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచదార్ల కొండ వద్ద మైనింగ్ లీజు మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ అప్పారాయుడుపాలేనికి చెందిన ఉప్పులూరి నాయుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. విజయ్ కుమార్ నాయుడు, రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ లక్ష్మీ నరసింహ మినరల్స్ సంస్థలకు కేటాయించిన మైనింగ్ లీజులను రద్దు చేయాలని కోరారు. ఈ పిల్ సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'పంచదార్ల కొండపై పురాతన శివాలయం ఉంది. ఆ ప్రాంతాన్ని రక్షిత జోన్‌గా ప్రకటించారు. కిలోమీటర్ పరిధిలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతించడానికి వీల్లేదు' అని వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ... పంచదార్ల కొండ ప్రాంతంలో 2.153 హెక్టార్ల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేశామన్నారు. ఆ ప్రాంతాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని కోర్టుకు తెలిపారు. పొన్నవోలు స్పందిస్తూ.. ఆ ప్రాంతంలో మొత్తం మూడు మైనింగ్ లీజులు మంజూరు చేశారని, ఒకటి సిట్టింగ్ ఎంపీ పేరు మీద, మరొకటి అతని డ్రైవర్ పేరు మీద, మరోవ్యక్తి పేరు మీద ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఒకటి మాత్రమే రద్దు చేశారని, మిగిలినవాటిలో ఇప్పటికీ మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని వివరించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పూర్తి వివరాలు సమర్పించాలి గనులశాఖ అధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## రోడ్డు ప్రమాద బాధితులకు రూ.10 లక్షల ప్రకటనపై మంద కృష్ణ హర్షం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 8 మంది మాదిగ సామాజికవర్గానికి చెందిన పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల పరిహారం ఇస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రకటనను స్వాగతిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. పరిహారంలో జాప్యం, స్థానిక ఎమ్మెల్యే సరిగ్గా స్పందించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్ల పైకి వచ్చి నిరసన తెలిపామన్నారు. గుంటూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ మృతదేహాలు ఉన్న సమయంలోనే పరిహారం ప్రకటించి ఉంటే బాధిత కుటుంబాలకు కొంత భరోసా కలిగేదన్నారు. దళితులు బాధితులుగా ఉన్నప్పుడు స్పందనలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు అన్ని వర్గాల బాధితుల పట్ల ప్రభుత్వం ఒకే విధమైన వేగంతో స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఏపీడీఏఎస్‌సీఏసీ ఉద్యోగుల

# పదవీ విరమణ వయసు పెంపు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగులు, వయోవృద్ధుల సహకార సంస్థ(ఏపీడీఏఎస్‌సీఏసీ)లోని రెగ్యులర్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును ప్రభుత్వం 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచింది. మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి సూర్యకుమారి సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

## డీలిమిటేషన్ పేరుతో హక్కులపై దాడి

▸▸ నేడు రామ్ లీలా మైదానంలో సీపీఐ మహార్యాలీ: రామకృష్ణ

న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వన్ నేషన్ - వన్ ఎలక్షన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వంటి ప్రమాదకర ప్రతిపాదనల ద్వారా కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో బ్యాలెట్ పేపర్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని, ఎన్నికల సంఘం పూర్తిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ విదేశాల్లో మత సామరస్యం గురించి ప్రసంగాలు చేస్తున్నప్పటికీ, దేశంలో మైనారిటీలపై జరుగుతున్న అరాచకాలను ఎందుకు ఖండించడం లేదని నిలదీశారు. మణిపూర్‌లో జరిగిన సామూహిక హింస, చర్చిలు, పాస్టర్లపై జరుగుతున్న దాడులపై ఆయన మౌనం వహించడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. దేశంలో మార్పు అనివార్యమని నినదిస్తూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు మంగళవారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సీపీఐ ఆధ్వర్యంలో 'బదలావ్ జరూరీ హై.. చేంజ్ ఈజ్ నెసెసరీ ఫర్ ది నేషన్' పేరుతో మహా ప్రదర్శన నిర్వహించనున్నట్టు రామకృష్ణ తెలిపారు.

## పంచాయతీల్లో 650 మందికి ఒక బూత్

▸▸ 1.36 లక్షల పోలింగ్ బూత్‌ల గుర్తింపు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.36 లక్షల పోలింగ్ బూత్‌లను గుర్తించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల నిర్ధారణకు సంబంధించి సోమవారం తుది ప్రకటన జారీ చేసింది ప్రతి 650 మంది ఓటర్లకు ఒకటి చొప్పున గ్రామ పంచాయతీల్లో పోలింగ్‌బూత్‌లను గుర్తించినట్టు తెలిపింది.

రుకయ్యా, రాఖియా

## ట్రాక్ దాటుతుండగా ఘోరం

▸▸ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అమ్మమ్మ, ఇద్దరు మనవరాళ్లు మృతి

▸▸ బాలికలది శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం

దొడ్డబళ్లాపుర, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని దొడ్డబళ్లాపుర-ముత్తూరు మధ్య రైల్వే ట్రాక్ దాటుతున్న ముగ్గురిని ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దొడ్డబళ్లాపుర పట్టణానికి చెందిన ఇర్ఫానా (46), ఆమె మనవరాళ్లు రుకయ్యా(13), రాఖియా(8) అక్కడికక్కడే మృతిచెందారు. ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన రుకయ్యా, రాఖియా దొడ్డబళ్లాపురలోని తమ అమ్మమ్మ ఇంటికి ఆదివారం వచ్చారు. పాఠశాలకు వెళ్లాల్సి ఉండటంతో హిందూపురానికి తిరిగి వెళ్లేందుకు సోమవారం ఉదయమే దొడ్డబళ్లాపుర రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఒకటో నంబర్ ట్రాక్ దాటుతుండగా వేగంగా వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు వారిని ఢీకొట్టింది. దీంతో అవ్వ, ఇద్దరు మనవరాళ్లు ప్రాణాలను కోల్పోయారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**Andhra Pradesh State FiberNet Limited** APSFL
Proposals are invited from interested agencies for the following RFPs
1. Selection of Agency for the Supply of 24F, 12F, 6F, 2F ADSS Optical Fiber Cables (OFC) and Accessories.
2. RFP for Selection of an Outsourcing Agency for Engagement of Existing Manpower of APSFL.
Details of the RfPs and corrigenda may be downloaded from e-procurement platform tender.apeprocurement.gov.in.
Sd/- Managing Director, APSFL
DIPR RO No.5376PP/CL/ADVT/1/1/2021-22, Dt: 31.08.2026

**AP POWER GENERATION CORPORATION Ltd. VS, VAJAYAWADA-520004.**
APGENCO
(A Govt. of A.P. Undertaking)
NIT No.M100031624-MO3 Tender ID. 983451
**Name of the work:** "Dr. MVR RTPP-BMD-Stage-II-Procurement of Water Wall and Economiser Coil Tubes & Bends to carryout Capital Overhaul Works of Unit-4" through e-procurement. **Schedule available Date & Time:** 31.08.2026-3.30 PM onwards. **Bid submission Closing Date & Time;** 10.09.2026-5.05 PM. For other details visit the website: **https://tender.ape-procurement.gov.in.** Phone: (08563-232229)/262875.
DIPR R.O.No.5374PP/CL/ADVT/1/1/2021-22, Dt.31.08.2026

**APSRTC**
**SHORT TENDER NOTICE**
పల్లె వెలుగు
Tenders are invited through ONLINE ("www.tender.apeprocurement.gov.in") for 1) Construction of Model Bus Station at Kuppam, Chittoor District (including Civil works, yard work, Water Supply & Sanitary Arrangements, Electrification, Firefighting system, HAVC works, CCTV and PA System, STP Works and land Scrapping works). For full Tender Notice please visit "**www.apsrtc.ap.gov.in**". For Online participation please visit "**https://tender.apeprocurement.gov.in**". **NOTE:** Bid Document Down load Start Date & Time: **07.09.2026, 4.00PM.** Bid Submission Closing Date & Time : **23.09.2026, 4.00 PM.** Further details: Ph. Nos:9948466588/9959224533 (10.00 AM to 5.30 PM). APSRTC reserves the right to cancel or reject any tender or all the tenders of this notification without assigning any reason at any stage.
NIT No.14/CCE/APSRTC/2026-27, Dt.31.08.2026 — Chief Civil Engineer, APSRTC, Vijayawada

**A.P. POLLUTION CONTROL BOARD**
Paryavaran Bhavan, APIIC Colony Road, VIJAYAWADA-520 007.
**NOTICE**
The Andhra Pradesh Pollution Control Board (APPCB) hereby inform to all Building & Construction projects and Townships and Area Development Projects to obtain prior Environment Clearance(EC) as required under the Provisions of EIA Notification, 2006 & Amendments thereof and CTE & CTO as required under Water (Prevention and Control of Pollution) Act, 1974 and Air (Prevention and Control of Pollution) Act, 1981.
The MoEF & CC, Govt. of India has stipulated threshold limits for obtaining EC as below:
**8(a).** Building and Construction Projects (The projects or activities also include industrial shed, school, college, hostel for educational institution) -> 20,000 sq.m. and <1,50,000 sq.m. of built-up area.
**8(b).** Townships and Area Development Projects - Covering an area >50 ha and / or built-up area >1,50,000 sq.m.
All applicable Building and Construction Projects shall apply for Environment Clearance through the online portal: **https://parivesh.nic.in** and for CTE & CTO from APPCB through **(https://www.apindustries.gov.in/APIndus/UserInterface/SingleWindowServicesApplication/LoginPortal/Introduction.aspx).**
The Defaulters / Violators shall be liable for Penalisation / levy of Environmental Compensation under the relevant laws.
For further details and guidelines, please visit the APPCB website **https://pcb.ap.gov.in** or contact nearby **APPCB, Regional Office.**
Sd/- Member Secretary, APPCB

స్కిన్ కేర్

**నడి వయసులో పులిపిర్లు, మంగు లాంటి చర్మ సమస్యలు మొదలవుతాయి. అసౌకర్యంగా, ఎబ్బెట్టుగా కనిపించే ఈ సమస్యలను వదిలించే చర్మ చికిత్సలు నేడు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.**

# చర్మ సమస్యలకు చెల్లు చీటీ

నడి వయసులో హార్మోన్ల అసమతౌల్యం వల్ల చర్మం పలు మార్పులకు లోనవుతుంది. దాంతో పులిపిర్లు, మచ్చలు లాంటివి తలెత్తడం మొదలుపెడతాయి. వీటితో చర్మానికి ఎలాంటి ప్రమాదం లేకపోయినా, అసౌకర్యంగా, ఇబ్బందికరంగా మారినప్పుడు వీటిని తొలగించుకోవడంలో తప్పు లేదు.

### పులిపిర్లు పలు చోట్ల

కొందరికి నడి వయసుకు చేరుకోగానే మెడ చుట్టూరా, ముఖం మీదా, బాహుమూలాల్లో, తొడల దగ్గర పులిపిర్లు పెరుగుతాయి. కొందర్లో ఇవి చిన్న పరిమాణానికే పరిమితమైతే, కొందర్లో పెద్దగా పెరిగిపోతాయి. అయితే ఈ పులిపిర్లతో ఆరోగ్యానికి ఎలాంటి నష్టం లేకపోయినా, చూపులకు ఇబ్బందికరంగా మారొచ్చు. అలాంటప్పుడు చర్మ వైద్యులను కలిసి వీటిని తొలగించుకోవచ్చు. అయితే ఒకసారి తొలగించుకున్నంత మాత్రాన మళ్లీ తలెత్తవని అనుకోకూడదు. వీటిని తీయించుకున్నా, తీయించుకోకపోయినా తలెత్తేవి తలెత్తుతూనే ఉంటాయి. కొందరు మహిళల్లో గర్భధారణ సమయంలో పులిపిర్లు తలెత్తుతూ ఉంటాయి. గర్భధారణ సమయంలో బరువు పెరిగి, ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరగడం వల్లే ఇలా జరుగుతుంది. అలాగే కుటుంబ చరిత్రలో పులిపిర్లు ఉన్నా, వాళ్లకు కూడా పులిపిర్లు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చాలా మంది పులిపిర్లను వదిలించుకోవడం కోసం, సామాజిక మాధ్యమాల్లో కనిపించే చిట్కాలు పాటిస్తూ ఉంటారు. వార్ట్ రిమూవల్ క్రీమ్స్ కొని వాడడం, సున్నం పులిపిర్ల మీద పెట్టడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇలాంటి ప్రయత్నాలతో పులిపిర్ల పూర్తిగా తొలగిపోకుండా సగం ఊడిపోయి, సగం ఉండిపోతుంది. దాంతో ఇన్‌ఫెక్షన్ తలెత్తి నొప్పితో బాధపడవలసి వస్తుంది. ఇలాంటి చిట్కాలతో మచ్చల సమస్య కూడా ఎక్కువే! కాబట్టి చర్మ వైద్యులను కలిసి లేజర్, రేడియో ఫ్రీక్వెన్సీ చికిత్సలతో వీటిని సురక్షితంగా తొలగించుకోవాలి. పెద్ద పులిపిర్లను తొలగించినప్పుడు కొంత మేరకు మచ్చ ఏర్పడవచ్చు. కానీ చిన్న వాటితో ఎలాంటి మచ్చలూ ఏర్పడవు.

### ఎబ్బెట్టుగా కనిపించే ఎర్ర మచ్చలు

నడి వయసులో చర్మం మీద కనిపించే ఎర్రని మచ్చలు పెరుగుతాయి. చెర్రీ యాంజియోమాస్ అనే చర్మ లక్షణమిది. చర్మం అడుగున ఉండే సూక్ష్మ రక్తనాళాలు కలిసిపోవడం వల్ల చర్మం మీద ఈ మచ్చలు తలెత్తుతూ ఉంటాయి. వీటితో ఎలాంటి ప్రమాదం ఉండదు. అరుదుగా కొందర్లో కాలేయ సమస్యల ఫలితంగా ఈ తరహా రెడ్ మోల్స్ ఎక్కువగా పెరిగిపోతాయి. అయితే ఈ మచ్చలు చర్మం మీద ఎబ్బెట్టుగా కనిపిస్తున్నప్పుడు లేజర్ లేదా రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా వీటిని తొలగించుకోవచ్చు. చికిత్సతో చిన్న మచ్చల స్థానంలో ఎలాంటి మచ్చలు ఏర్పడకపోయినా, పెద్ద వాటిని తొలగించినప్పుడు మచ్చలు ఏర్పడవచ్చు.

### ముఖం మీద మంగు

కొందరు మహిళల్లో మెనోపాజ్ దశలో ముఖం మీద మంగు మచ్చలు మొదలవుతాయి. ఇంకొందరు మహిళల్లో గర్భిణి దశలోనే ఈ మచ్చలు మొదలవుతాయి. ఈ మచ్చలు పురుషుల్లో కూడా కనిపిస్తూ ఉంటాయి. వీటిని శాశ్వతంగా తొలగించే చికిత్సలు లేవు. బ్యూటీ సెలూన్లలో సూచించే క్రీమ్స్‌ను ఈ మచ్చల కోసం వాడుకోకూడదు. ఏడాది పొడవునా, 365 రోజులూ చర్మ వైద్యులు సూచించే నైట్ క్రీమ్స్ వాడుకోవాలి. వీటితో తగ్గని సందర్భాల్లో కెమికల్ పీల్స్, అంతిమంగా లేజర్ లాంటి ఆధునిక చికిత్సలను ఆశ్రయించవలసి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఈ చికిత్సలతో కూడా మంగు మచ్చలు తొలగకపోవచ్చు. పిగ్మెంటేషన్, చర్మం లోపలి పొరల్లో ఉన్నప్పుడు మచ్చలను తొలగించడం కష్టమవుతుంది. కొన్ని నోటి మాత్రలు కూడా వాడుకోవచ్చు. కానీ కొన్ని రకాల వ్యాధులు లేవని నిర్ధారించుకున్న తర్వాతే వీటిని వాడుకోవాలి. చికిత్సలతో మంగు వదిలినా, జీవితాంతం క్రీమ్స్ వాడుకుంటూనే ఉండాలి.

> చర్మం మీద తలెత్తే పులిపిర్లు, రంగు మచ్చలను తొలగించుకోడానికి ఉపయోగించే లేజర్ లేదా రేడియో ఫ్రీక్వెన్సీ చికిత్సలతో ఎలాంటి నొప్పి, అసౌకర్యం కలగదు. చికిత్సకు ముందు ఆ ప్రదేశాన్ని మొద్దుబార్చే క్రీమ్‌ను అప్లై చేసి, ఆ తర్వాతే వాటిని తొలగిస్తారు. కాబట్టి భయపడవలసిన అవసరం లేదు.

### ఉబ్బెత్తు మచ్చలు

వయసు పైబడడం వల్ల చర్మం మందంగా మారి, నల్లబడే సమస్య ఇది. సెబోరిక్ మెలనోసిస్ అనే ఈ నల్లని, ఉబ్బెత్తు మచ్చలు పొట్ట లేదా కాళ్ల మీద తలెత్తుతూ ఉంటాయి. ఈ మచ్చలు క్రమేపీ పెరుగుతూ ఉంటాయి. కాబట్టి కొందరు చర్మ క్యాన్సర్ అనుకుని భయపడుతూ ఉంటారు. అయితే వైద్యులు డెర్మోస్కోపీతో పరీక్షించి క్యాన్సర్ కాదని నిర్ధారిస్తూ ఉంటారు. లేజర్‌తో వీటిని తొలగించవచ్చు. పెద్ద మచ్చలను సర్జరీతో తొలగించుకోవాల్సి ఉంటుంది. అయితే ఇవి పులిపిర్ల మాదిరిగా ఎక్కువ సంఖ్యలో తలెత్తడానికి బదులుగా రెండు, మూడు లేదా నాలుగు మచ్చలకే పరిమితమైపోతాయి. ఈ మచ్చలను చికిత్సతో పూర్తిగా తొలగించవచ్చు.

**డాక్టర్ స్వప్నప్రియ**
డెర్మటాలజిస్ట్, కాస్మొటాలజిస్ట్,
హైటెక్‌సిటీ, హైదరాబాద్.

# మెల్ల కన్ను మతలబులు

మెల్ల కన్నుకు పలు కారణాలుంటాయి. ప్రతి మెల్ల కన్నుకూ కండరాల అసమతౌల్యం కారణం కాదు. దృష్టి లోపం వల్ల మెల్ల కన్ను రావచ్చు. కంజన్‌జైవల్ క్యాటరాక్ట్ అనే కంటి పొరల వల్ల కూడా మెల్ల కన్ను రావచ్చు. రెటినోబ్లాస్టోమా వల్ల కూడా మెల్ల కన్ను రావచ్చు. కాబట్టి కారణం ఏదన్నది కచ్చితంగా కనిపెట్టి, సరైన సమయంలోగా సరిదిద్దుకోవాలంటే మెల్ల కన్ను కనిపించిన వెంటనే అప్రమత్తం కావాలి.

### పసికందుల్లో మెల్ల కన్ను

ఇన్‌ఫాంటైల్ స్క్వింట్, నాలుగు నుంచి ఆరు నెలల పసిపిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. కొందరు పిల్లల్లో ఈ తరహా మెల్ల కన్ను తొమ్మిది నెలల వయసుకు దానంతట అదే సరి అయిపోతుంది. అయితే కొన్ని మెల్లలు సరికావు. అలాంటప్పుడు చికిత్సలో సరిచేయవలసి ఉంటుంది. సాధారణంగా పిల్లలకు రెండు నుంచి ఐదేళ్ల వయసులో త్రీడి విజన్ అభివృద్ధి చెందుతుంది. ఈ దృష్టి అభివృద్ధి కావాలంటే రెండు కళ్లూ పని చేయాలి, అవి నేరుగా చూడగలగాలి, దృష్టి కూడా బాగుండాలి. ఈ మూడు అంశాలు మెరుగ్గా ఉండాలంటే కళ్లలో మెల్ల ఉండకూడదు. కాబట్టి మెల్ల కన్నును ఏడాది వయసులోపే సరి చేయించాలి. అందుకోసం పిల్లల్లో మెల్ల కన్ను కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను కలిసి, అందుకు రెటినోబ్లాస్టోమా, కంజన్‌జైవల్ క్యాటరాక్ట్ లాంటివి కారణం కాదనీ ఇన్‌ఫాంటైల్ స్క్వింట్ అనీ నిర్ధారించుకోవాలి. తర్వాత వైద్యులు చెప్పినట్టు తొమ్మిది నెలల వరకూ ఆగవచ్చు. ఒకవేళ మెల్ల కన్నుకు రెటినోబ్లాస్టోమా, కంజన్‌జైవల్ క్యాటరాక్ట్ కారణమైతే ఈ సమస్యలను చికిత్సతో సరిదిద్దుకోవాలి.

### చికిత్సలున్నాయి

రెండు కళ్లలో క్యాటరాక్ట్ ఉంటే కాస్త ఆలస్యంగా, ఒక కంట్లో క్యాటరాక్ట్ వల్ల ఆ కంటి చూపు పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది కాబట్టి వెంటనే సర్జరీతో సరిచేయాల్సి ఉంటుంది. రెటినోబ్లాస్టోమా క్యాన్సర్ కణితి కాబట్టి వెంటనే చికిత్స చేయాల్సిన అవసరం ఉంటుంది. పసిపిల్లల్లో మెల్లకన్నుకు దృష్టి లోపం కూడా ఒక కారణం కాబట్టి దాన్ని సరిచేయడం కోసం కళ్లజోడు వాడాల్సి ఉంటుంది. పసిపిల్లల్లో దృష్టి లోపం ఎంతో ఎక్కువగా ఉంటుంది. దాంతో వాళ్లకేమీ కనిపించదు. కాబట్టి తప్పనిసరిగా కళ్లజోడు వాడుకోవాలి. మెల్ల కన్నుకు తీవ్రమైన సమస్యలేవీ కారణం కాకుండా కేవలం ఇన్‌ఫాంటైల్ స్క్వింట్ మాత్రమే కారణమైనప్పుడు, వైద్యులు చెప్పినట్టు తొమ్మిది నెలల వయసొచ్చేవరకూ ఆగాలి. ఆ తర్వాత కూడా మెల్ల కళ్లు సరికాని పక్షంలో ఈ పిల్లలకు కూడా చికిత్స అవసరమవుతుంది. ఈ చికిత్సలను ఆశ్రయించకుండా పసిపిల్లల మెల్ల కన్నును పట్టించుకోకుండా వదిలేస్తే, రెండు నుంచి ఐదేళ్ల లోపు అభివృద్ధి కావలసిన త్రీడి విజన్ అభివృద్ధి కాదు.

### మెల్ల కన్ను అదృష్టం కాదు

మెల్ల కన్ను అదృష్టమనే అపోహ సర్వత్రా నెలకొని ఉంది. దాంతో చిన్న వయసులో సరిదిద్దుకోవలసిన ఈ సమస్యను నిర్లక్ష్యం చేసి, పెళ్లీడు వయసులో సంబంధాలు కుదరక వైద్యుల దగ్గరకు పరిగెత్తుకొస్తూ ఉంటారు. అలాగే చిన్న వయసులోనే పిల్లలకు సర్జరీ చేయించకుండా పెద్దయ్యాక చేయించాలనుకునే పెద్దలూ ఉంటున్నారు. కానీ పిల్లల మెల్లకన్నును సరిదిద్దడానికి వైద్యులు ఏడాదిలోపే సర్జరీని సూచించినా, కళ్లజోడును సూచించినా కాదనకూడదు. జంతువుల నుంచి మనుషులను వేరు చేసేది త్రీడి దృష్టి. అలాంటి త్రీడి దృష్టిని పిల్లల నుంచి లాక్కునే హక్కు పెద్దలకు లేదు. పరిసరాలు, వస్తువుల మధ్య దూరాలను అంచనా వేయడానికి త్రీడి దృష్టి అవసరం. ఇది లోపిస్తే, దృష్టిలో డెప్త్ లోపించి అంతా చదునుగా కనిపిస్తుంది. అలాగే మెల్లకన్నుతో కంటిచూపు కూడా మెరుగ్గా ఉండదు. మెల్ల కన్ను పిల్లలు హేళనలు, అవమానాలను కూడా ఎదుర్కొంటారు. దాంతో ఆత్మవిశ్వాసం దెబ్బతిని, మానసికంగా కుంగిపోతారు. కాబట్టి పిల్లల్లో మెల్ల కన్నును అదృష్టంగా భావించకుండా, వెంటనే వైద్యుల దృష్టికి తీసుకువెళ్లి, వారి సూచనలను పాటించాలి.

### నాలుగేళ్ల పిల్లల్లో మెల్ల

కొందరు పిల్లల్లో నాలుగు లేదా ఐదేళ్ల వయసులో మెల్ల కన్ను మొదలవుతుంది. ఈ మెల్ల ప్రధానంగా పిల్లల్లో దృష్టి లోపం వల్ల తలెత్తుతుంది. కాబట్టి ఈ వయసు పిల్లల్లో మెల్ల కనిపించిన వెంటనే వైద్యుల దగ్గరకు తీసుకువెళ్లాలి. కొందరు పిల్లల్లో కళ్లజోడుతో మెల్ల పూర్తిగా సరి అయిపోతుంది. కొందరు పిల్లల్లో కళ్లజోడుతో మెల్ల సగం వరకూ సరి అవుతుంది. అరుదుగా కొందరు పిల్లల్లో కళ్లజోడు వల్ల కూడా మెల్ల సరి కాకపోవచ్చు. ఇలా వైద్యులు, కళ్లజోడుతో పిల్లల మెల్లను సరి చేసే ప్రయత్నం చేసి, అంతిమంగా ఫలితం కనిపించని సందర్భాల్లో సర్జరీని ఆశ్రయిస్తూ ఉంటారు. ఈ వయసు పిల్లల్లో మెల్లను సరి చేయడం ఎంతో ముఖ్యం.

### పెద్దల్లో మెల్ల కళ్లు

మెల్ల కన్నును ఏ వయసులోనైనా సరి చేయవచ్చు. కనుగుడ్లు ముక్కు వైపు లోపలకు తిరిగి ఉన్నా, బయటి వైపుకు తిరిగి ఉన్నా, వాటిని సులభంగా సరి చేయవచ్చు. అయితే కొందరికి రెటీనా సమస్యలుంటాయి. వీళ్లకు సర్జరీ తదనంతరం, మెల్ల కన్ను తిరగబెట్టే అవకాశాలు రెండు నుంచి ఐదు శాతం వరకూ ఉంటాయి. దృష్టి లోపం తక్కువగా ఉన్న వాళ్లకు మెల్ల కన్ను తిరగబెట్టే అవకాశాలు ఎక్కువగా, దృష్టిలోపం ఎక్కువగా ఉన్న వాళ్లకు మెల్ల కన్ను తిరగబెట్టే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అయితే మెల్లకన్ను తిరగబెట్టే అవకాశాలు ఏ మేరకు ఉంటాయన్నది వైద్యులు మాత్రమే చెప్పగలుగుతారు. కొందర్లో కంటి పక్షవాతం వల్ల 'పారాలైటిక్ స్క్వింట్' వస్తుంది. ఈ కోవకు చెందిన వాళ్లలో సర్జరీ తదనంతర ఫలితం తక్కువగా ఉంటుంది. మధుమేహుల్లో ఈ సమస్య ఎక్కువ.

**డాక్టర్ ఆశా సందని**
ఆప్తల్మాలజీ కన్సల్టెంట్, హైదరాబాద్.

# దేశంలో చిప్‌ల తయారీకి రూ.1.27 లక్షల కోట్ల ప్రోత్సాహకాలు

## సెమీకాన్ 2.0 పథకాన్ని ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో సెమీకండక్టర్ల (చిప్) తయారీని ప్రోత్సహించేందుకు ఏకంగా రూ.1.27 లక్షల కోట్ల కేటాయింపులతో రూపొందించిన 'సెమీకాన్ 2.0' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ పథకానికి అర్హతలతో పాటు ఈ రంగ పరిశ్రమలకు అందించనున్న ప్రోత్సాహకాల వివరాలను వెల్లడించింది. ఇందులో భాగంగా చిప్ తయారీ, అసెంబ్లింగ్ ప్లాంట్లకు రూ.50 కోట్ల నుంచి రూ.20,000 కోట్ల పెట్టుబడిపై 25% నుంచి 40% వరకు ఆర్థిక మద్దతు ఇవ్వనుంది. అలాగే, దేశీయంగా చిప్ డిజైనింగ్, ఆర్ అండ్ డీని మరింత ఆకర్షణీయంగా మార్చింది. ఆర్ అండ్ డీ వ్యయంలో 75% ప్రోత్సాహకంగా లభించనుంది. సెమీకండక్టర్ నిపుణుల అభివృద్ధి సైతం ఇదే స్థాయి ప్రోత్సాహకాలు లభించనున్నాయి. దేశంలో ఓఎల్ఈడీ, మైక్రో ఎల్ఈడీ, ఎల్‌సీడీ టెక్నాలజీ డిస్‌ప్లేల తయారీకి సైతం ఈ పథకం మద్దతివ్వనుంది. అంతేకాదు, ఈ పథకంలో భాగంగా అత్యాధునిక టెక్నాలజీ ఉత్పత్తుల్లో ఉపయోగించే 3-7 నానోమీటర్ల సూక్ష్మ చిప్‌లను దేశీయంగా అభివృద్ధి చేయడంపైనా దృష్టి పెట్టాలనుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

### వ్యూహాత్మక వనరుగా మారిన చిప్‌లు

ప్రపంచవ్యాప్తంగా చిప్‌లు వ్యూహాత్మక వనరుగా మారాయి. ఎందుకంటే, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత శరవేగ వృద్ధితో ఆధునిక చిప్‌లు, మెమొరీ ఉత్పత్తులకు భారీగా డిమాండ్ నెలకొంది. అదే సమయంలో సరఫరా అవాంతరాలు, భౌగోళిక రాజకీయ ప్రాధాన్యాలు వేగంగా మారుతుండటంతో ఈ రంగంలోని అంతర్జాతీయ దిగ్గజాలు చిప్‌ల తయారీ సామర్థ్యాన్ని విస్తరించుకోవడంతో పాటు చైనా, తైవాన్ వంటి చిప్ తయారీ హబ్‌లపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటున్నాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం ఈ రంగంలోకి అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించడంతో పాటు మన స్టార్టప్‌లు ఆధునిక చిప్ డిజైనింగ్ కోసం కృషి చేసే దిశగా ప్రోత్సహిస్తోంది.

### రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు

సెమీకాన్ 2.0తో వచ్చే 5-7 ఏళ్లలో చిప్‌ల తయారీ ఇండస్ట్రీలోకి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీకండక్టర్స్ అసోసియేషన్ (ఐఈఎస్ఏ) అంచనా వేసింది.

### 10 శాతం చిప్‌ల తయారీ భారత్‌లోనే..

సెమీకాన్ 2.0తో దేశీయంగా చిప్‌ల తయారీ భారీగా పెరగనుందని కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. చిప్ డిజైన్, తయారీ, అందుకు అవసరమైన భారీ యంత్రాల విభాగాల్లో బలపడటం ద్వారా ప్రపంచ చిప్‌ల సరఫరా వ్యవస్థలో విడదీయలేని భాగంగా భారత్ మారాలనుకుంటోందన్నారు. ముమ్మందు సంవత్సరాల్లో ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్‌లో దాదాపు 10 శాతం భారత్‌లోనే కొలువుతీరనుందని ఆయన అన్నారు. సెమీకాన్ 2.0కు కేంద్ర క్యాబినెట్ ఈ జూలై 15న ఆమోదం తెలిపింది.

| ఫామ్‌గేట్ ధర | వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్ | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 122 | విజయవాడ | 120 |
| వరంగల్ | 122 | గుంటూరు | 120 |
| కరీంనగర్ | 122 | ఒంగోలు | 120 |
| మహబూబ్‌నగర్ | 122 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 122 | నెల్లూరు | 95 |
| విశాఖపట్నం | 124 | అనంతపురం | 95 |
| గోదావరి | 120 | | |

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,56,770 ▼ | 1,43,700 ▼ | 2,60,000 ▲ |
| విజయవాడ | 1,60,000 ▼ | 1,46,000 ▼ | 2,40,000 ▼ |
| విశాఖపట్నం | 1,56,760 ▼ | 1,43,700 ▼ | 2,60,000 ▼ |
| రాజమండ్రి | 1,58,000 ▼ | 1,45,000 ▼ | 2,72,000 ▼ |
| ప్రొద్దుటూరు | 1,50,000 ▼ | 1,38,000 ▼ | 2,35,000 ▼ |
| ముంబై | 1,55,835 ▼ | 1,42,745 ▼ | 2,37,199 ▼ |

# రిటైల్ రుణాలపై మరింత ఫోకస్

**కరూర్ వైశ్యా బ్యాంక్ ఎండీ, సీఈఓ రమేశ్ బాబు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ (ఆర్ఏఎం) రుణాలపై మరింత దృష్టి పెడుతున్నట్లు వెల్లడించింది. సోమవారం నాడిక్కడ కేవీబీ ఎండీ, సీఈఓ రమేశ్ బాబు మాట్లాడుతూ.. రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ రంగాల నుంచి రుణాలకు డిమాండ్ పెరుగుతూ వస్తోందని, అందుకు తగ్గట్టుగా తాము ఈ విభాగం ప్రత్యేకంగా దృష్టిని సారిస్తున్నట్లు తెలిపారు. అయితే కార్పొరేట్ రుణాల విషయంలో మాత్రం తాము ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

**మార్చి నాటికి 1,000 శాఖలు:** కార్యకలాపాల విస్తరణలో భాగంగా సోమవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 16 శాఖలను ప్రారంభించినట్లు రమేశ్ బాబు తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో ఐదు, తెలంగాణలో మూడు శాఖలను ఏర్పాటు చేయగా మిగిలిన 8 శాఖలను తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో నెలకొల్పినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త శాఖలతో మొత్తం బ్రాంచీల సంఖ్య 919కి చేరగా వచ్చే మార్చి నాటికి వీటిని 1,000కి చేర్చాలని చూస్తున్నట్లు చెప్పారు.

# బిజినెస్

## భారత్‌లో జావెలిన్ మిస్సైల్స్ తయారీ

న్యూఢిల్లీ: రక్షణ రంగ ఉత్పత్తుల తయారీకి భారత కేంద్రంగా మారుతోంది. తాజాగా దేశంలో జావెలిన్ మిస్సైల్ సిస్టమ్స్ తయారీకి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), జావెలిన్ జాయింట్ వెంచర్ (జేజేవీ) అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందంలో భాగంగా టీఏఎస్ఎల్, జేజేవీ.. భారత్‌లో జావెలిన్ ఆల్ అప్ రౌండ్ (ఏయూఆర్)ను సంయుక్తంగా తయారు చేయనున్నాయి. అమెరికాకు చెందిన జావెలిన్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ సిస్టమ్స్‌ను కొనుగోలు చేసేందుకు భారతీయ సైన్యం ఒప్పందం కుదుర్చుకున్న కొద్దిరోజుల్లోనే భారత్‌లో ఈ ఉత్పత్తుల తయారీకి ప్రకటన వెలువడటం గమనార్హం. ఈ జేజేవీ.. ఆర్ఎక్స్ బిజినెస్‌కు చెందిన రెథియాన్, లాకిడ్ మార్టిన్‌కు చెందిన జాయింట్ వెంచర్ సంస్థ. కాగా ఈ ఒప్పందం కింద జావెలిన్ ఏయూఆర్ కోసం ఫైనల్ అసెంబ్లింగ్ లైన్, ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ ఏర్పాటుతో పాటు కాంపోనెంట్ ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలను ఇరు సంస్థలు పరిశీలిస్తాయి.

### జొమాటో హైదరాబాద్ సెంటర్ మూసివేత

హైదరాబాద్: జొమాటో పేరుతో ఫుడ్ డెలివరీ యాప్‌ను నిర్వహిస్తున్న ఎటర్నల్.. హైదరాబాద్‌లోని తన కస్టమర్ సపోర్ట్ సెంటర్‌ను మూసివేసింది. వ్యాపార పునర్ వ్యవస్థీకరణలో భాగంలోనే ఈ సెంటర్‌ను మూసివేస్తున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. ఈ సెంటర్‌ను మూసివేయటంతో దాదాపు 250 మంది ఉద్యోగులపై వేటు పడనుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. పునర్ వ్యవస్థీకరణలో భాగంగా అన్ని సేవలను ప్రధాన కార్యాలయం గురుగ్రామ్ నుంచే చేపట్టాలని కంపెనీ భావిస్తోంది.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు..

**సెన్సెక్స్ 307 పాయింట్లు డౌన్**

ముంబై: పశ్చిమాసియాలో మళ్లీ తలెత్తిన ఉద్రిక్తతలు ముడి చమురు ధరల పెరుగుదలకు దారితీయడం, ఫలితంగా అధిక వడ్డీ రేట్ల వాతావరణం ఏర్పడుతుందనే భయాల నేపథ్యంలో యుటిలిటీస్, ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో చోటు చేసుకున్న అమ్మకాల ప్రభావంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 307.24 పాయింట్ల నష్టంతో 76,957.27 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 20 నష్టాలతో 10 లాభాలతో ముగిశాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95.25 పాయింట్ల నష్టంతో 24,080.40 వద్ద క్లోజైంది. కాగా అంతర్జాతీయ మార్కెట్లో బ్యారల్ బ్రెంట్ ముడి చమురు ధర 3.63 శాతం పెరిగి 91.30 డాలర్లకు చేరుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

| 1వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 530 | విజయవాడ | 575 |
| వరంగల్ | 532 | గోదావరి | 555 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 555 |
| | | డజను గుడ్లు రూ. | 75 |

# సంక్షోభ సమయంలోనూ వృద్ధి రయ్..రయ్!

**జూన్ త్రైమాసికంలో 7.8% జీడీపీ వృద్ధి రేటు**

న్యూఢిల్లీ: పశ్చిమాసియా సంక్షోభ సమయంలోనూ భారత ప్రగతి చక్రం అంచనాలకు మించిన వేగంతో దూసుకెళ్లింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్) జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైంది. ఈ ఏడాది జనవరి-మార్చితో ముగిసిన త్రైమాసికంలో నమోదైన 8.6 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే కాస్త తగ్గినప్పటికీ, గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇదే కాలానికి నమోదైన 6.9 శాతంతో పోలిస్తే బాగానే పుంజుకుంది. ముఖ్యంగా, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరా అంతరాయాలు, ధరాఘాతంతో పాటు ప్రపంచ డిమాండ్ బలహీనపడిన సమయంలోనూ దేశీయ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందడం విశేషం. తద్వారా ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థల్లో భారత్ తన అగ్రస్థానాన్ని కొనసాగించింది.

> "భారత్ మరోసారి వికసించింది. వినాశనాన్ని జోస్యంగా చెప్పిన వారికి మళ్లీ భంగపాటే మిగిలింది. తాజా వృద్ధి రేటు అసాధారణ ఘనకార్యం. అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా ఇంధన షాక్, సరఫరా అంతరాయాలు ఎదురైన సమయంలోనూ దేశ ప్రజల సమిష్టి బలంతోనే ఈ వృద్ధి సాధ్యమైంది."
>
> – నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి

### ఆర్‌బీఐ అంచనా కంటే అధికం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి వృద్ధి రేటు 6.7 శాతంగా, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 7 శాతంగా నమోదు కావచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. తాజా గణాంకాలు ఆర్‌బీఐ అంచనాను సైతం మించాయి. దేశంలో ఆర్థిక కార్యకలాపాల జోరును ఇది నొక్కి చెబుతున్నది.

### జీడీపీ రూ.81.36 లక్షల కోట్లు

కేంద్ర గణాంకాల శాఖ సోమవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ జూన్ త్రైమాసికంలో స్థిర ధరల ఆధారిత జీడీపీ లేదా వాస్తవిక జీడీపీ రూ.81.36 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఏడాదిలో ఇదే సమయానికి నమోదైన రూ.75.46 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 7.8 శాతం అధికమిది. కాగా, ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ లేదా నామినల్ జీడీపీ రూ.88.27 లక్షల కోట్లుగా ఉంది. క్రితం సంవత్సరంలో నమోదైన రూ.80 లక్షల కోట్లతో పోలిస్తే 10.3 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, 2026-27 తొలి త్రైమాసికానికి జోడించిన స్థూల విలువ (జీవీఏ) 8.2 శాతంగా నమోదైంది.

# 'జీ'చంద్ర కేసులో ఐదుగురు సభ్యుల బెంచ్ ఏర్పాటు

- ఎన్‌సీఎల్‌టీ చరిత్రలో ఇదే తొలిసారి
- నేడు ఉదయం కేసు విచారణకు..

న్యూఢిల్లీ: జీ న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ చానెళ్ల వ్యవస్థాపకుడు, ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్రపై వ్యక్తిగత దివాలా పరిష్కార కేసులో జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఐదుగురు సభ్యుల బెంచ్‌ను ఏర్పాటు చేసింది. ఎందుకంటే, ఇప్పటివరకు జరిగిన ఈ కేసు విచారణలో మెజారిటీ అభిప్రాయం సాధ్యపడకపోవడంతో వ్యవహారం మళ్లీ ఎన్‌సీఎల్‌టీ ప్రెసిడెంట్ వద్దకు వెళ్లింది. దాంతో ఏకంగా ఐదుగురు సభ్యులతో కూడిన బెంచ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎన్‌సీఎల్‌టీ చరిత్రలో ఇంతమంది సభ్యులతో బెంచ్ ఏర్పాటు కావడం ఇదే తొలిసారి. ఈ బెంచ్‌కు ప్రెసిడెంట్ జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్ అధ్యక్షత వహించనున్నారు. మిగతా సభ్యుల జాబితాలో బచ్చు వెంకట్ బలరామ్ దాస్, మహేంద్ర ఖండేల్‌వాల్, అతుల్ చతుర్వేది, రవీంద్ర చతుర్వేది ఉన్నారు. మంగళవారం ఉదయం 10.15 గంటలకు కొత్త బెంచ్ ఈ కేసు విచారణను ప్రారంభించనుంది.

### గత బెంచ్ సభ్యుల్లో భిన్నాభిప్రాయంతోనే..

నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసులో పలువురు రుణదాతల నుంచి రూ.22,006.57 కోట్ల బకాయిల రికవరీ కోసం క్లెయిమ్‌లు రాగా.. సుభాష్ చంద్ర కేవలం రూ.6.5 కోట్ల తిరిగి చెల్లింపులు ఆఫర్ చేసిన విషయం తెలిసిందే. అంటే, రుణదాతలకు రావాల్సిన మొత్తంలో 99.97 శాతం (రూ.20,000 కోట్లు) కోతపడనుంది. ఈ కేసులో ఎన్‌సీఎల్‌టీ బెంచ్ సభ్యులైన అశోక్ కుమార్ భరద్వాజ్ (జుడీషియల్), రీనా సిన్హా పురి (టెక్నికల్) గతంలోనూ భిన్నంగా తీర్పిచ్చారు. దాంతో ఎన్‌సీఎల్‌టీ ఫోరమ్ ప్రెసిడెంట్ నీలేశ్ శర్మ (జుడీషియల్)ను మూడో సభ్యుడిగా నియమించారు. చంద్ర ఆఫర్‌ను తిరస్కరించిన రుణదాతల వాదనలను తోసిపుచ్చిన నీలేశ్ శర్మ.. ఐబీసీ చట్టంలో సెక్షన్ 114 ప్రకారంగా ఈనెల 26న ప్లాన్‌ను ఆమోదించారు. అయితే, కంపెనీల చట్టం 2013లో సెక్షన్ 419(5)లో భాగంగా మెజారిటీ అభిప్రాయానికి అనుగుణంగా అధికారిక తీర్పు కోసం మూడో సభ్యుడి ఉత్తర్వును అసలు బెంచ్‌కు తిరిగి పంపారు. కేసును పునఃపరిశీలించినప్పటికీ మెజారిటీ అభిప్రాయం లభించలేదని సోమవారం బెంచ్ పేర్కొంది. "మూడో సభ్యుడు స్వతంత్రంగా ఓ ఉత్తర్వును జారీ చేశారు. తద్వారా, ఎటువంటి మెజారిటీ అభిప్రాయం వెలువడలేదు. కాబట్టి, తుది తీర్పును జారీ చేయలేమ"ని ఎన్ఎస్ఎల్‌టీ బెంచ్ సభ్యులు అశోక్ కుమార్, రీనా సిన్హా పేర్కొన్నారు. దాంతో వ్యవహారాన్ని తిరిగి ఎన్‌సీఎల్‌టీ ప్రెసిడెంట్ వద్దకు పంపారు.



## ‘కాక్రోచ్’ల ప్రదర్శనపై నిషేధానికి సుప్రీం నో

న్యూఢిల్లీ, ఆగస్టు 31: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సెప్టెంబరు 5న ఢిల్లీలో నిర్వహించదలపెట్టిన నిరసన ప్రదర్శనపై నిషేధం విధించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రతి ఒక్కరూ బాధ్యతతో, చట్ట ప్రకారం, శాంతియుతంగా వ్యవహరించాలని సూచించింది. నీట్ పేపర్ల లీకేజీపై జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళనను విరమించిన సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఆ రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన జరపాలని సీజేపీ నిర్ణయించింది. ఆ ప్రదర్శనపై నిషేధం విధించాలని రిటైర్డు ఢిల్లీ పోలీసు అధికారి రాజేంద్ర సింగ్ పిటిషన్ దాఖలు చేశారు. సెప్టెంబరు 12, 13 తేదీల్లో బ్రిక్స్ సదస్సు జరగనున్న దృష్ట్యా అది ముగిసే వరకు ఆందోళనను వాయిదా వేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## అనలాగ్ పనీర్‌పై జొమాటో నిషేధం

న్యూఢిల్లీ, ఆగస్టు 31: పాలతో చేసే పనీర్, చీజ్‌తో కాకుండా.. అనలాగ్ పనీర్, చీజ్ వంటి ప్రత్యామ్నాయ కృత్రిమ డెయిరీ ఉత్పత్తులతో చేస్తున్న వంటకాలపై జొమాటో కఠిన నిర్ణయం తీసుకుంది. అనలాగ్ డెయిరీ ఉత్పత్తులతో తయారు చేసే వంటకాలను తన ప్లాట్‌ఫాంపై విక్రయించడాన్ని నిషేధిస్తున్నట్లు జొమాటో సోమవారం ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. తమ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన రెస్టారెంట్లు, హోటళ్లు స్వచ్ఛమైన పాల ఉత్పత్తులతోనే ఆహారపదార్థాలు తయారు చేయాలని, అలా సాధ్యం కాకపోతే ఆ వంటకాలను మెనూ నుంచి తొలగించాలని సూచించింది. ఈ నిబంధనను పాటించని భాగస్వామ్య హోటళ్లను తమ జాబితా నుంచి తొలగిస్తామని హెచ్చరించింది.

## నౌకాదళంలో చేరిన ఐఎన్ఎస్ నిపుణ్

ముంబై, ఆగస్టు 31: సముద్ర గర్భంలోకి చొచ్చుకెళ్లి అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించే సత్తా కలిగిన స్వదేశీ డైవింగ్ సహాయక నౌక (డీఎస్‌వీ) ‘ఐఎన్ఎస్ నిపుణ్’ సోమవారం భారత నౌకాదళంలో చేరింది. ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో నావికాదళ చీఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ సమక్షంలో ఈ నౌకను అధికారికంగా ప్రారంభించారు. గతేడాది ప్రారంభించిన ‘ఐఎన్ఎస్ నిస్తార్’ తర్వాత నేవీలో చేరిన రెండో డైవింగ్ సహాయక నౌక ఇది. ఐఎన్ఎస్ నిపుణ్‌ను విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థ స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించింది. 10,500 టన్నుల బరువు మోసే సామర్థ్యం దీనికి ఉంది. సముద్ర గర్భంలో 300 మీటర్ల లోతు వరకూ వెళ్లి డైవింగ్ ఆపరేషన్లు నిర్వహించగలదు. వీటితో పాటు ప్రమాదంలో చిక్కుకున్న జలాంతర్గాములను రక్షించడంలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు.

## మతాలన్నింటిలో ఇస్లాం పవిత్రమైనది

» కర్ణాటక మంత్రి బసవరాజ వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అన్ని మతాలకంటే ఇస్లాం పవిత్రమైనదంటూ కర్ణాటక ఉన్నతవిద్యాశాఖ మంత్రి బసవరాజ రాయరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ‘ఇస్లాం పట్ల తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీని గురించి లోతుగా ఆలోచించాల్సి ఉంది’ అని కూడా మంత్రి వ్యాఖ్యానించారు. కొప్పళ జిల్లా కుకనూరులో ఆదివారం ముస్లింల సామూహిక వివాహాల్లో పాల్గొన్న ఆయన...‘నేను గుడులు, మతాలకు వెళ్లను. కానీ హజ్‌యాత్రకు వెళ్లాలనే ఆశ ఉంది. కానీ అక్కడికి వెళ్లాలంటే ఇస్లాంలోకి చేరాల్సి ఉంటుంది. నేను ఖురాన్ అధ్యయనం చేయాలని అనుకుంటున్నాను.’ అని అన్నారు. బసవరాజ వ్యాఖ్యలపై బీజేపీ, హిందూ సంఘాలు తీవ్రస్థాయిలో నిరసనకు దిగాయి. దీంతో ఆయన సోమవారం వివరణ ఇచ్చారు. సమాజంలో అన్నిమతాలు ముఖ్యమైనవేనని, ఏ మతం కూడా తక్కువ కాదని చెప్పుకొచ్చారు. తాను నిర్దిష్టమైన ఏ మతానికీ అనుచరుడిని కాదని, తనకు కులం, మతం అనే భేదాభిప్రాయాలు లేవని పేర్కొన్నారు.

## ‘సింధు’పై హేగ్ ఆర్బిట్రేషన్ కోర్టు తీర్పు చెల్లదు

» ఆ కోర్టు ఏర్పాటే చట్టవిరుద్ధం: కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 31: సింధు నదీ జలాల ఒప్పందంపై హేగ్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానం(కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్) ఇచ్చిన తీర్పును భారత్ తిరస్కరించింది. భారత సార్వభౌమ నిర్ణయాలపై తీర్పులు ఇచ్చే అధికారం ఆ కోర్టుకు లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకుంది. భారత్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ.. నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో ఉన్న పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌ను పాక్ గతంలో ఆశ్రయించింది. భారత్ ఈ ఒప్పందానికి ఏకపక్షంగా గుడ్‌బై చెప్పడం లేదా నిలిపివేయడం చెల్లదని, ఒప్పందం అమల్లో ఉంటుందని ఆర్బిట్రేషన్ కోర్టు తీర్పు జారీ చేసింది.

## విరాళంగా రూ.4 కోట్ల చెక్.. బ్యాంక్ అకౌంట్‌లో ఉన్నది 3 రూపాయలు!

» అయోధ్య రామాలయ విరాళాల పరిశీలనలో వెలుగులోకి

అయోధ్య, ఆగస్టు 31: అయోధ్యలోని రామమందిర విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు జరుగుతున్న వేళ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఈ ఆలయానికి ఓ భక్తురాలు విరాళంగా ఇచ్చిన రూ.4 కోట్ల చెక్ బౌన్స్ అయ్యింది. ఇటీవల చెన్నైకి చెందిన ఓ భక్తురాలు రూ.4 కోట్ల చెక్కును రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి విడిగా రూ.10 వేల నగదును విరాళంగా ఇచ్చారు. ఈ క్రమంలోనే డబ్బును డ్రా చేయడానికి ట్రస్టు సిబ్బంది బ్యాంకును సంప్రదించారు. కానీ ఆ చెక్కు బౌన్స్ అయ్యింది. సదరు మహిళ ఖాతాలో కేవలం రూ.3 బ్యాలన్స్ ఉన్నట్లు తెలుసుకుని సిబ్బంది షాక్ అయ్యారు. దీనిపై వివరణ కోరుతూ ఆమెకు నోటీసులు పంపనున్నట్లు సదరు బ్యాంకు తెలిపింది.

# ఢిల్లీలో మరో ‘నిర్భయ’ కాండ

**కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం.. అఘాయిత్యానికి పాల్పడిన కండక్టర్, డ్రైవర్**

» నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

కండక్టర్ సందీప్, నిందితులు నడిపిన బస్సు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: దేశ రాజధాని ఢిల్లీలో మరో ‘నిర్భయ’ తరహా దారుణం చోటుచేసుకుంది. 16 ఏళ్ల ఓ బాలికపై ఇద్దరు దుండగులు నడుస్తున్న బస్సులో లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆగస్టు 4వ తేదీన జరిగినప్పటికీ.. వివరాలు సోమవారం వెల్లడయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన 11వ తరగతి విద్యార్థిని.. తల్లి తిట్టిందన్న కోపంతో ఇల్లు వదిలి, ఢిల్లీ శివార్లలోని నోయిడా సెక్టార్ 63లో ఉండే తమ బంధువుల ఇంటికి బస్సులో బయల్దేరింది. చీకటి, దానికితోడు వర్షం కురుస్తుండటంతో ఆ బాలిక తాను దిగాల్సిన ప్రాంతాన్ని గుర్తించలేక, రాత్రి 9 గంటల సమయంలో సెక్టార్ 63 చేరుకోకముందే బస్సు నుంచి దిగేసింది. అక్కడి నుంచి వాళ్ల బంధువుల ఇల్లు మరో 25 కి.మీ.ల దూరం ఉండటంతో.. ఎలా వెళ్లాలా అని ఆలోచిస్తూ అక్కడే ఉండిపోయింది. ఇంతలో ఓ స్లీపర్ బస్సు వచ్చి ఆమె ముందు ఆగింది. దాంట్లో ఉన్న కండక్టర్ తాము నోయిడా సెక్టార్ 63 వైపే వెళ్తున్నామని చెప్పటంతో, ఆ బాలిక బస్సు ఎక్కింది. బస్సులో డ్రైవర్, కండక్టర్ తప్ప ఎవరూ లేరు. బస్సు బయల్దేరిన కొంతసేపటికి, కండక్టర్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికదాడి జరిపాడు. ఆ తర్వాత డ్రైవర్ కూడా దారుణానికి పాల్పడ్డాడు. ఇదంతా బస్సు కదులుతుండగానే జరిగింది. స్లీపర్ బస్సు కావటంతో కిటికీలకు ఉన్న తెరల వల్ల.. లోపల జరుగుతున్న అఘాయిత్యం గురించి బయట ఎవరికీ కనిపించలేదు. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి, ఓల్డ్ ఢిల్లీలోని కశ్మీర్ గేట్ సమీపంలో ఉన్న రింగురోడ్డు వద్ద బాలికను వదిలేసి వెళ్లిపోయారు. జరిగిన దారుణం నుంచి తేరుకొని బాలిక.. ఓ ఆటోలో సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని, అదే రోజు రాత్రి డ్రైవర్ కుల్‌దీప్, కండక్టర్ సందీప్‌ను అరెస్టు చేశారు. వారు యూపీలోకి కాన్పూర్‌నకు చెందిన వారని, నోయిడా నుంచి ఢిల్లీలోని కశ్మీర్‌గేట్ వరకూ దాదాపు 43 కి.మీ.ల దూరంపాటు బస్సును నడిపిస్తూనే దండుగులు బాలిక మీద లైంగికదాడికి పాల్పడ్డారని తేలింది. ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. కాగా, 2012లో ఢిల్లీ నగరం రోడ్లపై ఇదే తరహాలో ఓ నడుస్తున్న బస్సులో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన యావత్ దేశాన్ని కుదిపేసిన విషయం తెలిసిందే.

**నర్సరీ విద్యార్థినిపై డ్రైవర్ అఘాయిత్యం**

ఔటర్ నార్త్ ఢిల్లీ పూత్‌ఖుర్ద్ అనే ప్రాంతంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో.. నర్సరీ చదివే ఓ చిన్నారి మీద పాఠశాల బస్సు డ్రైవర్ పలుమార్లు లైంగికదాడి జరిపాడు. ఆగస్టు 19వ తేదీన ఈ దారుణం చోటుచేసుకుంది. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. చిన్నారి పాఠశాలలోని బాత్‌రూమ్‌కు వెళ్తుండగా అనుసరించిన దుండగుడు.. ఆమె మీద పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినట్లు వెల్లడైంది. దీనిపై పోలీసులు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేశారు. దేశ రాజధానిలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న లైంగిక దాడులపై ప్రతిపక్ష ఆమ్‌ఆద్మీపార్టీ తీవ్రంగా స్పందించింది. మహిళ సీఎంగా ఉన్న ఢిల్లీ.. పిల్లల మీద లైంగికదాడులకు రాజధానిగా మారిందని, బాధితులైన చిన్నారులను, వారి తల్లిదండ్రులను సీఎం రేఖాగుప్తా కలిసి కనీసం పరామర్శించటం లేదని ఆప్ నేత సౌరభ్ విమర్శించారు.

## తల్లిదండ్రుల మీద దాడి చేసి బాలికపై అఘాయిత్యం

» సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో దారుణం

పటాన్‌చెరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులపై దాడి చేసి బాలికను ఎత్తుకెళ్లిన దుండగులు.. ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ దారుణ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పటాన్‌చెరు పరిధిలోని పోచారం గ్రామంలో ఓ కుటుంబం వాచ్‌మన్‌గా పని చేస్తూ అక్కడే నివసిస్తోంది. ఆదివారం రాత్రి ఒంటి గంట దాటిన తర్వాత, రామేశ్వరంబండకు చెందిన మహ్మద్ అలీం పాషా తన స్నేహితులు ముద్దంరాజు, వడ్డే రాజేశ్‌లతో కలిసి ఆ వాచ్‌మన్ ఇంటికి వచ్చాడు. అక్కడ బీరు సీసాలతో ఆ వాచ్‌మన్ దంపతులపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. అడ్డుకున్న వారి కుమార్తె(17)ను బలవంతంగా ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలికను రామేశ్వరంబండ శివారు ప్రాంతానికి తీసుకెళ్లిన అలీం పాషా ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని తెలుస్తోంది. ఆ తర్వాత బాలికను అక్కడే వదిలేసి పారిపోయాడు. అటుగా వెళ్లిన పోలీసులు బాధితురాలిని గుర్తించి రక్షించారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

# మహిళలు వేదికెక్కితే మహా వినాశనం!

వారు ఇంటికే పరిమితం కావాలి

మత పెద్ద అబూబకర్ ముస్లియార్ వ్యాఖ్యలు

కొచ్చి, ఆగస్టు 31: మహిళలు ఇళ్లకే పరిమితం కావాలని, వారు గడప దాటకుండా ఉంటేనే ఎలాంటి సమస్యలు ఉండవని కేరళం రాష్ట్రానికి చెందిన ఇస్లాం మతపెద్ద అబూబకర్ ముస్లియార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మహిళలు వేదికలు ఎక్కి, బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొంటే.. మహా వినాశనానికి దారితీస్తుందన్నారు. అందుకే, మహిళలు బహిరంగ వేదికలు ఎక్కకుండా ఇస్లాంలో ‘పరదా’ సంస్కృతి ఉందని, ఇది వారిని వేదికలు ఎక్కకుండా నివారిస్తుందని వ్యాఖ్యానించారు. సున్నీ-షఫీ ఇస్లామిక్ మేధావుల రాష్ట్రస్థాయి ప్రధాన మండలి.. ‘సమస్త కేరళ జమియ్యతుల్ ఉలామా’కు చెందిన ప్రధాన కార్యదర్శి అబూబకర్.. ఆదివారం కొచ్చిలో నిర్వహించిన ఇస్లామిక్ సదస్సులో మాట్లాడారు. “మహిళలు ఇంటికే పరిమితమై జీవించాలని, బహిరంగంగా వారు కనిపించరాదని ఖురాన్ స్పష్టం చేసింది. ఈ విషయంలో కొన్ని అభ్యంతరాలు ఉన్నప్పటికీ.. మత గ్రంథాలను అధ్యయనం చేసిన వారిగా ఈ అంశంపై మాట్లాడే బాధ్యత మాకుంది” అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేరళం మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి బిందు కృష్ణ, సీపీఎం నాయకురాలు పీకే శ్రీమతి తీవ్రంగా ఖండించారు. “ఆ చీకటి రోజులు పోయాయి.. తెలుసుకోండి.” అని వ్యాఖ్యానించారు. అబూబకర్ వ్యాఖ్యలు కేరళం సహా ప్రపంచంలోని మహిళలను అవమానించడమేనని నిప్పులు చెరిగారు.

## లోకం తీరు

## మనీలాండరింగ్ కేసుల్లో ప్రతి రూ.100కు ఒక్క రూపాయే రికవరీ!

» సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 31: మనీలాండరింగ్ కేసుల్లో ప్రతి రూ.100కు ఒక్క రూపాయిని మాత్రమే అధికారులు రికవరీ చేయగలుగుతున్నారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. దర్యాప్తు అధికారులకు అంతర్జాతీయ సహకారం లోపించడంతోపాటు ఆర్థిక నేరగాళ్లు అనుసరిస్తున్న అధునాతన పద్ధతులే దీనికి కారణమన్నారు. ఆర్థిక నేరగాళ్ల అప్పగింత విషయంలో అంతర్జాతీయ సహకారం పూర్తిస్థాయిలో లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఆర్థిక నేరాలపై నిర్వహించిన 43వ అంతర్జాతీయ సింపోజియంలో సీజేఐ శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక్క ఏడాదిలో జరిగిన మనీలాండరింగ్ డబ్బుతో ఈ భూగోళంపై ఉన్న ప్రతి ఒక్కరికీ ల్యాప్‌టాప్‌లు కొనవచ్చని, అప్పటికీ ఇంకా కొంత డబ్బు మిగిలే ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవహారాలను నిర్వర్తించే అధికారులు వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించకుండా ఉండటం కష్టమంటూ కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న విషయాన్ని సీజేఐ ప్రస్తావించారు. క్రీస్తు పూర్వం రెండో శతాబ్దంలోనే రాసిన ఆ పుస్తకంలో అక్రమ సంపాదనకు చెక్ పెట్టేందుకు ఆడిట్లు, క్రాస్ చెకింగ్, జప్తు చర్యలను సూచించారని తెలిపారు. ఇతర దేశాలతో నేరస్థుల అప్పగింత, పరస్పర న్యాయ సహాయ ఒప్పందాలు ఉన్నప్పటికీ అక్రమ ఆస్తుల రికవరీ అసంతృప్తికరంగానే ఉందని చెప్పారు. కాగా, పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్లు విజయ్ మాల్యా, నీరవ్ మోదీలను బ్రిటన్ నుంచి తీసుకొచ్చేందుకు 2017, 2018 సంవత్సరాలలోనే ఆర్థిక నేరగాళ్ల అప్పగింత ఒప్పందం మేరకు భారత్ చర్యలు ప్రారంభించింది. తొమ్మిదేళ్లు గడిచినా ఆ ఇద్దరు ఇప్పటికీ బ్రిటన్‌లోనే ఉన్నారు.

## రాహుల్‌పై ఎఫ్ఐఆర్

ఖర్గే సభా వేదిక శుద్ధీకరణపై వ్యాఖ్యల వివాదంలో ‘శ్రీరామ్‌సేన’ ఫిర్యాదుతో నమోదు

హల్ద్వానీ, ఆగస్టు 31: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కేసు నమోదైంది. స్థానిక శ్రీరామ్‌సేన ధర్మార్థ సేవా సమితి సభ్యుడు, వాల్మీకి (ఎస్సీ) సామాజిక వర్గానికి చెందిన అమిత్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ చీఫ్ ఖర్గే పాల్గొన్న కార్యక్రమ సభా వేదికను శుద్ధి చేసిన విషయంలో రాజకీయ వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. దీనిపై ఇటీవల రాహుల్ మాట్లాడుతూ.. ఖర్గే పాల్గొన్న సభా వేదికను శుద్ధి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఖర్గే దళితుడు అయినందువల్లే బీజేపీ-శ్రీరామ్‌సేన అనుచితంగా ప్రవర్తించిందన్నారు. అయితే రాహుల్ వ్యాఖ్యలు తమ సామాజిక వర్గం మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయంటూ ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఆ వేదికను శుభ్రపరిచే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు తాము పాల్గొన్నామని.. ఖర్గే కులానికి, ఆ శుద్ధి కార్యక్రమానికి ఏ సంబంధం లేకపోయినా కులం రంగు పులమడానికి ప్రయత్నించారన్నారు. ఈ మేరకు రాహుల్‌పై కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, మతపరమైన మనోభావాలను దెబ్బతీశారనే అభియోగాలతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై రాహుల్ స్పందించారు. తనపై కేసులు ఛాతీపై పతకాల వంటివని అభివర్ణించారు. మరోవైపు, ఖర్గేను అవమానించిందే గాంధీ కుటుంబమని.. దేశంలో అత్యంత దళిత వ్యతిరేక నాయకుడు రాహులేనని బీజేపీ మండిపడింది.

# చర్చలు, దౌత్య మార్గాలతోనే..

**ఏ సమస్యల పరిష్కారానికైనా ఇదే మార్గం.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఆందోళనకరం**

» ఇరాన్ అధ్యక్షుడితో భేటీలో మోదీ

» కిర్గిస్థాన్‌లో ఎస్‌సీవో సదస్సు సందర్భంగా నేతల చర్చలు

» రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ భేటీ

పెజెష్కియాన్‌తో మోదీ కరచాలనం

బిష్కెక్, ఆగస్టు 31: ప్రధాని మోదీ ఉజ్బెకిస్థాన్ పర్యటనను ముగించుకొని కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు చేరుకున్నారు. ఆయన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, భారత్-ఇరాన్ సంబంధాలు, ప్రాంతీయ పరిణామాలపై నేతలిద్దరూ చర్చించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని పునరుద్ఘాటించారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు, వాణిజ్యానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాల్సి ఉందని మోదీ తేల్చిచెప్పారు. మరోవైపు, యుద్ధసంక్షోభ సమయంలో తమకు మద్దతుగా నిలిచిన భారత్‌కు పెజెష్కియాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఇరాన్ ఎన్నడూ యుద్ధాన్ని స్వాగతించదన్నారు. కానీ, తమ దేశ ప్రజలను యుద్ధం బారి నుంచి కాపాడుకోవడం తమ బాధ్యత అని చెప్పారు. సంక్షోభ నివారణకు సాయం చేయాలని ప్రధాని మోదీని కోరారు. కాగా, భద్రత, అనుసంధానం, అవకాశాలు అనే అంశాలపై భారత్ ప్రాధాన్యాలను మోదీ ఎస్‌సీవో సదస్సులో వివరించనున్నారు.

**ఎడతెగని యుద్ధాల నుంచి..శాంతి దిశగా**

ఎస్‌సీవో సదస్సు సందర్భంగా బిష్కెక్‌లో మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధంపై భారత్ వైఖరిని మరోసారి తేటతెల్లం చేశారు. “అంతులేని యుద్ధాల నుంచి.. యుద్ధానికే ముగింపు పలికే దిశగా సాగాలి” అని ఆకాంక్షించారు. తక్షణమే యుద్ధానికి ముగింపు పలకాలని పుతిన్‌ను కోరారు. కాగా, సెప్టెంబరులో ఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు పుతిన్ రానున్నట్లు మోదీ ఈ సందర్భంగా ధ్రువీకరించారు.

## మోదీ కవితలకు ఉజ్బెక్ విద్యార్థుల నీరాజనం

మోదీ స్వయంగా రచించిన కవితలను తాష్కెంట్‌లో ఉజ్బెకిస్థాన్ విద్యార్థులు హిందీ, ఉజ్బెక్ భాషల్లో ఆలపించడం ఈ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్ విద్యార్థులు మోదీ రాసిన మూడు కవితలను చదివారు. ‘అభీ తో సూరజ్ ఉగా హై’, ‘నయే భారత్ కే నయే సంకల్ప్’, ‘మానవతా కో కహీం నా లగ్ జాయే దాగ్’ కవితలను విద్యార్థులు చదివారు. ఈ సందర్భంగా మోదీ భావోద్వేగానికి గురయ్యారు. చాలా ఏళ్ల కిందట తాను రాసిన కవితలను ఇప్పుడు ఉజ్బెక్ విద్యార్థులు హిందీలో ఆలపించడం తనను కదిలించిందన్నారు.

మోదీ కవితలను చదువుతున్న విద్యార్థులు

## ఎంపీలాడ్స్ నిధుల వ్యయంలో.. తెలుగు రాష్ట్రాల ఎంపీల వెనుకంజ

**వచ్చిన నిధుల్లో 23 శాతం మాత్రమే ఖర్చు**

న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు పార్లమెంట్ సభ్యులకు.. కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.5 కోట్ల చొప్పున నిధులను కేటాయిస్తున్నప్పటికీ, వాటిని ఖర్చు చేయటంలో ఎంపీలు వెనుకబడుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎంపీలు కూడా దీనికి మినహాయింపు కాదని కేంద్రం తాజాగా విడుదల చేసిన వివరాలతో వెల్లడైంది. వీరిలో కేంద్ర మంత్రులు కూడా ఉండటం విశేషం. 2024లో మోదీ రెండవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దేశంలోని 36రాష్ట్రాల ఎంపీలకు రూ.11,681 కోట్లు విడుదల చేయగా, ఆ మొత్తంలో రూ.3,964 కోట్లు మాత్రమే(33.9%) ఖర్చు పెట్టారు. నాగాలాండ్ ఎంపీలు తమకు లభించిన ఎంపీలాడ్స్ నిధుల్లో 94.6% ఖర్చు చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారు. ప్రధాని మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో ఎంపీలు కేవలం 26.87% నిధులనే అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టారు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. తెలంగాణలో ఉభయసభలకు చెందిన ఎంపీలకు రూ.394 కోట్లు కేటాయిస్తే రూ.94 కోట్లు(23.8%) వ్యయం చేశారు. 91.3% మంది ఎంపీలు పేలవమైన పనితీరు కనపరిచారని, 4.3% మంది అసలు పనులే చేయలేదని వెల్లడైంది. ఏపీ ఎంపీలకు రూ.554 కోట్లు కేటాయించగా రూ.127కోట్లు (23%)ఖర్చు చేశారు. ఏపీలోని బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తనకు కేటాయించిన రూ.14 కోట్లలో ఒక్క పైసా ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీకి 7కోట్లు కేటాయించినా ఒక్క పైసా ఖర్చు చేయలేదు.

**తెలంగాణ ఎంపీల వ్యయం**

| ఎంపీ | ఖర్చు(శాతం) |
|---|---|
| కాంగ్రెస్ ఎంపీలు | |
| బలరాం నాయక్ | 49.20 |
| చామల కిరణ్ కుమార్ రెడ్డి | 42.65 |
| అనిల్ కుమార్ యాదవ్ | 36.98 |
| మల్లు రవి | 31.97 |
| సురేష్ షెట్కర్ | 19.51 |
| కడియం కావ్య | 18.50 |
| రఘురామిరెడ్డి | 14.57 |
| గడ్డం వంశీకృష్ణ | 11.03 |
| రఘువీరా రెడ్డి | 4.77 |
| రేణుకా చౌదరి | 2.08 |
| అభిషేక్ సింఘ్వీ | 0 |
| బీజేపీ ఎంపీలు | |
| ధర్మపురి అరవింద్ | 56.18 |
| బండి సంజయ్ | 38.41 |
| డీకే అరుణ | 30.07 |
| కొండా విశ్వేశ్వర్ రెడ్డి | 24.30 |
| రఘునందన్ రావు | 20.74 |
| ఈటల రాజేందర్ | 10.60 |
| కిషన్ రెడ్డి | 3.23 |
| బీఆర్ఎస్ ఎంపీలు | |
| రవిచంద్ర వద్దిరాజు | 48.24 |
| దామోదర్‌రావు | 32.12 |
| పార్థసారథి రెడ్డి | 2.43 |

**ఏపీ ఎంపీల వ్యయం**

| | |
|---|---|
| టీడీపీ ఎంపీలు | |
| దగ్గుమళ్ల ప్రసాదరావు | 51.93 |
| వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి | 50.07 |
| హరీశ్ బాలయోగి | 36.42 |
| బైరెడ్డి శబరి | 33.65 |
| రామ్మోహన్ నాయుడు | 31.29 |
| అంబిక లక్ష్మీనారాయణ | 30.81 |
| పుట్టా మహేశ్ | 29.59 |
| బస్తిపాటి నాగరాజు | 27.52 |
| పెమ్మసాని చంద్రశేఖర్ | 22.33 |
| బీదమస్తాన్ రావు | 20.73 |
| కలిశెట్టి అప్పలనాయుడు | 15.19 |
| తెన్నేటి కృష్ణప్రసాద్ | 10.44 |
| మాగుంట శ్రీనివాసులు | 8.08 |
| భరత్ మతుకుమల్లి | 6.61 |
| కేశినేని శివనాథ్ | 4.31 |
| లావు కృష్ణదేవరాయలు | 1.38 |
| బీజేపీ ఎంపీలు | |
| కృష్ణయ్య | 34.33 |
| సీఎం రమేశ్ | 17.78 |
| పురందేశ్వరి | 9.39 |
| వెంకట సత్యనారాయణ | 1.63 |
| భూపతిరాజు | 0 |
| జనసేన ఎంపీలు | |
| బాలశౌరి | 9.77 |
| ఉదయ శ్రీనివాస్ | 8.48 |

## సహాయక చర్యలకు వనరుల కొరత

» నేపాల్‌లో నెమ్మదిగా రెస్క్యూ ఆపరేషన్

» 903కు చేరిన మృతుల సంఖ్య.. 4వేల మందికి పైగా గల్లంతు


జాగిలాల సాయంతో మృతదేహాలను వెతుకున్న సహాయక సిబ్బంది

కాఠ్మాండు/ నార్సింగ్, ఆగస్టు 31: నేపాల్ జల విలయంలో కనిపించకుండాపోయినవారు సురక్షితంగా బయటపడతారన్న ఆశలు సన్నగిల్లుతున్నాయి. నేపాల్ సైన్యం, పోలీసులు, పారామిలిటరీ దళాలు రాత్రింబవళ్లు సహాయక చర్యల్లో శ్రమిస్తున్నా.. వనరుల కొరతతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆధారం కోసం పట్టుకొనేందుకు తమవద్ద కనీసం తాళ్లు కూడా సరిపడినన్ని లేవని ఓ పోలీస్ అధికారి సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. మీటర్ల మందం పేరుకుపోయిన మట్టికింద మనుషుల కోసం వెదికేందుకు అత్యాధునిక థర్మల్ కెమెరాలు, శబ్దాలను పసిగట్టే సోనార్ పరికరాలు లేకపోవటంతో పారలు, చేతులతోనే మట్టిని తవ్వుతున్నారు. మట్టికింది నుంచి బయటపడిన మృతదేహాలను భద్రపరిచేందుకు బాడీ బ్యాగులు కూడా లేవని ఓ అధికారి తెలిపారు. ఆగస్టు 26న సంభవించిన ఈ ప్రకృతి విపత్తులో మృతుల సంఖ్య సోమవారం నాటికి 903కు చేరింది. 4వేల మందికిపైగా గల్లంతయ్యారు. త్రిశూలీ, భోటెకోశీ నదులపై నిర్మాణంలో ఉన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల సొరంగాల్లోనే 933 మంది గల్లంతయ్యారు. వారిలో ఎవరైనా బ్రతికి ఉన్నారేమోనన్న ఆశతో సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు.

**హైదరాబాద్ వాసి గల్లంతు!**

నేపాల్ వరదల్లో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి గల్లంతయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మణికొండకు చెందిన రాళ్లగూడెం ధన్‌పాల్‌రెడ్డి ముంబైకి చెందిన పర్వతారోహకుడు డాక్టర్ చితాలే బృందంతో కలిసి నేపాల్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లాడు. కాఠ్మాండులోని శంకర్ హోటల్‌లో బసచేసిన ఆయన.. ఆగస్టు 26న ట్రెక్కింగ్ కోసం బయల్దేరాడు. అప్పటి నుంచి వారి ఫోన్లు స్విచాఫ్ అని వస్తున్నాయి. వారంతా నేపాల్ వరదల్లో గల్లంతయ్యారేమో అని ధన్‌పాల్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

## అలా అయితే.. కూటమికి గుడ్ బై!

ప్రధాని అభ్యర్థిగా విజయ్‌కు మద్దతిస్తే రాష్ట్రంలో కలిసి ఉండం

టీవీకేకు కాంగ్రెస్ హెచ్చరిక

చెన్నై, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తమిళనాడు సీఎం విజయ్ భవిష్యత్తులో ప్రధాని కూడా అవుతారంటూ అధికార టీవీకే శ్రేణులు చేస్తున్న ప్రచారం కూటమి ప్రభుత్వంలో కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీకి టీవీకే ప్రచారం మంటపుట్టిస్తోంది. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశానికి కాబోయే ప్రధాని అని, ఆయనకు మద్దతు ఇవ్వకుండా విజయ్‌కు మద్దతిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. “ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌కు మద్దతు తెలపకపోతే.. కూటమి నుంచి వైదొలుగుతాం. మంత్రి పదవులకు రాజీనామా చేస్తాం.” అని కాంగ్రెస్ నేత, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రాజేశ్‌కుమార్ హెచ్చరించారు. ఈ విషయంలో రాజీ పడేది లేదన్నారు.

## బొప్పరాజు వ్యాఖ్యలు సరికాదు

- ఫ్రెండ్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు తప్పు
- 'ఆంధ్రజ్యోతితో' రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వరనాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వర నాయుడు అన్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. 'సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. డిమాండ్ల సాధనకు తొలుత సీఎం చంద్రబాబుతో మాట్లాడాలి. సానుకూలత రాకపోతే అప్పుడు సమ్మెకు వెళ్లాలి. డిమాండ్ల సాధన కోసం కొంచెం వేచి ఉండాలి. ఏమీ లేకుండా ప్రభుత్వంపై అలా మాట్లాడితే ఎలా? చర్చలు జరిపి ఉద్యోగుల డిమాండ్లు, కోర్కెలు సాధించుకోవాలి' అని సూచించారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని సీఎం చెబుతున్నారని, అటువంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడం తప్పని అన్నారు.

## గత ప్రభుత్వంలో ఎందుకు నోరు మెదపలేదు?

- బొప్పరాజుపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఫైర్

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగుల ప్రయోజనాలపై ఎందుకు నోరు మెదపలేదని అమరావతి జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లును నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరాజు, బి.హైమారావు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అనేకసార్లు ఉద్యోగులను చర్చలకు పిలుస్తోందని, ప్రయోజనాలపై హామీలు ఇస్తోందని పేర్కొన్నారు. అయినా రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో రివర్స్ పీఆర్సీ ఇచ్చినప్పుడు, డీఏలను రద్దు చేసినప్పుడు ఎందుకు మౌనం దాల్చారని ప్రశ్నించారు.

## నేడు నరసాపురం, మొగల్తూరుల్లో సీఎం పర్యటన

- లబ్ధిదారులకు భరోసా పింఛన్ల పంపిణీ

నరసాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, మొగల్తూరు మండలాల్లో పర్యటించనున్నారు. తాడేపల్లి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మొగల్తూరు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నరసాపురంలోని పొన్నపల్లికి వెళ్లి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించనున్నారు. తర్వాత బోటుపై గోదావరిలో రేవులను పరిశీలిస్తారు.

## పీఎంఏవై 2.0 కింద 17,912 ఇళ్లు మంజూరు

- పరిపాలనా అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో అర్హులందరికీ పక్కా ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా మరో అడుగు ముందుకు వేసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-అర్బన్) 2.0 పథకం కింద రాష్ట్రంలోని పట్టణాల్లో అర్హత ఉన్న పేదలకు 17,912 గృహాల నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి యూనిట్ ధర రూ.2.50 లక్షలుగా నిర్ణయించారు. దీనికి అదనంగా అయ్యే ఖర్చును లబ్ధిదారులే భరించాల్సి ఉంటుంది. మొత్తం రూ.447.80 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు భరించనున్నాయి. అంటే ఒక్కో ఇంటికి కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.లక్ష ఆర్థిక సాయం (సబ్సిడీ) అందిస్తాయి. ఇంకా జీరామ్‌జీ (ఉపాధి) పథకం కింద లబ్ధిదారులకు 90 రోజుల పని దినాలకు కన్వర్జెన్స్ రూపంలో రూ.27 వేలు, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద వ్యక్తిగత మరుగుదొడ్లకు ఇచ్చే రూ.12 వేలు ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి కొర్లపాటి హెప్సిబారాణి ఉత్తర్వులు జారీ చేశారు.

## బీసీ డెడికేటెడ్ కమిషన్ పదవీకాలం పొడిగింపు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల్లో బీసీల వెనుకబాటుతనంపై సమగ్ర అధ్యయనం చేస్తున్న డెడికేటెడ్ కమిషన్ పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో నెల పొడిగించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్‌మిశ్రా నేతృత్వంలోని ఈ కమిషన్ నివేదిక సమర్పణకు ప్రభుత్వం పలుదఫాలు గడువును పొడిగించింది. తాజాగా ఆగస్టు 31 వరకు ఉన్న గడువును సెప్టెంబరు 30 వరకు పొడిగిస్తూ బీసీ సంక్షేమశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

## టెన్త్ సర్టిఫికెట్లపై క్యూఆర్ కోడ్ 2025-26 మార్కుల మెమోలపై ముద్రణ

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాస్ పుస్తకాల తరహాలో పదో తరగతి సర్టిఫికెట్లపైనా క్యూఆర్ కోడ్‌ను ముద్రించే విధానాన్ని పాఠశాల విద్యాశాఖ అమల్లోకి తీసుకొస్తోంది. 2025-26 విద్యా సంవత్సరంలో టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు జారీచేసే మార్కుల మెమోలపై ఈ కోడ్‌లు రానున్నాయి. వాటిని మొబైల్ ద్వారా స్కాన్ చేస్తే ఆర్టీజీఎస్ వెబ్‌సైట్‌కు కనెక్ట్ అవుతుంది.

## పాఠశాలల భద్రతకు కార్యాచరణ

- స్కూల్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ' పుస్తకం ఆవిష్కరణ

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలల భద్రతకు పటిష్ట వ్యవస్థ బలోపేతానికి పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రస్థాయి పాఠశాల భద్రత పర్యవేక్షణ కమిటీ సమావేశం సోమవారం మంగళగిరిలో విద్యాభవన్‌లో జరిగింది. యూనిసెఫ్ నిపుణులు, వివిధ శాఖల అధికారులు ఇందులో పాల్గొని చర్చించారు. 'స్కూల్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ' పుస్తకాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. పాఠశాలల భద్రత కోసం విపత్తుల నిర్వహణ సంస్థ, మహిళా శిశు సంక్షేమం, వైద్య, ఆరోగ్యం, పోలీసు, సంక్షేమ శాఖలు, ఈగిల్ టీమ్, ఆర్టీసీ విభాగాలతో సమన్వయం చేసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సెలింగ్ సమయంలో కాలేజీల షిఫ్టింగ్

- విద్యార్థులు ఆప్షన్ల ఎంపిక చేసుకున్న తర్వాత అనుమతి ఇవ్వడంపై విమర్శలు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖలో ఇష్టానుసారంగా కాలేజీల షిఫ్టింగ్‌కు అనుమతులు ఇస్తున్నారు. కౌన్సెలింగ్ సమయంలో రెండు డిగ్రీ కాలేజీలను ప్రస్తుతం ఉన్న చోటు నుంచి నుంచి వేరే మండలాలకు మార్చుకునేందుకు అనుమతిస్తూ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. విశాఖపట్నంలో గాజువాక నుంచి మధురవాడకు, పశ్చిమగోదావరిలో వేగవరం నుంచి ఏలూరులోని అగ్రహారానికి మార్చుకునేందుకు అనుమతులు ఇచ్చారు.

## గ్రామీణ రోడ్లకు మరో రూ.81.93 కోట్లు

- అదనపు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల ప్రాజెక్టు(ఏపీఆర్ఆర్‌పీ)కు ప్రభుత్వం అదనంగా రూ.81.93 కోట్లను మంజూరుచేసింది. ఏఐఐబీ(ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్) ఆర్థిక సాయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో కాంపోనెంట్ 1ఏ, కాంపోనెంట్ 1బీ కింద జరుగుతున్న పనులకు అదనపు వ్యయాన్ని భర్తీ చేసేందుకు ఈ నిధులను కేటాయించింది. ప్రాజెక్టు పనులను పొడిగించిన గడువులోగా పూర్తి చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్‌దండే ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆక్వా ప్రాసెసింగ్ కేంద్రాల్లో పీసీబీ ప్రత్యేక డ్రైవ్

- నీటి నమూనాల సేకరణ.. నేడు మరికొన్ని జిల్లాల్లో..

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా ప్రాసెసింగ్ కేంద్రాల్లో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నమూనాలు సేకరించి, ప్రయోగశాలకు పంపారు. సోమవారం తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, నెల్లూరు జిల్లాల పరిధిలోని ఆక్వా కేంద్రాల నుంచి నమూనాలు సేకరించారు. మంగళవారం కృష్ణా, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఆక్వా కేంద్రాల్లోని నమూనాలు తీసి విశ్లేషించనున్నారు. ఆక్వా కాలుష్యం కారణంగా భూగర్భ జలాలతో పాటు నదులు, వాగులు, వంకల వంటి సహజ నీటి వనరులు కలుషితమవుతున్న నేపథ్యంలో కాలుష్య కారకాలను కట్టడి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయా కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించనున్నారు.

# విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- కీలకమైన ఈ రంగాలపై ప్రభుత్వం దృష్టి
- ఇందుకు కలిసి పనిచేద్దాం: మంత్రి లోకేశ్
- విశాఖలో ఏఐజీ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

విశాఖలో ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో ఆస్పత్రి చైర్మన్ డి.నాగేశ్వరరెడ్డి, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

విశాఖపట్నం/ఎండాడ/సిరిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ రెండు రంగాలపై ఎక్కువ శ్రద్ధ పెడుతున్నామని, ఇందుకోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం విశాఖపట్నం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విశాఖ నగరంలోని ఎండాడ ప్రాంతంలో ఏఐజీ (ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ) హాస్పిటల్స్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జీవితంలో విద్య, వైద్యం అనేవి చాలా కీలకమని, అందుకే ఏరికోరి విద్యా శాఖను ఎంచుకున్నానన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని పేర్కొన్నారు. మన కంటికి కనిపించే దేవుడు వైద్యుడని, వారు వ్యక్తిగత జీవితాన్ని కూడా పక్కనబెట్టి.. ఎన్నో త్యాగాలు చేస్తుంటారని కొనియాడారు. కరోనా సమయంలో తమ జీవితాలను ఫణంగా పెట్టి వైద్యులు పనిచేశారని ప్రశంసించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చిరునామా ఏఐజీ హాస్పిటల్స్ అని, నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. హాస్పిటల్స్ చైర్మన్ నాగేశ్వరరెడ్డి అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని.. ఆయనకు, తనకు మధ్య ఎంతో అనుబంధం ఉందన్నారు. నాగేశ్వరరెడ్డి విశాఖలోనే పుట్టి, పెరిగారని చెప్పారు. పట్టుదల, క్రమశిక్షణతో గ్యాస్ట్రో ఎంటరాలజీలో ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా ఎదిగారని ప్రశంసించారు. ప్రభుత్వపరంగా ఏఐజీ హాస్పిటల్స్‌కు అన్నివిధాలా సహకారం అందిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఇది కేవలం పెట్టుబడి మాత్రమే కాదని, జీవితాలను మార్చేసే సందర్భమన్నారు. విశాఖలో రూ.2 వేల కోట్లతో వెయ్యి పడకల సామర్థ్యంతో పూర్తిస్థాయి హెల్త్ కేర్ ఎకో సిస్టమ్‌ను నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. సుమారు వెయ్యి మంది డాక్టర్లు వైద్య సేవలందిస్తారని, 9 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు.

### ఇకపై విశాఖలోనే అన్ని చికిత్సలు: నాగేశ్వరరెడ్డి

ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. విశాఖ వైద్య రంగంలో తమ చారిత్రక ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం నగరవాసులు వైద్య సేవల కోసం ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్తున్నారని, ఇకపై విశాఖలోనే అన్నింటికీ చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఏఐజీ హాస్పిటల్స్ వైస్ చైర్మన్ పీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ఆనందపురం మండలం గంబీరంలో ఉన్న ప్రేమ ఉదయం, ఏజ్ కేర్ ఫౌండేషన్, హరేకృష్ణ వైకుంఠం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాల్లోనూ లోకేశ్ పాల్గొని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విశాఖపట్నాన్ని దేశంలో నంబర్‌వన్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. డేటా సెంటర్ల విషయంలో కొన్ని అపోహలు ఉన్నాయని, ప్రజల ప్రయోజనాలు, ప్రకృతికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదని స్పష్టం చేశారు. అమ్మకు చెప్పలేని పని ఏదీ చేయకూడదని అభిప్రాయపడ్డారు.ముందుగా హరేకృష్ణ వైకుంఠం ప్రాంగణంలో కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ భూమి పూజ చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూపు ఇనిస్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏజ్ కేర్ ఫౌండేషన్/స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు.

విశాఖలో రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్, రోశయ్య కుటుంబసభ్యులు

## నిజాయితీకి మారుపేరు రోశయ్య

- పాఠ్యాంశంగా ఆయన జీవితం: లోకేశ్

రాజకీయ విలువలు, నిజాయితీకి నిలువుటద్దం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అని మంత్రి లోకేశ్ కొనియాడారు. విశాఖపట్నం నగరంలోని సిరిపురం జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో లోకేశ్ మాట్లాడుతూ.. రోశయ్య విగ్రహాన్ని చూసిన ప్రతి ఒక్కరికీ ఆయన సేవలు గుర్తుకొచ్చేలా 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్' అని పిలుచుకుందామన్నారు. రాజకీయ విలువలకు ప్రతీకగా నిలిచిన రోశయ్య అంటే తనకు ఎంతో అభిమానమని, ఆయన్ను ఒక రాజకీయ పాఠశాలగా అభివర్ణించవచ్చన్నారు. రోశయ్య జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో అధ్యాయంగా పెట్టించే బాధ్యత తీసుకుంటానన్నారు. విగ్రహావిష్కరణలో మంత్రి టీజీ భరత్, విశాఖ ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. రోశయ్య కుటుంబసభ్యులతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు.

## పరిశ్రమలన్నీ 33శాతం పచ్చదనం పాటించాలి

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమ ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనం ఉండేలా చూడాలని ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్‌కల్యాణ్ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. పరిశ్రమలన్నీ 33శాతం పచ్చదనం పాటించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రీన్, కాలుష్య నియంత్రణ మండలిని సోమవారం ఆదేశించారు. పవన్‌కల్యాణ్ ఇంకా ఏమన్నారంటే.. 'రాష్ట్ర ఆర్థిక పురోగతి, పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో.. పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని సామాజిక బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలి. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్‌ను అందించడం మనందరి బాధ్యత. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్దేశిత పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలి. పచ్చదనం ద్వారా సమాజానికి, రాబోయే తరాలకు, సహజసిద్ధమైన వాతావరణాన్ని అందించగలం' అని అన్నారు.

## 'జూ'ల్లో వన్యపాణులను దత్తత తీసుకోవాలి

- కార్పొరేట్, పారిశ్రామిక, స్వచ్ఛంద సంస్థలకు డిప్యూటీ సీఎం పవన్ పిలుపు

వన్యప్రాణుల సంరక్షణ ప్రతిపౌరుడు బాధ్యతగా స్వీకరించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరారు. విశాఖ జూలో అధునాతన ఇంక్యుబేషన్ పద్ధతిలో ఇటీవల 128 కొత్త జీవాలు జన్మించిన నేపథ్యంలో జీవవైవిధ్య పరిరక్షణ చర్యలకు మద్దతుగా విశాఖతో పాటు తిరుపతి జూల్లో జంతువులను దత్తత తీసుకునేందుకు కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల, విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో సోమవారం అధికారులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. జూ ప్రాంగణాలను మరింత పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దడం, జంతువులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం, సందర్శకులకు మెరుగైన అనుభూతిని కల్పించే లక్ష్యంతో పవన్‌కల్యాణ్ జూ అధికారులకు పలు సూచనలు చేశారు. జూ పరిసరాలను వ్యర్థాల వర్గీకరణ, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, పచ్చదనం సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జంతు ప్రదర్శనశాలలు కేవలం వినోద కేంద్రాలు మాత్రమే కాదని, వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ అవగాహనకు కేంద్ర బిందువులుగా నిలవాలని స్పష్టంచేశారు.

# కసిరెడ్డి కస్టడీపై సీరియస్‌గా ఉన్నారా?

- కోర్టు అనుమతి వచ్చాక విచారణకు సిద్ధంగా లేమంటే ఎలా?
- ఏపీ మద్యం కేసులో సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి
- రెండేళ్లుగా ఏం చేస్తున్నారని ఆగ్రహం
- కసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు నోటీసు

న్యూఢిల్లీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏపీ మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రెండేళ్లుగా ఏం చేస్తున్నారు.. కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డి కస్టడీపై సిట్ అసలు సీరియస్‌గా ఉందా అని ప్రశ్నించింది. కోర్టు అనుమతి ఇచ్చిన తర్వాత కస్టడీకి సిద్ధంగా లేమని పోలీసులు ఎలా చెబుతారని నిలదీసింది. ఆంధ్రప్రదేశ్‌లో 2019-24 మధ్య కాలంలో ఎక్సైజ్ పాలసీ మార్పులు, మద్యం రవాణా టెండర్లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఏపీ సీఐడీ 2024లో కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ సైతం కేసు నమోదు చేసింది. ఇదే వ్యవహారానికి సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి లో సీఐడీ అధికారులు మద్యం రవాణా అక్రమాలకు సంబంధించి మరో కొత్త కేసు నమోదు చేశారు. ఈ కేసులో కసిరెడ్డి ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉండగా.. పోలీసులు పీటీ వారెంట్ ద్వారా జూలై 20న కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తీసుకున్నారు. అసలెందుకు అరెస్టు చేస్తున్నారో పోలీసులు కారణాలను లిఖితపూర్వకంగా తనకు ఇవ్వలేదని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1), సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం చట్టవిరుద్ధమని కసిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అరెస్టు చేసేటప్పుడు రాతపూర్వకంగా గ్రౌండ్స్ ఇవ్వడం తప్పనిసరని.. పోలీసులు ఆ నిబంధన పాటించకపోతే ఆ అరెస్టు చెల్లదని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును రాష్ట్రప్రభుత్వం ఆగస్టు 22న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఎదుట సోమవారం విచారణకు వచ్చింది. దర్యాప్తు సంస్థ సిట్ ఉద్దేశపూర్వకంగానే ఒకదాని తర్వాత ఒకటి చొప్పున కేసులు నమోదు చేస్తోందని కసిరెడ్డి తరఫు న్యాయవాది తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇదొక భారీ కుంభకోణమని, ఇందులో కసిరెడ్డి కీలక నిందితుడని తెలిపారు. నిందితుడిని కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### ప్రొడక్షన్ వారెంట్.. అరెస్టు వారెంట్‌తో సమానం..

దర్యాప్తు సంస్థ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'కసిరెడ్డి పోలీసు కస్టడీపై సిట్ నిజంగా సీరియస్‌గా ఉందా? ఒకవైపు కస్టోడియల్ ఇంటరాగేషన్ కావాలని కోరుతూనే.. తీరా జడ్జి ప్రొడక్షన్ వారెంట్ ఇచ్చాక పోలీసు కస్టడీకి తాము సిద్ధంగా లేమని ఎలా చెబుతారు? ముందుగా సన్నద్ధం కాకుండానే కస్టడీకి ఇవ్వాలని అడగడమేంటి? ప్రొడక్షన్ వారెంట్ అనేది అరెస్టు వారెంట్‌తో సమానం. గత రెండేళ్లుగా ఈ కేసు దర్యాప్తు నడుస్తోంది. ఇప్పటి వరకూ అసలేం కనుగొన్నారు? ముందుగా దర్యాప్తు సంస్థ తీరును పరిశీలిస్తాం. ఆ తర్వాతే హైకోర్టు తీర్పు గురించి ఆలోచిస్తాం' అని స్పష్టం చేసింది. నిందితుడి బెయిల్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, ఆయన ఇప్పటికే కస్టడీలో ఉన్నారని, పారిపోయే అవకాశం ఏమాత్రం లేదని, అలాంటప్పుడు ప్రొడక్షన్ వారెంట్ కోసం ఎలా దరఖాస్తు చేస్తారు.. ఇది హైకోర్టును అతిక్రమించడం కాదా అని ప్రశ్నించింది. కస్టడీలో ఉన్న వ్యక్తికి సంబంధించి ప్రొడక్షన్ వారెంట్ ఇవ్వడాన్ని తప్పుబడుతూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సిట్ అనుసరించాల్సిందేనని స్పష్టంచేసింది. కేసు మెరిట్స్ ఆధారంగా దీన్ని లోతుగా పరిశీలించాల్సి ఉందని అభిప్రాయపడింది. ప్రతివాదులైన నిందితులు రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబరు 15కి వాయిదా వేసింది.

# ట్రయల్ కోర్టుకే వెళ్లండి

- రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి
- ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి సుప్రీం సూచన
- మద్యం కుంభకోణం కేసు వ్యవహారంలో విచారణ

న్యూఢిల్లీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన రూ.3,500 కోట్ల భారీ మద్యం కుంభకోణం కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని కీలక నిందితుడు తుకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి(ఏ9)కి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సోమవారం త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు సూచించింది. మద్యం కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కిరణ్‌కుమార్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం నిరాకరించింది. హైకోర్టు తీర్పును ఈ నెల 25న సుప్రీంకోర్టులో సవాల్ చేశాడు. ఆ పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు 3న నిందితుడు ట్రయల్ కోర్టులో లొంగిపోయాడని తెలిపారు. ఇప్పుడు పోలీసులు కస్టడీ కోరుతున్నారన్నారు. ట్రయల్ కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ముందస్తు బెయిల్ తిరస్కరించిన సమయంలో కోర్టు చేసిన వ్యాఖ్యల ప్రభావం రెగ్యులర్ బెయిల్ విచారణపై ఉండరాదని ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషనర్ మరో కేసులోనూ నిందితుడిగా ఉన్నాడని, ఆ కేసులో వారెంట్ కోసం దరఖాస్తు చేశామని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ ఇప్పటికే లొంగిపోయినందున రెగ్యులర్ బెయిల్ కోసం కింది కోర్టులోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రొడక్షన్ వారెంట్ ఉన్న మరో కేసులోనూ ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే హక్కు నిందితుడికి ఉంటుందని వ్యాఖ్యానించింది. గత పరిశీలనల ప్రభావం లేకుండా వారం రోజుల్లోగా బెయిల్ దరఖాస్తును మెరిట్ ఆధారంగా పరిష్కరించాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది.

**ఇదీ కిరణ్ పాత్ర:** మద్యం డిస్టిలరీలు, వ్యాపారులు, ఏపీఎస్‌బీసీఎల్ కాంట్రాక్టర్ల నుంచి ముడుపుల సొమ్ము వివిధ మార్గాల్లో చేరవేయడంలో కిరణ్‌ది కీలక పాత్రని సిట్ దర్యాప్తులో తేలింది. మద్యం కుంభకోణంలో అతడి ప్రమేయంపై 40 మంది సాక్షుల నుంచి సేకరించిన వాంగ్మూలాల ఆధారంగా ఈ మేరకు నిర్ధారించినట్లు సిట్ పేర్కొంది. ఆయా సంస్థలకు డైరెక్టర్లుగా వివిధ వ్యక్తులు ఉన్నప్పటికీ, ఆ కంపెనీలను కిరణ్ సొంతంగా పర్యవేక్షించేవాడని గుర్తించింది. నకిలీ ప్రాజెక్టులు, బోగస్ కంపెనీలు ఏర్పాటు చేసి జీతాల చెల్లింపులు, బోగస్ బిల్లులు సృష్టించి సైమన్ (ఏ41), సైఫ్ (ఏ10), దిలీప్ (ఏ30), సజీల్ బెహరూన్ (ఏ47) ద్వారా కిరణ్ నగదును అక్రమంగా వేరేచోటకు తరలించేవాడని తెలిపింది.

## ప్రాణం తీసిన మందార పువ్వు

- గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి.. అనంతలో విషాదం

మృతిచెందిన సాత్విక

పుట్లూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పిల్లల పట్ల ఏమరుపాటుగా ఉంటే ఎన్ని అనర్థాలో ఈ ఉదంతమే నిదర్శనం. మందార పువ్వు రెక్కలు గొంతులో ఇరుక్కుని, ఊపిరాడక ఎనిమిది నెలల చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన అనంతపురం జిల్లా పుట్లూరు మండలం జంగంరెడ్డిపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జూటూరు రవికుమార్, కవిత దంపతుల కూతురు సాత్విక ఆదివారం రాత్రి ఇంటిముందు తోటి చిన్నారులతో కలిసి ఆడుకుంటోంది. ఆ సమయంలో కిందపడిన మందార పువ్వును నోట్లో పెట్టుకుని మింగేసింది. పువ్వు రెక్కలు గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరాడక విలవిలలాడింది. గమనించిన తల్లిదండ్రులు, సాత్వికను వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

## 'పోలవరం' భద్రత పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు చేసేలా ఆదేశించండి

- హైకోర్టులో ఏబీ వెంకటేశ్వరరావు పిల్

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు జరిగాయని, డ్యామ్ భద్రతపై జియో టెక్నికల్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ నిపుణులతో స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేసేలా కేంద్ర జలశక్తి కార్యదర్శి, కేంద్ర జల సంఘం చైర్మన్‌ను ఆదేశించాలని కోరుతూ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. గ్యాప్-1, గ్యాప్-2లలో డయాఫ్రమ్‌వాల్, ఫౌండేషన్ నిర్మాణాలు, డిజైన్ వ్యత్యాసాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి 8 వారాల్లో నివేదిక సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిల్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. ఏబీ వెంకటేశ్వరరావు తరఫు న్యాయవాది స్పందిస్తూ.. పిటిషనర్ నేరుగా వాదనలు వినిపిస్తారని తెలిపారు. సెమిస్టర్ పరీక్షలకు హాజరైన కారణంగా విచారణకు హాజరుకాలేకపోయారన్నారు. పిల్‌పై విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేయాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ రోజు విచారణ జరిపే అత్యవసరమైన వ్యవహారం కాదని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

## సెప్టెంబరు చివరికి చెల్లిస్తాం

- పరిశ్రమలకు విద్యుత్ రాయితీ, ఇతర ప్రోత్సాహకాల బకాయిలు
- ఇప్పటికే కొంత మొత్తాన్ని చెల్లించాం: హైకోర్టుకు ఏజీ నివేదిక

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక విధానం కింద పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చిన విద్యుత్ రాయితీ, ఇతర ప్రోత్సాహక బకాయిలను సెప్టెంబరు చివరినాటికి చెల్లిస్తామని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ సోమవారం హైకోర్టుకు నివేదించారు. ఇప్పటికే కొంత మొత్తం చెల్లించామని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పి, సకాలంలో వాటిని చెల్లించకుంటే ఎలా అని ప్రశ్నించింది. సెప్టెంబరు చివరినాటికి చెల్లింపులు పూర్తి చేస్తామని ఏజీ చెబుతున్న నేపథ్యంలో విచారణను అక్టోబరుకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం విద్యుత్, మూలధన రాయితీలు ప్రకటించింది. వీటి కోసం పలు పరిశ్రమల యజమానులు దరఖాస్తు చేసుకోగా అధికారులు వాటిని ఆమోదించారు. నిధులు విడుదల చేయలేదు. దీంతో పరిశ్రమలకు ప్రకటించిన ప్రోత్సాహకాల సొమ్మును విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పలువురు స్పిన్నింగ్ మిల్లుల యజమానులు 2024లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఆరుశాతం వడ్డీతో 4 నెలల్లో సొమ్ము చెల్లించాలని ఆదేశిస్తూ 2024డిసెంబరులో తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ఎదుట పలు అప్పీళ్లు వేసింది. అవి సోమవారం మరోసారి విచారణకు వచ్చాయి.

ఆనందంతో నృత్యం చేస్తున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కృష్ణా జలాల రాకను చూసి మురిసిపోతున్న మహిళలు

కృష్ణమ్మకు సాష్టాంగ నమస్కారం చేస్తున్న సీఎం చంద్రబాబు

వెలిగొండ ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు

పూల సుబ్బయ్య కుమార్తెలను సత్కరిస్తున్న సీఎం

# కృష్ణమ్మ పరవళ్లు.. ఆనందంతో చిందులు



కార్యక్రమంలో నిర్వాసితులు, లబ్ధి పొందే రైతులకు సీఎం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు. జలహారతి వద్ద నల్లమల సాగర్‌కు నీరిచ్చే బటన్‌ను రైతులు, మహిళలతో నొక్కించారు. వేదికపై నిర్వాసితులతో జ్యోతి ప్రజ్వలన చేయించారు. ఇరువైపులా రైతులను కూర్చోబెట్టుకున్నారు. బటన్ నొక్కగానే.. గేట్లు తెరచుకున్నాయి. 18.8 కిమీ పొడవైన సొరంగం నుంచి కృష్ణా జలాలు వెలిగొండ కాలువలోకి దూకాయి. రెండు గేట్లు తెరవడంతో నీటి ప్రవాహం వేగంగా ముందుకు సాగింది. అది చూసి సీఎం పరవశించిపోయారు. సెక్యూరిటీ ఆగమన్నా ఆగకుండా.. కెనాల్‌లో దిగి జలాలను చేతిలోకి తీసుకుని వాటిని ముద్దాడారు. మళ్లీ నీళ్లు తీసుకుని తన తలపై చల్లుకున్నారు. పక్కనే ఉన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, రైతులందరి తలలపైనా చల్లారు. పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మకు సాష్టాంగ నమస్కారం చేశారు. ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, టీడీపీ నేతలు ఎరిక్షన్‌బాబు, అశోక్, సత్య, వెంకటరాజు తదితరులు చిందులువేశారు. కార్యక్రమానికి ముందు 5వేల మంది గిరిజన బాలికలు లంబాడ నృత్యం చేశారు. సీఎం వారందరితో సెల్ఫీ దిగారు.

## చెమ్మగిల్లిన కళ్లతో..

ముంపుగ్రామాలైన గుండంచర్ల, కలనూతల సుంకేసులలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పంపారు. అయినా వచ్చే నీటిని చూసి పోవాలని కొన్ని వందల మంది వేచి ఉన్నారు. రిజర్వాయర్ రెండో వైపు ఉన్న గ్రామాల ప్రజలూ ఆ నీటిని చూసేందుకు పరుగుపరుగున వచ్చారు. అక్కడకు వచ్చిన రైతుల కళ్లు చెమ్మగిల్లి కనిపించాయి. చెర్లోపల్లికి చెందిన యోగయ్య అనే 75 ఏళ్ల రైతు చేతికర్ర సాయంతో కెనాల్ వరకు నడిచి వచ్చారు. 'నేనే కాదు.. నా పిల్లలు కూడా నీరు చూస్తామనుకోలేదు. సీఎం దయవలన నేనే నీళ్లు చూశాను' అని చేతులెత్తి నమస్కరించి చెప్పారు. సుంకేసుల రిజర్వాయర్‌లోకి వచ్చిన నీటిని ఒక రైతు బాటిల్‌లోకి తీసుకోవడం కనిపించింది. ఎందుకని ప్రశ్నిస్తే మా భవిష్యత్‌కు బంగారు బాటలు చేసే నీటిని ఇంటికి తీసుకెళ్లి చల్లుకుంటానంటూ ఆనందంగా చెప్పారు.

● ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పంచెకట్టుతో ప్రత్యేక ఆకర్షణగా కనిపించారు. ఫీడర్ కాలువ ద్వారా నలమల సాగర్‌కు నీరు వదిలి జలహారతి ఇచ్చే కార్యక్రమంతోపాటు బహిరంగ సభలోనూ పంచెకట్టుతోనే ఉన్నారు. కెనాల్‌లో దిగాక పంచె తడవడంతో సెక్యూరిటీ సిబ్బంది వచ్చి.. పంచె మార్చుకోవాలని సూచిస్తూ పక్కనే ఏర్పాటుచేసిన తాత్కాలిక గది వైపు దారిచూపారు. కాదంటూ కాలినడకన ఆయన ముందుకు సాగారు.

● సభలో రైతులకు సంఘీభావంగా కండువాను చేతిలో పట్టుకుని ఊపుతూ ర్యాంపుపై తిరిగి ప్రజలను, కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

● ఉద్యోగులు, అధికారులను, నేతలను ప్రత్యేకంగా పిలిచి శిలాఫలకం వద్ద ఫొటోలు దిగారు.

● వేదికపై తన పక్కనే ఉన్న మంత్రులు రామానాయుడు, సత్యప్రసాద్, దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లతో సీఎం తన ఆనందాన్ని పంచుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంతటి భగీరథ యత్నం చేయాల్సి వచ్చిందో క్లుప్తంగా వివరించారు.

-మార్కాపురం, ఆంధ్రజ్యోతి

## ఎక్స్‌లో మొదటి స్థానంలో 'వెలిగొండ' ట్రెండింగ్

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెలిగొండ ప్రాజెక్టు ట్రెండింగ్‌లో నిలిచింది. సీఎం చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంపై నెటిజన్లు ఆసక్తి చూపడంతో ఎక్స్‌లో 'సీబీఎన్ ఫుల్‌ఫిల్స్ వెలిగొండ డ్రీమ్' (వెలిగొండ కలను సాకారం చేసి చంద్రబాబు) హ్యాష్ ట్యాగ్‌తో మొదటి స్థానంలో ట్రెండింగ్‌లో నిలిచింది.

## నీరు లేని ప్రాజెక్టును ప్రారంభించి జగన్ చరిత్రలో నిలిచిపోయారు

▸▸ మంత్రి లోకేశ్

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే జగన్ జాతికి అంకితం చేసి, ప్రజలను మోసం చేశారని మంత్రి లోకేశ్ విమర్శించారు. సోమవారం ఆయన ఎక్స్‌లో... '2024లో నీరు లేకుండానే ప్రారంభోత్సవం చేసిన ఘనత జగన్‌ది. నీరు లేని ప్రాజెక్టును ప్రారంభించిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారు. వెలిగొండకు ఫేక్ ఇనాగరేషన్ చేసింది వైసీపీ అయితే వెలిగొండ కలను సాకారం చేసింది చంద్రబాబు. ఇదే వాస్తవం.. ఇదే నిజం' అని పేర్కొన్నారు. 'వలసల కష్టాలకు సెలవు చెబుతూ, అభివృద్ధికి స్వాగతం పలుకుతున్న మార్కాపురం జిల్లా ప్రజలకు వెలిగొండ ప్రారంభోత్సవ శుభాకాంక్షలు. ప్రాజెక్టు నిర్మాణానికి త్యాగాలు చేసిన నిర్వాసితులకు ధన్యవాదాలు. 30 ఏళ్ల కలను నిజం చేస్తూ వెలిగొండ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ప్రజలకు మంచి చేయడం ద్వారా వారి అభిమానాన్ని పొందడమే మేం కోరుకునే క్రెడిట్. వెలిగొండ జల సిరులు.. అభివృద్ధికి రెక్కలు. ఇది నినాదం కాదు.. కూటమి ప్రభుత్వ విధానం' అని మరో పోస్టులో పేర్కొన్నారు.

మార్కాపురంలో పూల సుబ్బయ్య, తాయమ్మ విగ్రహాలు

## ఎవరీ పూల సుబ్బయ్య?

పూల సుబ్బయ్య

మార్కాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య పేరుపెట్టడం, సభా వేదికపై ఆయన కుమార్తెలైన విలాసిని, సునందనిలను చంద్రబాబు సన్మానించడంతో రాష్ట్రవ్యాప్తంగా పూల సుబ్బయ్య ఎవరనే చర్చ మొదలైంది. ప్రస్తుత మార్కాపురం జిల్లా కంభంలో 1929లో ఆయన జన్మించారు. బాల్యంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి కష్టపడి చదివించింది. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులయ్యారు. ఏఐఎస్ఎఫ్ నాయకునిగా, న్యాయవాదిగా, కార్మికసంఘం నేతగా, తాలూకా, జిల్లా స్థాయి పదవులు చేపడుతూ ఏపీ రైతుసంఘం కార్యదర్శిగా ఎదిగారు. 1962, 67ల్లో ఎర్రగొండపాలెంలో సీపీఐ తరపున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మూడో సారి 1978లో మార్కాపురం నుంచి ఎన్నికయ్యారు. గిరిజన సమస్యలు, వారి హక్కులకై పోరాడారు. ఆయనను వారు తెల్లదొర అని పిలుచుకునే వారు. సాగు, తాగు నీటి సౌకర్యాలు లేక కరువుతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా ప్రజలకు కృష్ణాజలాలు తరలింపే శరణ్యమంటూ ఎన్నో ఉద్యమాలు చేశారు. ఆయన చేసిన ప్రతిపాదనతో ఎన్‌టీఆర్ హయాంలో ఇంజనీర్ సలహాదారు రామకృష్ణయ్యను ప్రాజెక్టు నివేదిక తయారుచేయాలని సూచించారు. అలా ఎన్టీఆర్ హయాంలో పురుడు పోసుకున్న ప్రాజెక్టుకు 1996 మార్చి 5న చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 1988 జూన్ 23న 58 ఏళ్ల వయసులో అనారోగ్యంతో సుబ్బయ్య మృతిచెందారు. వెలిగొండ కోసం పోరాటం చేసిన ఆయన పేరు ఈ ప్రాజెక్టుకు పెట్టాలని పలువురి సూచించడంతో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' అని పేరు పెట్టారు.

# కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

జాతికి అంకితం చేశారు. సొరంగ మార్గాల ద్వారా బిరబిరా వచ్చిన కృష్ణమ్మకు ఫీడర్ కాలువలో శాస్త్రోక్తంగా జలహారతి ఇచ్చారు. కాలువ నీటిలో దిగి పసుపు, కుంకుమ, చీర సమర్పించి.. పూలుజల్లి హారతి పట్టారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. వెలిగొండకు మూడు దశాబ్దాల క్రితం తాను శంకుస్థాపన చేస్తే.. ప్రస్తుతం ప్రాజెక్టు వ్యయం రూ.10,200 కోట్లకు చేరిందన్నారు. ఇప్పటి వరకు రూ.7,983 కోట్లు ఖర్చుకాగా.. అందులో 50 శాతం టీడీపీ ప్రభుత్వ కాలంలోనే చేశామన్నారు. నిర్మాణంలో అనేక ఆటంకాలు ఎదురయ్యాయని.. కొండలు అడ్డు వస్తే తొలుస్తూ.. సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు సాగామని చెప్పారు. 'చంద్రబాబు అనే నేను తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాక మార్కాపురం ప్రాంతానికి వస్తే వెలిగొండ గురించి కరువు బారిన పడిన ప్రజలు చెప్పారు. నీరు ఎక్కడి నుంచి తీసుకురాగలమని అడిగితే కృష్ణా నీటిని ఐదేళ్లకోసారి ఇచ్చినా కనీసం తాగడానికి అయినా ఉపకరిస్తాయన్నారు. ఇక్కడి పరిస్థితిని చూసి చలించిపోయి.. మూడు దశాబ్దాల క్రితం 1996 మార్చి 5న వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా. మళ్లీ 30 ఏళ్ల తర్వాత నేనే తొలి దశను ఆరంభించా' అని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

## వైసీపీది ఫేక్ డ్రామా, సినిమా సెట్టింగ్‌లు

గత వైసీపీ పాలనలో విలువైన పనులను గాలికొదిలేసి నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొర చెల్లింపులతో మోసం చేశారు. ఎన్నికలకు నెల ముందు ప్రాజెక్టును పూర్తిచేశామని.. జాతికి అంకితం చేస్తున్నట్లు డ్రామాలాడారు. నీరివ్వకుండా.. నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా.. ఇంకా రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉంచుకొని ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో రైతులను, ప్రజలను మోసం చేసిన వ్యక్తులను ఏమనాలి? ఫేక్ మాటలతో మోసం చేసిన వారిని నిలదీయాలి. వారి హయాంలో సొరంగంలో టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ఇరుక్కుపోయి పనులు కూడా పూర్తికాలేదు. అలాంటి వాటిని పూర్తి చేసి ఇప్పుడు నీళ్లు ఇచ్చాం. ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితుల త్యాగం గొప్పది. భూములు, ఇళ్లు, ఊర్లు త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నా. వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంది. నిర్వాసితులకు రూ.910 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉండగా 48 రోజుల్లో 6,206 కుటుంబాలకు రూ.768 కోట్లు అందజేశాం. వారి ఆర్థిక కష్టాలు, అవసరాలు గుర్తించి కటాఫ్ డేట్‌ను పెంచి మరో రూ.169 కోట్లు అదనపు సాయం చేస్తున్నాం.

## నిమ్మల మంచి టీమ్‌లీడర్

వెలిగొండ ప్రాజెక్టు పనుల పర్యవేక్షణలో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడి కృషి భేష్. ఆయన మంచి టీమ్ లీడర్. ఆయన కృషితో ప్రాజెక్టును అనుకున్న సమయానికి ప్రారంభించగలిగాం.

## ..చూస్తామని అనుకోలేదు: పూల సుబ్బయ్య కుమార్తెలు

వెలిగొండ ప్రాజెక్టు కోసం పోరాటాన్ని ప్రారంభించిన సీపీఐ మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ పూల సుబ్బయ్య కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా సభకు ఆహ్వానించారు. ఆయన కుమార్తెలు విలాసిని, సునందినిలను సీఎం సత్కరించారు. వెలిగొండను పూర్తిచేస్తారని, దానిని చూస్తామని తాము ఎప్పుడు అనుకోలేదని, అలాంటిది చేసి చూపించారంటూ వారు చంద్రబాబు కాళ్లకు నమస్కరించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల, కందుల దుర్గేశ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, ఆనం రామనారాయణరెడ్డి, డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, పొంగూరు నారాయణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 2028కి రెండో దశ పూర్తిచేస్తాం

వెలిగొండ తొలిదశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4లక్షల మందికి తాగునీరు ఇస్తాం. మరో రూ.190 కోట్లు ఖర్చుచేసి రెండో దశను 2028 నాటికి పూర్తిచేసి 4 జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23లక్షల మందికి తాగునీరు ఇస్తాం. ఈ ప్రాజెక్టుతో కరువుతో నిత్యం పోరాడుతూ అలసిపోయి ఫ్లోరైడ్ బారిన పడిన పశ్చిమ ప్రకాశం ప్రజలకు, మార్కాపురం గడ్డకు విముక్తి లభిస్తుంది. 11ఏళ్ల అధికారంలో ఉన్న వైఎస్, జగన్ పూర్తిచేయలేకపోయిన ప్రాజెక్టును నేను పూర్తిచేశాను. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడదాం. చెడును ఖండించి మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి. ఉత్తరాంధ్రలో భోగాపురం వెలుగులు, రాయలసీమలో పారిశ్రామిక ప్రగతి, కరువు ప్రాంతంలోకి కృష్ణమ్మను పరుగులు పెట్టించాం. సీమ హార్టీకల్చర్ హబ్‌లో మార్కాపురాన్నీ భాగం చేశాం. జిల్లా ఏర్పాటు, వెలిగొండ నిర్మాణం, హార్టీకల్చర్ హబ్‌లో చేరికతో ఈ జిల్లా ఇక అన్‌స్టాపబుల్. దక్షిణ భారతంలో గోదావరి-కావేరి అనుసంధానం కావాలి.. ఉత్తర భారతంలో గంగా-మహానది అనుసంధానంతో దేశం సుభిక్షమవుతుంది. వీటిపై ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో కూడా చర్చించాం.

## పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు




## ఒకే ఒక్కడు చంద్రబాబు..!

▸▸ శంకుస్థాపన.. పనుల పూర్తి.. నీరివ్వడం ఆయనకే సాధ్యం: మంత్రి నిమ్మల

మార్కాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు 1996లో శంకుస్థాపన చేసి... పనులన్నీ పూర్తిచేసి.. 30 ఏళ్ల తర్వాత మళ్లీ ఆయనే ప్రారంభించి నీటిని విడుదల చేయడం ఒకే ఒక్కడు చంద్రబాబుకే సాధ్యమైందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. గంటవానిపల్లి సభలో ఆయన మాట్లాడారు. తొలిదశను చెప్పిన సమయానికి పూర్తిచేసిన చంద్రబాబుకు, తమ ఊళ్లు, భూములు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు మనం రుణపడి ఉండాలన్నారు. వైసీపీ హయాంలో జాతికి అంకితం అనేది ఒక నకిలీ ప్రక్రియ అని, కార్పెట్లపై నడిచి అప్పుడు జగన్ జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు. కానీ ఇప్పుడు సీఎం చంద్రబాబు నీళ్లపై నడిచి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారన్నారు.

### గ్రేట్ విజనరీ చంద్రబాబు: దుర్గేశ్

గ్రేట్ విజనరీ అనే పేరున్న సీఎం చంద్రబాబు గొప్ప పరిపాలనాదక్షుడని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మార్కాపురం, కంభం, శ్రీశైలం ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతాలతోపాటు నల్లమల అందాలు కలుపుతూ రూపొందించిన ప్రణాళిక బ్రోచర్‌ను ఈ సందర్భంగా సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించారు.

### అరుదైన అవకాశం సీఎంకు: మాధవ్

ముప్పయ్యేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన చేతులతోనే ప్రాజెక్టును పూర్తిచేసి నీటి విడుదల చేసే అరుదైన అవకాశం సీఎం చంద్రబాబుకే దక్కిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. కరువు నేలపై బంగారు పంటలు పండే అవకాశం కల్పించిన ఆయనకు ప్రజలంతా రుణపడి ఉండాలన్నారు.

### చంద్రబాబు పేరు చరిత్రలో...: విలాసిని

'వెలిగొండ కోసం పోరాటం చేసిన మా నాన్న పూల సుబ్బయ్య పేరు ఈ ప్రాజెక్టుకు పెట్టడం ద్వారా చంద్రబాబు పేరు చరిత్రలో నిలిచిపోతుంది. మా నాన్న కల చంద్రబాబు ద్వారా సాకారమైనందుకు సంతోషంగా ఉంది' అని సుబ్బయ్య కుమార్తె విలాసిని అన్నారు.


శ్రీశైలం జలాశయం నుంచి 2 టన్నెళ్ల ద్వారా వస్తున్న కృష్ణా జలాలు

రెండు టన్నెళ్ల నుంచి నీరు ముందుకొచ్చాక కలసి ఫీడర్ కాలువ నుండా ప్రవహిస్తున్న దృశ్యం..

ఫీడర్ కాలువ హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఎత్తి నీటి విడుదల

# మాచర్లలో బంగ్లాదేశీ

- 'సర్' ప్రక్రియతో 34 ఏళ్ల తర్వాత వెలుగులోకి..
- అక్రమంగా చొరబడి ఆయుర్వేద వైద్యునిగా చలామణి
- మాచర్ల అడ్రస్‌తోనే పాస్‌పోర్టు, ఆధార్, పాన్
- కోల్‌కతా వాసినని స్థానికులకు తెలిపిన వైనం
- వెరిఫికేషన్‌లో బయటపడిన బంగ్లా మూలాలు
- బెదిరించి ముడుపులు గుంజిన పోలీసులు..
- విషయం బయటపడటంతో సస్పెన్షన్ వేటు

మాచర్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల లో ఆయుర్వేద వైద్యునిగా అందరికీ తెలిసిన వ్యక్తి చివరకు బంగ్లాదేశ్ వాసిగా తేలడం కలకలం రేపింది. దాదాపు 34 ఏళ్ల క్రితం బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా దేశంలోకి చొరబడ్డాడు. మొలల వైద్యం చేస్తూ మాచర్లలో కుటుంబంతో స్థిరపడ్డాడు. ఎన్నికల ప్రత్యేక, సవరణ ప్రక్రియ (సర్)లో భాగంగా తాజాగా జరిపిన తనిఖీల్లో ఈయన విషయం బయటపడింది. ఆ వివరాల్లోకి వెళితే.. ఎంకే రాయ్ 1992లో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా దేశంలోకి ప్రవేశించారు. అటు తిరిగి ఇటు తిరిగి చివరకు మాచర్ల చేరుకున్నారు. ఆయుర్వేద వైద్యం చేస్తూ చిన్నగా పేరు, పరపతి పెంచుకున్నారు. పట్టణంలో ఆర్థికంగా బలపడ్డారు. తాను పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా నుంచి వచ్చానని రాయ్ చెప్పేవారు. ఆధార్, పాన్ కార్డ్, పాస్‌పోర్టు, బ్యాంకు ఖాతాలు ఇక్కడే పొందారు. 'సర్' ప్రక్రియలో భాగంగా ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో స్థానికత కోసం పూర్వీకుల అడ్రస్ గురించి ఆరా తీసేందుకు రాయ్‌ను జిల్లా ఎస్పీ పిలిపించి విచారించారు. ఇదే సమయంలో రాయ్ పాస్‌పోర్టు రెన్యువల్‌కు వచ్చింది. ఈ క్రమంలో నరసరావుపేట స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు విచారించగా, ఆయన బంగ్లాదేశ్ హిందువు అని బయటపడింది. అయితే, రాయ్‌ను వారిద్దరు నరసరావుపేటకు పిలిపించి బేరసారాలు మొదలుపెట్టారు. వారికి రాయ్ భారీగా ముడుపులు చెల్లించారు. ఆ ఇద్దరికీ, కౌంటర్ ఇంటిలిజెన్స్ కానిస్టేబుల్‌కు మధ్య ముడుపుల పంపకాల్లో తేడాలు వచ్చాయి. ఈ క్రమంలో ఆ కానిస్టేబుల్ రాయ్‌ను మరింత డబ్బు డిమాండ్ చేశాడు. అందుకు ఆయన అంగీకరించకపోవడంతో గుట్టు బయటపెట్టేశాడు. కాగా, ముందు ఒక్కడిగా మాచర్లకు వచ్చిన రాయ్, ఇక్కడ తన కుటుంబాన్ని విస్తరించారు. బంగ్లాదేశ్ యువతిని పెళ్లాడి ఇక్కడకు తెచ్చారు. ఏడాది క్రితం అత్తను కూడా బంగ్లాదేశ్ నుంచి పిలిపించుకున్నారని చెబుతున్నారు. మరోవైపు, ఆ ఇద్దరు కానిస్టేబుళ్లను పోలీసు శాఖ సస్పెండ్ చేసింది.

## టాటా సంస్థకే సంజీవని ప్రాజెక్టు

- జీఎస్టీతో కలిపి రూ.415.36 కోట్లకు టెండరు ఖరారు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంజీవని ప్రాజెక్టు టెండరును టాటా ఎండీ (మెడికల్ అండ్ డయాగ్నోస్టిక్స్ లిమిటెడ్) సంస్థ దక్కించుకుంది. ఆరోగ్యశాఖ సెక్రటరీ వీరపాండియన్ నేతృత్వంలో సోమవారం సాయంత్రం జరిగిన బిడ్ ఫైనలైజేషన్ కమిటీ (బీఎఫ్‌సీ).. టెండర్ ప్రక్రియను పునఃపరిశీలించి టాటా ఎండీ సంస్థను ఎల్1గా ఎంపిక చేసినట్టు వెల్లడించింది. క్యూసీబీఎస్ (క్వాలిటీ అండ్ కాస్ట్ బేస్డ్ సెలెక్షన్) విధానంలో నిర్వహించిన టెండర్లల్లో టాటా ఎండీతో పాటు రైల్‌టెల్ సంస్థ పోటీలో నిలిచింది. రెండు కంపెనీల్లో టాటా సంస్థ అత్యధిక మార్కులు సాధించి సంజీవని ప్రాజెక్టును రూ.352 కోట్లకు దక్కించుకుంది. జీఎస్టీతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు రూ.415.36 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.

## మెడికో హత్య కేసులో నిందితులకు బెయిల్ నిరాకరణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మెడికో ప్రియాంక హత్య కేసులో నిందితులకు న్యాయస్థానంలో చుక్కెదురైంది. రాజమహేంద్రవరంలో ఆగస్టు 3వ తేదీ రాత్రి ప్రియాంక హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్‌లను పోలీసులు అరెస్టు చేయగా.. వారు ఆగస్టు 20న తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఆగస్టు 24న విచారణ జరిగింది. పిటిషన్‌ను తిరస్కరించినట్టు న్యాయస్థానం సోమవారం స్పష్టం చేసింది.

# 20 ఎంపీ సీట్లు కూటమివే!

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే.. వైసీపీ 5 స్థానాలకే పరిమితం
- చంద్రబాబుపై పెరిగిన విశ్వాసం
- ఇండియా టుడే, సీ ఓటర్ సర్వే

న్యూఢిల్లీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఇప్పటికిప్పుడు పార్లమెంటు ఎన్నికలు జరిగితే 25 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ నేతృత్వంలోని అధికార కూటమి 20 స్థానాల్లో జయభేరి మోగించనుందని ఇండియా టుడే, సీ ఓటర్ సర్వే స్పష్టం చేసింది. ఇటీవల నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే వివరాలను తాజాగా వెల్లడించింది. అయితే.. కూటమి 20 సీట్లు గెలుచుకున్నప్పటికీ వీటిలో బీజేపీ మూడు నుంచి ఒక స్థానానికి పడిపోనుందని సర్వే పేర్కొంది. టీడీపీ, జనసేన తమ సంఖ్యాబలాన్ని 18 నుంచి 19 సీట్లకు పెంచుకుంటాయని తెలిపింది. మిగిలిన ఐదు స్థానాల్లో వైసీపీ గెలిచే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, 20 స్థానాల్లో కూటమి విజయం సాధించడానికి ప్రజలకు సీఎం చంద్రబాబుపై ఉన్న విశ్వాసమే ప్రధాన కారణమని సర్వే తెలిపింది. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని, దీంతో ప్రభుత్వంపై ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదని సర్వే పేర్కొంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకతా లేదని వెల్లడించింది. కాగా, 2024 పార్లమెంటు ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి 21 లోక్‌సభ స్థానాల్లో విజయం దక్కించుకున్నాయి. వైసీపీ కేవలం 4 స్థానాల్లోనే గెలుపు గుర్రం ఎక్కింది.

**తెలంగాణలో..:** తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే అధికార కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమికి, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకి మధ్య ప్రధాన పోటీ ఉంటుందని 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే తెలిపింది. మొత్తం 17 పార్లమెంటు స్థానాల్లో ఎన్డీయే 9 సీట్లు దక్కించుకుంటుందని పేర్కొంది. అదేసమయంలో ఇండియా కూటమి 4 సీట్లకే పరిమితం కానుందని వెల్లడించింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ బలం మరింత తగ్గిపోయిందని సర్వే అంచనా వేసింది.

# ఆ సంఘం నేత శాసిస్తాడు

(మొదటి పేజీ తరువాయి)

తహశీల్దార్లుగా పదోన్నతులు ఇచ్చి ఆ తర్వాత పోస్టింగ్‌లు ఇచ్చింది. ఇదంతా ఓటర్ల 'సర్' ప్రక్రియ ప్రారంభానికి ముందే జరిగింది. ఇంకా కోర్టు ఆదేశాల మేరకు 2018-2024 సంవత్సరాల డీటీల సీనియారిటీని ఖరారు చేయాలి. ఆ తర్వాతే పదోన్నతులు ఇవ్వాలి. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు 2024 వరకు డీటీల సీనియారిటీని ఖరారుచేసిన తర్వాతే పదోన్నతులు ఇవ్వాలి. ప్రస్తుతం పదోన్నతులు, బదిలీలపై నిషేధం అమల్లో ఉంది. సర్ ప్రక్రియ పూర్తవ్వడానికి ఇంకా నెలన్నర సమయం ఉంది. ఈలోగా రెగ్యులర్ పదోన్నతులు, బదిలీలు చేపట్టకూడదని ప్రభుత్వం భావిస్తోంది.

### సంఘం నేత కోసం అధికారి ఆరాటం

రెవెన్యూ శాఖలో ఓ ఉద్యోగ సంఘం నేత తన అనుయాయులకు పదోన్నతులు ఇప్పించేందుకు ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. సంఘంలో కార్యవర్గ సభ్యులుగా, జిల్లాల్లో క్రియాశీలక సభ్యులుగా ఉన్న 28 మంది డిప్యూటీ తహశీల్దార్లకు ఉన్నపళంగా తహశీల్దార్ పదోన్నతులు ఇప్పించేందుకు మంత్రాంగం నడుపుతున్నారు. భూ పరిపాలనా ప్రధాన కమిషనరేట్ (సీసీఎల్ఏ)లో ఉన్న ఓ మధ్యస్థాయి అధికారి ద్వారా పదోన్నతుల ఫైలును కదిలించారు. ఎనిమిదేళ్లుగా ఆయన అక్కడే పని చేస్తున్నారు. రెవెన్యూ విభాగం నుంచే ఆయన డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది అక్కడే తిష్ట వేశారు. ఒక అధికారి ఎనిమిదేళ్లుగా ఎలాంటి బదిలీ లేకుండా, కనీసం సెక్షన్ మార్పు లేకుండా ఒకేచోట పనిచేస్తున్నారంటే కారణం ఆ ఉద్యోగ సంఘం నేత సొంత మనిషి కావడమే. ఆయనపై ఎన్ని ఆరోపణలు, తీవ్రమైన అభియోగాలు వచ్చినా విచారణ, చర్యలు లేవు. ఈయనే ఇప్పుడు పదోన్నతుల ఫైలు కదిలించారు. 28 మంది డీటీల్లో 18మంది ఓ ఉద్యోగ సంఘంలో కార్యవర్గ సభ్యులు. మిగిలిన వారిలో ఆరుగురు సంఘం పరిధిలో జిల్లాల్లో క్రియాశీలక సభ్యులుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు వీరిని సత్వరం తహశీల్దార్లుగా చేసి వారు కోరుకున్న చోట్ల పోస్టింగ్ ఇప్పించాలని ఆ ఉద్యోగ నేత తపనపడుతున్నారు. నిబంధనలు అంగీకరించవని తెలిసినా, ఓ ఉన్నతాధికారి దీనిపై అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చారు. దీంతో పదోన్నతుల వ్యవహారం రచ్చకెక్కింది.

### అనుమతి లేకుండానే...

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం డీటీల సీనియారిటీ ఖరారయ్యాకే పదోన్నతులు చేపట్టాలి. ఈ విషయాన్ని ఇప్పటికే రెవెన్యూశాఖకు జీఏడీ, ఆర్థికశాఖలు పలుమార్లు స్పష్టం చేశాయి. అప్పుడు రెవెన్యూశాఖ ఏం చేయాలి? ఇటు ప్రభుత్వ ఆదేశాలు, అటు కోర్టు ఉత్తర్వుల మేరకు ముందు డీటీల సీనియారిటీని 2017-18 నుంచి 2024 వరకు ఖరారు చేయాలి. కానీ ఇప్పటి వరకు ఆ పనే పూర్తి చేయలేదు. సీనియారిటీ లేకుండా డీపీసీ పెట్టాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఇప్పటికే రెండుసార్లు రెవెన్యూశాఖ ప్రతిపాదించినా అనుమతులు రాలేదు. సరిగ్గా ఈ సమయంలోనే ఉద్యోగ సంఘం నేత, ఆయన సొంతమనిషి అయిన అధికారి ఈ వ్యవహారాన్ని కదిలించారు. కేవలం రెవెన్యూశాఖ కార్యదర్శికి ఫైలు పంపి అనుమతి తీసుకొని డీపీసీకి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారి కూడా సానుకూలంగా స్పందించి డీపీసీకి ఆగస్టు 31 డేట్ అని అధికారికంగా అనుమతిచ్చారు. దీంతో సీసీఎల్ఏలో సంఘం నేత ఆశీస్సులున్న ఓ మధ్యస్థాయి అధికారి కేంద్రంగా బేరసారాలు కూడా మొదలైనట్లు తెలిసింది. తమ పేరు కూడా పదోన్నతి జాబితాలో ఉంచాలని జిల్లాల నుంచి ఆశావహులు అనేక మార్గాల్లో ఆ అధికారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇదే అదనుగా పని కావాలంటే ఆయన్ను కలవాలని సంఘం నేత కూడా ఆశావహులకు చెప్పినట్లుగా అధికారవర్గాలు బాహటంగానే చెబుతున్నాయి.

### సీనియారిటీ లేకుండా పదోన్నతులు తప్పుకాదా?

హైకోర్టు ఆదేశాల మేరకు సీసీఎల్ఏ కార్యాలయం తొలుత డిప్యూటీ తహశీల్దార్ల సీనియారిటీ ఖరారు చేయాలి. ఆ తర్వాత సీనియారిటీ ఆధారంగా డీటీలకు పదోన్నతి ఇవ్వాలి. కానీ, రెవెన్యూశాఖ డీటీల సీనియారిటీ ఖరారు చేయకుండా, ప్రభుత్వ ఆమోదం తీసుకోకుండానే డీపీసీకి పదేపదే ప్రభుత్వ అనుమతులు కోరుతోంది. ఇందులోని ఆంతర్యం ఏమిటి... ఇలా చేయడం సరికాదని ఉన్నతాధికారులకు తెలియదా... అనే చర్చ జరుగుతోంది.

## సెప్టెంబరులోనూ తక్కువ వర్షపాతమే!

- మధ్య కోస్తా, సీమలోని కొద్దిప్రాంతాల్లో మాత్రమే సాధారణ వర్షాలు: ఐఎండీ

విశాఖపట్నం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతోంది. రుతుపవనాల సీజన్‌లో చివరి నెల అయిన సెప్టెంబరులో కూడా రాష్ట్రం, దేశంలోని అనేక ప్రాంతాల్లో దీర్ఘకాలిక సగటులో 91 శాతం వర్షపాతం నమోదుకానుంది. గత మూడు నెలల కాలంలో సాధారణం కంటే 53.7 శాతం తక్కువ వర్షపాతం నమోదవడంతో రాష్ట్రంలో ఖరీఫ్ సాగు బాగా దెబ్బతింది. సెప్టెంబరు కూడా రైతులకు నిరాశే మిగల్చనుంది. దేశవ్యాప్తంగా సెప్టెంబరులో వర్షాలు, ఉష్ణోగ్రతలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సోమవారం అంచనా బులెటిన్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలోని మధ్య కోస్తా.. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, పల్నాడు, రాయలసీమలో ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సాధారణం లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనావేసింది. మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లోనూ సెప్టెంబరులో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకానుంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, దక్షిణ బిహార్, కశ్మీర్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, కొన్ని ఈశాన్య రాష్ట్రాలు, దక్షిణాదిలోని కొద్ది ప్రాంతాల్లో మాత్రం సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మధ్యభారతంలో ఎక్కువ రాష్ట్రాల్లో మంచి వర్షాలు కురవడం కొంత ఊరటనిచ్చినా బిహార్, ఏపీ, ఉత్తర కర్ణాటక, దక్షిణ తెలంగాణ, మరాట్వాడ, తమిళనాడు, కేరళలో కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆగస్టులో సాధారణం కంటే 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని ఐఎండీ తెలిపింది. ఈ నేపథ్యంలో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో మరింత తీవ్రంగా మారనున్నదనే సంకేతాలు ఆందోళన కలిగిస్తున్నాయని నిపుణులు వ్యాఖ్యానించారు. ముఖ్యంగా నీటి వనరులు, జల విద్యుత్ ఉత్పత్తి, తాగునీరు లభ్యత, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపనుందన్నారు. అయితే హిందూ మహాసముద్రంలో తటస్థంగా ఉన్న ఐవోడీ సెప్టెంబరులో పాజిటివ్‌గా మారి దక్షిణాదిలో వర్షాలు పెరుగుతాయని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు.

## సీఎం చైర్మన్‌గా వన్యప్రాణుల సంరక్షణ స్టీరింగ్ కమిటీ

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణ కోసం ముఖ్యమంత్రి (చైర్‌పర్సన్‌గా) అధ్యక్షతన రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీకి అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి, పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి, గిరిజన, సాంఘీక సంక్షేమ శాఖల కార్యదర్శులు సహా పలువురు సభ్యులుగా నియమితులయ్యారు. చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

### హస్తకళాకారులకు రాయితీపై కలప

రాష్ట్రంలో క్రాఫ్ట్ ఉడ్ బ్యాంకుల ప్రోగ్రాం కింద సంప్రదాయ చేతివృత్తిదారులకు రాయితీ ధరపై హస్తకళల కలప సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ధరల ఖరారుకు రాష్ట్ర అటవీశాఖ ముఖ్యసంరక్షణాధికారి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసింది. బురూడ్ సొసైటీలకు వెదురు సరఫరా విధానం ప్రకారమే హస్తకళల కలప ధర నిర్ణయించడంలోనూ అనుసరించాలని కమిటీ సూచించింది. దీంతో బురూడ్ సొసైటీలకు వెదురు సరఫరాలో లెక్కిస్తున్న వాస్తవ ఖర్చుల ఆధారంగా హస్తకళల కలప ధరలకూ నిర్ణయించేలా పీసీసీఎఫ్‌కు అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## వెలిగొండకు వైఎస్సార్ వెలుగు.. చంద్రబాబు చీకటి: షర్మిల

అమరావతి ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వెలిగొండకు వైఎస్ఆర్ వెలుగైతే.. సీఎం చంద్రబాబు చీకటి అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. సోమవారం వెలిగొండ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రారంభించిన సందర్భంగా ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. వెలిగొండపై చంద్రబాబు కొండంత అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. వెలిగొండ పనులు 82 శాతం వైఎస్ఆర్ హయాంలోనే పూర్తయ్యాయని అన్నారు. కేవలం పది శాతం పనులు చేసి సంకల్పం సాకారం అంటూ చంద్రబాబు డబ్బా కొడుతున్నారని విమర్శించారు.

## 4 జిల్లాల్లో పిడుగుల ఉపశమన ప్రాజెక్టు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పిడుగుల నుంచి రక్షణ కల్పించే ఉపశమన ప్రాజెక్టు (ఎంపీఎల్ఎస్) కోసం 2026-27 బడ్జెట్ కింద ఎన్డీఎంఎఫ్, ఎస్డీఎంఎఫ్ వాటాలతో కలిపి రూ.11.77కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థకు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## వ్యవసాయశాఖలో పదోన్నతులు, బదిలీలు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో నలుగురు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా తాత్కాలిక పద్ధతిలో పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు డీడీఏ బి.శ్రీనివాసును విజయనగరం జేడీఏగా, విశాఖ డీడీఏ కె.అప్పలస్వామిని అనంతపురం ఆత్మ పీడీగా, ప్రకాశం డీడీఏ ఎం.రజనీకుమారిని మైనార్టీ సంక్షేమశాఖలో, హెడ్‌ఆఫీస్‌లోని డీడీఏ డి.సునీతను పశ్చిమగోదావరి జేడీగా నియమించారు. కాగా, విజయనగరం జేడీఏ వి.టి.రామారావును కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారిగా బదిలీ చేయగా, ఏపీమార్క్‌ఫెడ్‌లో జనరల్ మేనేజర్‌గా ఉన్న జేడీఏ జి.లక్ష్మణకుమార్‌ను గుంటూరు జిల్లా ఆత్మ పీడీగా బదిలీ చేస్తూ వేర్వేరు ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో ఉద్యోగ విరమణ పొందిన పలువురిని పునర్నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఐదుగురిని పూర్వపు స్థాయికి మార్చగా, ఏడుగురికి పునర్నియామకం ద్వారా పోస్టింగ్‌లు ఇచ్చారు.

## 212 కోట్లతో లోక్‌భవన్

- అమరావతిలో నిర్మాణానికి నిధుల విడుదల
- గవర్నర్ నివాసం, కార్యాలయం, అసెంబ్లీ దర్బార్
- అదే కాంపౌండ్‌లో సిబ్బంది క్వార్టర్లు కూడా

గుంటూరు(రాజధాని), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో గవర్నర్ అధికారిక నివాసం లోక్‌భవన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.212.22 కోట్ల నిధులు విడుదల చేసింది. ఇందులో గవర్నర్ భవనం, అసెంబ్లీ దర్బార్ హాలు, గవర్నర్ కార్యాలయం, 2 అతిథి గృహాలు, 6 అధికారుల క్వార్టర్లు, 10 సీనియర్ సిబ్బంది క్వార్టర్లు, 12 జూనియర్ సిబ్బంది క్వార్టర్లు, 40 సహాయక సిబ్బంది క్వార్టర్లతోపాటు 144 బ్యారక్ వసతి సామర్థ్యంతో కూడిన బ్యారక్‌లు, 4 సెంటినెల్ పోస్టులతో కూడిన సరిహద్దు రక్షణ (ప్రహరీ) గోడ ఉంటాయి. ఏపీసీఆర్డీఏ ఈ నిర్మాణాన్ని చేపట్టనుంది. దీనికి సంబంధించి 2025 అక్టోబరులోనే జీవో ఆర్‌టీ నంబర్ 1115 ద్వారా రాష్ట్ర పురపాలక శాఖ పరిపాలనా అనుమతులు జారీ చేసింది.

# రేపే అనకాపల్లికి గోదారి!

గోదావరి నీటిని అనకాపల్లి తరలించేందుకు తుని దగ్గర తాండవ నదిపై నిర్మించిన అక్విడెక్టు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలు అనకాపల్లి వరకు ఉరకలు వేయనున్నాయి. బుధవారం పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా తుని సమీపంలో నర్సీపట్నం రోడ్డును క్రాస్ చేస్తూ నిర్మించిన అక్విడెక్టు నుంచి సీఎం చంద్రబాబు నీరు విడుదల చేయనున్నారు. దీంతో ఎన్నో దశాబ్దాలుగా ఉత్తరాంధ్రవాసుల స్వప్నంగా మారిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి తొలి అడుగు పడనుంది. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 36 ప్రాజెక్టులను 2028నాటికి పూర్తి చేయాలని సంకల్పించిన చంద్రబాబు.. ఒక్కో ప్రాధాన్య ప్రాజెక్టునూ క్రమంగా పూర్తి చేస్తూ వస్తున్నారు. హంద్రీ-నీవా విస్తరణ పనులను రికార్డు స్థాయిలో 100 రోజుల్లోనే పూర్తిచేయించి.. అనంతపురం, చిత్తూరు జిల్లాలకు కృష్ణా జలాలు తరలించారు. దుర్భిక్షం కోరల్లో నలిగిపోతున్న ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు సాగు, తాగునీటితో పాటు ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపే వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను సోమవారం ప్రారంభించారు. గోదావరి జలాలు తమ ప్రాంతంలో పారాలన్న ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛను బుధవారం తీర్చనున్నారు. ఆ రోజు ఆయన తుని-నర్సీపట్నం రహదారిపై నిర్మించిన అక్విడెక్టు వద్ద గోదావరికి జల హారతి ఇస్తారు. తర్వాత అక్విడెక్టు గేట్లను ఎత్తి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేస్తారు. ఇవి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరుకుంటాయి. మొదటి దశలో 30 టీఎంసీల నీటిని అనకాపల్లి తరలిస్తారు. తూర్పు గోదావరి జిల్లా పురుషోత్తపట్నం పంప్‌హౌస్ నుంచి పోలవరం ఎడమ కాలువలోకి నీళ్లు ఎత్తిపోస్తారు.

### ఇవీ లాభాలు..

అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలను విడుదల చేయడం వల్ల 110 చెరువులు నిండుతాయి. 1,48,000 ఎకరాలకు సాగునీరు దక్కుతుంది. పోలవరం ఎడమ కాలువతో ఏలేరు నది అనుసంధానం కావడం వల్ల ఏలేరు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. ఫలితంగా పిఠాపురం బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు పరిధిలోని 80,700 ఎకరాలు, పంపా ఆయకట్టు పరిధిలో 12,000 ఎకరాల స్థిరీకరణ జరుగుతుంది. తాండవ, వరాహ, మావిడివాక గెడ్డ (శారదా నది) కూడా అనుసంధానం కావడం వల్ల పాయకరావుపేట, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని చెరువులన్నీ నిండుతాయి. 46,620 ఎకరాలకు సాగు నీందుతుంది. మొత్తంగా అనకాపల్లి దాకా గోదావరి జలాల చేరిక ద్వారా 2,87,320 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. అలాగే 143 గ్రామాలకు చెందిన 4.23 లక్షల మందికి తాగునీరందుతుంది.

- 2004-14 మధ్య 1006.71 కోట్లు నిర్మాణ పనులకు, రూ.400.62 కోట్లు భూసేకరణ, పునరావాసం కోసం ఖర్చు చేశారు.
- 2014-19 మధ్య నిర్మాణ పనులకు రూ.923.60 కోట్లు, భూసేకరణ, పునరావాసానికి 193 కోట్లు ఖర్చు చేశారు.
- 2019-24 మధ్య జగన్ హయాంలో రూ.398 కోట్లు మాత్రమే ఇచ్చారు.
- చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక ఈ రెండేళ్లలో రూ1270 కోట్లు వ్యయం చేశారు.
- తొలి దశలో ఎడమ కాలువ నుంచి అనకాపల్లి వరకు గోదావరి జలాలు 162 కిమీ ప్రయాణిస్తాయి.
- మలి దశలో విశాఖకు నీరిచ్చే క్రమంలో మేహాద్రిగెడ్డ వరకు 45 కిమీ మేర పనులను వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తిచేస్తారు.
- అనకాపల్లి నుంచే ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అడుగులు పడనున్నాయి. విశాఖకు.. అక్కడి నుంచి విజయనగరం జిల్లా గడిగెడ్డ వరకు 128 కిమీ మేర గోదావరి జలాలను తరలించడంతో ఈ పథకం పూర్తవుతుంది. రూ.17,050 కోట్ల వ్యయమవుతుందని తాజా అంచనా.

# అన్ని అంశాల్లో ప్రజల భాగస్వామ్యం!

- తద్వారా ప్రతి కార్యక్రమంలో సానుకూల ఫలితాలు
- భోగాపురం ఎయిర్‌పోర్టు, వెలిగొండ ప్రాజెక్టుల తరహాలో మున్ముందు మరింత కొనసాగాలి
- ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం, వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం పెద్దయెత్తున వచ్చిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దీనిని ఇతర అంశాలకూ వర్తింపచేయాలని, మున్ముందు అన్ని పథకాలకు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా నది జలాలు రావటంతో ప్రజల్లో ఎంతో ఆనందం వ్యక్తమైందని, ప్రతీ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తే సానుకూల ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. డేటా అనలిటిక్స్‌తో పౌరసేవలను మరింత సమర్థవంతంగా అందించాలని ఈ సందర్భంగా అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రత్యేకించి మహిళలపై నేరాలు, గంజాయి నియంత్రణ సహా వివిధ అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్దేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేశారు. సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పరిశుభ్రతపై ప్రజలకు మరింత లోతైన అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మెరుగ్గా శానిటేషన్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతినెలా మొదటి ఆదివారం నాడున విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి హాస్టళ్లలో పరిస్థితులు, ఆహారం, తాగునీరు తదితర అంశాలపై వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్న క్యాంటీన్ల ద్వారా దాతలు అన్నార్తులకు సాయం అందించే అంశాన్ని కూడా గుర్తించాలని పేర్కొన్నారు. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని లోటుపాట్లను సవరించుకోవాలని నిర్దేశించారు. బాధ్యులకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు ఇవ్వాలన్నారు.

### ఆన్‌లైన్ సేవలు మరింత విస్తృతం

ప్రభుత్వ శాఖలన్నీ ఆన్‌లైన్‌లో సేవలు అందించాలని, సమీకృత సేవల విధానం ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. రెవెన్యూ సహా వివిధ విభాగాలు అన్ని ధ్రువపత్రాలనూ ఆన్‌లైన్‌లో జారీచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 'అవేర్' ద్వారా రాష్ట్రంలో సాగు స్థితిపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు సూచనలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం పెంచేందుకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు ప్రస్తుతమున్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూమి నిరుపయోగంగా ఉండకూడదని, 5.70 లక్షల ఎకరాల్లో ప్రతి ఎకరాను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలని నిర్దేశించారు. సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## క్రమబద్ధీకరణ నిర్ణయం సర్కారుదే!

- ఆర్థిక పరమైన అంశాలూ ప్రభుత్వానివే
- విధి నిర్వహణలో భద్రత, గౌరవం కల్పిస్తాం
- ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీకి స్పష్టం చేసిన కమిషనర్ చక్రధర్‌బాబు
- ఉద్యోగుల సమస్యలపై ప్రాథమిక చర్చలు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించే అంశం ప్రభుత్వ పరిధిలో ఉంటుందని, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేసే విషయాన్ని సర్కారు దృష్టికి తీసుకువెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆ శాఖ కమిషనర్ చక్రధరబాబు తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవహారంపై.. సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ) ప్రతినిధులతో సోమవారం ఉన్నతాధికారులు ప్రాథమిక చర్చలు జరిపారు. తాడేపల్లిలోని సెకండరీ హెల్త్ కార్యాలయంలో జరిగిన చర్చల్లో కమిషనర్ చక్రధరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని జేఏసీ ప్రతినిధులు కోటేశ్వరరావు, అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. నైట్ డ్యూటీల్లోని స్టాఫ్ నర్సులకు భద్రత కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో ఉన్న వారి గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ డిమాండ్లపై స్పందించిన అధికారులు.. ఆర్థికేతర అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బదిలీల అంశంపై అంతర్గత కమిటీలో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. నైట్ డ్యూటీల్లోని స్టాఫ్‌నర్సులతో పాటు, సిబ్బందికి సురక్షిత, గౌరవప్రదమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఆర్థికపరమైన డిమాండ్లపై ప్రభుత్వ పరంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు. దీనిపై జేఏసీ ప్రతినిధులు స్పందిస్తూ.. ఈ నెల 8వ తేదీ నాటికి తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఆరోగ్య శాఖ కమిషనర్ చక్రధర్‌బాబుతో పాటు జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, డీహెచ్ పద్మావతి, డాక్టర్ రాధికారెడ్డి జేఏసీతో చర్చించారు.

## ఇజ్రాయెల్‌లో ఉద్యోగాలకు ఎస్సీ మహిళలకు శిక్షణ

- ఆరు ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాల కోసం ఎస్సీ యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇజ్రాయెల్ ఉద్యోగాలకు ఎంపికయ్యే అభ్యర్థుల్లో ఏఎన్ఎం, జీఎన్ఎం లేదా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన మహిళా ఎస్సీ అభ్యర్థులకు 100 రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో ఇంగ్లీషు భాషా ప్రావీణ్యంతో పాటు సీఈఎఫ్ఆర్-బీ 2 స్థాయి శిక్షణ, ఉద్యోగానికి అవసరమైన డొమైన్ స్కిల్స్ అందిస్తారు. ఇందుకోసం శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, వైఎస్ఆర్ కడప, అనంతపురం ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను గుర్తించారు.

## ఐదేళ్లు నిర్లక్ష్యం చేసి క్రెడిట్ కోసం పాకులాటా?: మండిపల్లి రాంప్రసాద్

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సీఎం చంద్రబాబు సంకల్పానికి నిదర్శనమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వెలిగొండతో కరవు ప్రాంత ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండనున్నాయి. గొడ్డలి పార్టీ పత్రికలో వెలిగొండపై క్రెడిట్ చోరీ అంటూ తప్పుడు కథనాలు రాయడం దుర్మార్గం. సీమకు చెందిన వాడైనా ఆ ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిన వ్యక్తి జగన్. విజయసాయిరెడ్డి, సజ్జల పరస్పర ఆరోపణలు చేసుకుంటూ జగన్ పాలన ఎంత నికృష్టంగా సాగిందో బయట పెడుతున్నారు' అని మండిపల్లి అన్నారు.

Printed and published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at "Aamoda Press" at Sy.No.239-2A, Bypass Road, Ananthapuramu -515 001, Cell No.9985411151, Editor: N.Rahul Kumar.
RNI No: APTEL/2003/10031 Managing Director : Vemuri Radha Krishna Founder : K.L.N.Prasad

**న్యూస్ బాక్స్**

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

**గుంతకల్లుటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద విద్యార్థినులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని కోరారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రమణ, అఖిల్, వినోద్, భరత్, మధు, రాజేష్, కమల్, సాయి పాల్గొన్నారు.

## రేపు క్రికెట్ పోటీలకు బాలికల ఎంపిక

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని రైల్వే క్రీడామైదానంలో బుధవారం గుంతకల్లు మండల బాలికల క్రికెట్ టాలెంట్ హంట్ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ క్రికెట్ కోచ్ ఇనయాతుల్లా, సీనియర్ కోచ్ గులాం ఖాదీర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బాలికలు పాల్గొనవచ్చు అన్నారు. అండర్-15, అండర్-18సంవత్సరాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేసుకోవాలని, వివరాలకు సెల్: 9701435534 సంప్రదించాలని తెలిపారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ కేసీ హరికుమార్

**గుంతకల్లుటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం పౌష్టికాహారం, జీవనశైలి రుగ్మతలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్ బాబు, అధ్యాపకులు వైశాలి, వరలక్ష్మి, మాధవీలత పాల్గొన్నారు.

### మున్సిపల్ ఇన్‌చార్జ్ డీఈఈగా హరికృష్ణ

**గుంతకల్లుటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):** గుంతకల్లు మున్సిపాలిటీలో ఏఈగా పని చేస్తున్న ఎన్.హరికృష్ణకు డీఈఈగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మున్సిపాలిటీలో డీఈఈ (ఎఫ్ఏసీ)గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## వర్షాలు కురవాలని భజనలు

భజనలు చేస్తున్న భక్తులు

**విడపనకల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** వర్షాలు కురవాలని మండలంలోని పెద్ద కొట్టాలపల్లి శివాలయంలో సోమవారం అఖండ సప్త భజనలు ప్రారంభించారు. ఆలయంలోని పాలరాతి శివలింగానికి ప్రత్యేక పూలతో అలంకరించారు. నవగ్రహాలను ఏర్పాటు చేసి భజనలు ప్రారంభించారు. ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ భజన కార్యక్రమంలో ఒక్కోరోజు ఒక భజన బృందం పాల్గొంటుందని గ్రామ పెద్దలు తెలిపారు.

## టీడీపీతోనే భరోసా

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న టీడీపీ నేతలు

**పామిడి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** తెలుగుదేశం పార్టీతోనే బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని పి.కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు చైర్మన్ బొల్లు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జింకల సంజీవకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన టీడీపీ కార్యకర్త శ్రీపురం మురళి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ప్రమాద బీమా ద్వారా వచ్చిన రూ.5లక్షలను మృతుడి కుమార్తెలు నిర్మల, లావణ్యకు అందించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మా మోహన్‌కృష్ణ, కుమార్, శివశంకర్, రాము, శ్రీరాములు, రాజు, సుంకప్ప, రామకృష్ణ, పురుషోత్తం పాల్గొన్నారు.

## రవిశంకర్ గురూజీని కలిసిన ఎమ్మెల్సీ

**ఉరవకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ చిట్టా శ్రీధర్ బెంగళూరు ఆశ్రమంలో సోమవారం కలిశారు. అనంతపురం నుంచి అపెక్స్ మెంబర్‌గా ఎన్నికైన చిట్టా శ్రీధర్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురం రావాలని గురూజీని కోరినట్లు వారు తెలిపారు.

గురూజీని కలిసిన ఎమ్మెల్సీ, మాజీ సర్పంచ్

# కందికి పెరిగిన ఆదరణ

● తగ్గుతున్న వేరుశనగ సాగు

● ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

**రాయదుర్గం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** సంప్రదాయంగా సాగుచేసే వేరుశనగ పంట విస్తీర్ణం క్రమంగా తగ్గుతుండగా.. కంది సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులు వాతావరణ పరిస్థితులు, పెట్టుబడి వ్యయం, దిగుబడులు, మార్కెట్ ధరలను బేరీజు వేసుకుని పంటల ఎంపికలో మార్పులు చేస్తున్నారు. దీంతో గతంలో ప్రధాన పంటగా ఉన్న వేరుశనగ స్థానంలో కంది తదితర ప్రత్యామ్నాయ పంటలు విస్తరిస్తున్నాయి. రాయదుర్గం మండలంలో గత ఏడాది 21,213 ఎకరాలలో వేరుశనగ పంటను సాగుచేశారు. కందిపంట 13,891 ఎకరాలలో సాగుచేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌సీజన్‌లో 14,625 ఎకరాలలో వేరుశనగ సాగుచేయగా.. 19,114 ఎకరాలలో కంది పంట వేశారు. గత ఏడాది కంటే ఈసారి కంది ఎక్కువగా సాగుచేశారు. వేరుశనగ సాగుకు విత్తనాలు, దుక్కులు, ఎరువులు, పురుగుల మందులు, కలుపు నివారణ, కూలీల ఖర్చు తదితర వాటిపై రైతులకు అధికంగా వ్యయమవుతోంది. వేరుశనగతో పోలిస్తే కందిపంటకు పెట్టుబడి భారం తక్కువగా ఉండటం, వర్షాధార ప్రాంతాల్లో సాగుకు అనుకూలత ఉండటంతో రైతులు అటువైపు మొగ్గు చూపుతున్నారు.

రాయంపల్లి వద్ద సాగుచేసిన కందిపంట

### వేరుశనగకు పెట్టుబడి ఎక్కువ

వేరుశనగ పంట సాగుచేయాలంటే పెట్టుబడి ఎక్కువ వస్తుంది. పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటోంది. పంట సాగుకు ఖర్చులు పెరిగాయి. దీంతో నాకున్న 10 ఎకరాలలో కంది పంటను సాగు చేశాను. పెట్టుబడి తక్కువగా ఉంటుంది. దీంతో పాటు వర్షం తక్కువగా ఉన్నప్పటికీ పంట దిగుబడి వస్తుందని కంది పంటను సాగుచేశాను.

-వెంకటేష్‌నాయక్, రైతు, ఆవులదట్ల

### 60 ఎకరాల్లో కంది సాగు చేశా

ప్రతి ఏటా వేరుశనగ పంట సాగచేస్తున్నారు. పంటకు ఖర్చులు ఎక్కువ కావడంతో గత రెండేళ్ల నుంచి నాకున్న 20 ఎకరాల పొలంలో కందిపంట సాగుచేశాను. ఈఏడది మరో 40 ఎకరాలు గుత్తకు తీసుకుని 60 ఎకరాల్లో కంది పంట సాగుచేశాను. వేరుశనగ సాగు కంటే కందిసాగులో ఖర్చు తక్కువ. దిగుబడితో పాటు ధర ఆశాజనకంగా ఉండడంతో కందిపంట సాగుచేశాను.

-జిలాన్, రైతు, జుంజురంపల్లి

## విద్యార్థినికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందిస్తున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్

**కళ్యాణదుర్గం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** శెట్టూరు మండల పరిధిలోని చెర్లోపల్లికి చెందిన షేక్ బాషా అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కుటుంబానికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ సోమవారం రూ.30 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. మృతి చెందిన షేక్‌బాషా పెద్ద కూతురు ఆర్షియా తిరుపతిలోని మోహన్ బాబు కళాశాలలో పారామెడికల్ కోర్సు చదువుతోంది. కళాశాల ఫీజు కట్టలేక చదువును మధ్యలోనే ఆపేసింది. ఈ నేపథ్యంలో కళాశాల ఫీజు భారాన్ని చెల్లించేందుకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. ఇందులో ట్రస్ట్ సభ్యులు వన్నూరుస్వామి రూ.16 వేలు, వెంకటేశులు రూ.5 వేలతో పాటు మిగిలిన ట్రస్టు సభ్యులందరూ కలిసి మొత్తంగా రూ.30 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఆ కుటుంబానికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### దాడి చేసిన వ్యక్తిపై కేసు

**బెళుగుప్ప, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు సోమవారం తెలిపారు. మండలంలోని శీర్పి సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు డ్రైవర్ లాలుస్వామిపై దాడి చేసిన విరుపాపల్లి మంజుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నారని ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేశామని తెలిపారు.

### రైల్వే రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

**గుత్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కేపీఎస్ వెంచర్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. విశ్రాంత రైల్వే ఉద్యోగి పురుషోత్తం పని నిమిత్తం వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాదుకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఇంటి తాళాలను పగలగొట్టి ఇంట్లో ఉన్న అర తులం బంగారు వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### ఘర్షణ కేసులో 8 మంది బైండోవర్

**తాడిపత్రి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో ఇటీవల ఘర్షణ జరిగిన నేపథ్యంలో సోమవారం పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సంబంధిత ఎనిమిదిమందిపై బైండోవర్ చర్యలు తీసుకున్నట్లు రూరల్ సీఐ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ సమక్షంలో ఒక్కొక్కరి నుంచి రూ.5లక్షల చొప్పున బాండ్లు తీసుకున్నట్లు తెలిపారు.

### క్యూఆర్ కోడ్ ద్వారా రేషన్ సరఫరా చేయలేం

**యాడికి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న క్యూఆర్‌కోడ్ విధానంలో రేషన్ సరఫరా చేయలేమని మండలంలోని రేషన్‌డీలర్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్ సరఫరాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రేషన్‌డీలర్లు మధురాజు, నరసింహచౌదరి, ఆదినారాయణ, సుభాన్, రంగస్వామి, రఫీ ఉన్నారు.

● **రాయదుర్గంరూరల్ :** స్టాక్ పాయింట్ నుంచి బియ్యాన్ని డీలర్లకు స్కాన్ ద్వారా సరఫరా చేయాలని డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సూర్యప్రతాప్‌కు వినతిపత్రం అందించారు. హమాలీలు సరఫరా చేసేటపుడు ప్రతి బ్యాగ్‌ను స్కాన్ చేసి ఇవ్వాలని కోరారు.

### డిజిటల్ లేబర్ చౌక్‌లో పేరు నమోదు చేసుకోండి

**గుత్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** భవన నిర్మాణ కార్మికులు తమ పేర్లను డిజిటల్ లేబర్ చౌక్ యాప్‌లో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారి వెంకటరాముడు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, గ్రానైట్ వర్కర్లు, కార్పెంటర్లు, పెయింటర్లు తమ మొబైల్ ఫోన్‌లో డీఎల్‌సీ డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

### ఘనంగా పల్లకి ఊరేగింపు

**కణేకల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలో వెలసిన చిక్కణ్ణేశ్వరస్వామి, సిద్ధప్పస్వామి పల్లకి ఊరేగింపును సోమవారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. శ్రావణ మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేషపూజలు చేసి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

### సంచార జాతులకు రిజర్వేషన్ అమలు చేయాలి

**గుంతకల్లుటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** సంచార జాతులను భారత రాజ్యాంగం మూడో షెడ్యూల్లో చేర్చి పది శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సంచార జాతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద సోమవారం సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుళ్లాయప్ప, జోగి వెంకటేష్, నాయకులు ఇంద్రాదేవి, వెంకటేష్, బాల, మహేష్, కాశన్న, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం మహిళల ఆందోళన

**విడపనకల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండలంలోని పాల్తూరు గ్రామంలో తాగు నీటి కోసం మహిళలు గ్రామ సచివాలయం చేరుకుని సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. దూదేకుల కాలనీ, ధర్మగడ్డ బావి లైన్, జంగమ వీధి, ఎస్సీ కాలనీకి 15 రోజులుగా తాగు నీరు రాలేదన్నారు. కొళాయిలకు వారం పది రోజులైనా తాగునీరు రావటం లేదని, అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పటించుకోలేదని అన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణంను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. బోర్లు వేయించి తాగునీరు అందిస్తామని, కొళాయిలకు నీరు వచ్చే ఏర్పాటు చేస్తామని అన్నారు. దీంతో మహిళలు వెనుతిరిగి పోయారు.

అధికారులతో మాట్లాడుతున్న మహిళలు

## టెట్ అర్హత మార్కులు తగ్గించాలి: యూటీఎఫ్

పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**ఉరవకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఇన్‌సర్వీసు టీచర్లకు టెట్ పరీక్షల్లో అర్హత మార్కులు తగ్గించాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రామప్ప చౌదరి కోరారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 3వ తేదీన విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు వారు బోధిస్తున్న సబ్జెక్టులలో మాత్రమే పరీక్షలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రఘు, ఇస్లాంబాషా, వేణు గోపాల్, శ్రీధర్, శ్రీనివాస్ గుప్తా, మోహన్, జగదీష్ పాల్గొన్నారు.

### లెక్చరర్ ఉద్యోగం సాధించిన యువకుడు

**యాడికి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రమైన యాడికికి చెందిన బండారు మణికంఠ అనే యువకుడు కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు. సోమవారం ఆయన ఉద్యోగంలో చేరినట్లు రిపోర్ట్ చేసుకున్నాడు. ఆయన పదో తరగతి వరకు యాడికిలో చదివాడు. కర్నూలులో ఇంటర్, తిరుపతి శ్రీ వెంకటేశ్వరలో డిగ్రీ, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాడు. 2023లో ఏపీపీఎస్సీ పరీక్షలో అర్హత పొంది ఉద్యోగం సాధించాడు. సోమవారం కుప్పం డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్‌గా బాధ్యతలు తీసుకున్నాడు.

## పాఠశాలకు డెస్కుల వితరణ

డెస్కులను అందిస్తున్న విర్బాక్ సంస్థ ప్రతినిధులు

**కణేకల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.1.13 లక్షల విలువైన 26 డెస్కులను అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ శ్రీనివాస్ కూడేరు ప్రభుత్వ పశువైద్యశాలలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఆయన విర్బాక్ సంస్థ ప్రతినిధులను సంప్రదించి డెస్కుల వితరణ చేయాలని కోరారు. ఆ సంస్థ రీజనల్ డైరెక్టర్ రవికుమార్ ప్రతినిధి తిరుపాల్‌రెడ్డి డెస్కులను సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

● **రాయదుర్గంరూరల్ :** మండలంలోని ఆవులదట్ల తండా ప్రభుత్వ పాఠశాలకు 15 బెంచీలు వితరణ చేసినట్లు పశువైద్యుడు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆవులదట్ల తండా పాఠశాలలో సమావేశం నిర్వహించి విద్యార్థులకు విర్బాక్ యానిమల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆర్థిక సహకారంతో రూ. 60 వేలు విలువైన 15 బెంచీలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు మహమ్మద్ ఇర్షాద్ బాషా, అబ్దుల్ బారి, విర్బాక్ రీజనల్ మేనేజర్ రవికుమార్, హెచ్ఎం శివప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

### గుండెపోటుతో అటెండర్ మృతి

శ్రీనివాసులు మృతదేహం

**కణేకల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు(56) గుండెపోటుతో మృతి చెందాడు. కళ్యాణదుర్గానికి చెందిన శ్రీనివాసులు మోడల్‌స్కూల్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో గత 12 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధుల్లో భాగంగా పాఠశాలకు వచ్చిన ఆయన ఆకస్మాత్తుగా కుప్పకూలిపోవడంతో తోటి సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ-2 భవానీశంకర్, ప్రిన్సిపాల్ రెహనాబేగం, సిబ్బంది సంతాపం తెలిపారు.

### కండీషన్ బస్సు నడపాలి

**యాడికి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఆదర్శ పాఠశాలకు వెళ్లే విద్యార్థుల కోసం కండీషన్‌లో ఉన్న బస్సును ఏర్పాటు చేయాలని సోమవారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలపరిమితి ముగిసిన బస్సుతో ఆదర్శపాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్టీసీ అధికారులు తగు చర్యలు చేపట్టి మంచి కండీషన్ ఉన్న బస్సును ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం: విప్

దర్గాహొన్నూరులో ఇంటింటికీ టీడీపీలో పాల్గొన్న విప్ కాలవ శ్రీనివాసులు

**బొమ్మనహాళ్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** వైసీపీ పాలనలో నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని విమర్శించారు. హామీలను అమలు చేయడంతో పాటు గత పాలనలో దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, కేశవరెడ్డి, బలరామిరెడ్డి, తిమ్మరాజు, మహేంద్ర, కేశప్ప, వన్నూరుస్వామి, సుదర్శన్, సోమనాథ్‌గౌడ్, బసప్ప, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

### దర్గా హొన్నూరులో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

బొమ్మనహాళ్ మండలంలోని దర్గా హొన్నూరు గ్రామంలో సోమవారం వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్థులు, వాల్మీకి సంఘం నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కురుబలకు ప్రాధాన్యమివ్వండి

మంత్రిని సన్మానిస్తున్న కురుబ సంఘం నాయకులు

**ఉరవకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుబలకు ప్రాధాన్యం ఇవ్వాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. అనంతపురంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కురుబ సంఘం నాయకులు కలిశారు. కురుబ కులస్థుల సమస్యలపైన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ హయాంలోనే బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బ్యాళ్ల ఈశ్వరయ్య, తిమ్మప్ప, మహేష్, గణేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు ఘనంగా వీడ్కోలు

కమిషనర్‌ను సన్మానిస్తున్న వెంకటశివుడు యాదవ్

**గుత్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న జబ్బర్‌మియా సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, నాయకులు మైనుద్దీన్, ఎంకే చౌదరి, ప్రతాప్, సుధాకర్ నాయుడు, నరేంద్ర చౌదరి, న్యాయవాది సోమశేఖర్, గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్ భాస్కర్, మున్సిపల్ మేనేజర్ రాంబాబు, డీఈ హేమచంద్ర పాల్గొన్నారు.

## సేవలతోనే గుర్తింపు

ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**రాయదుర్గంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** ఉత్తమ సేవలు అందించినపుడే ప్రతి ఉద్యోగికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని డిప్యూటీ డీఈవో లక్ష్మన్న పేర్కొన్నారు. సోమవారం మండలంలోని 74. ఉడేగోళం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఫణీంద్రనాథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫణీంద్రనాథ్ దంపతులను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మహమ్మద్ ఇర్షాద్, అబ్దుల్‌బారి, స్కూల్ కమిటీ చైర్మన్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### ఓట్ల తొలగింపుపై చర్యలు తీసుకోండి

**యాడికి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** రాయలచెరువులో 35 మంది ముస్లింల ఓట్లను తొలగించాల్సిందేనని బీఎల్‌వోలపై ఒత్తిడి తీసుకువచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ముస్లింలతో కలిసి వైసీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. రాయలచెరువు గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉన్న 35 మంది ముస్లింల ఓట్లను తొలగించాలని రాజకీయ పార్టీకి ఒక బీఎల్ఏ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం తగదని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, నాయకులు నాగేష్, నాగేంద్రరెడ్డి, రషీద్, ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

### చెరువులకు నీరివ్వాలని ఆందోళన

**వజ్రకరూరు (ఉరవకొండ), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):** చెరువులకు నీళ్లు ఇవ్వాలని కోరుతూ రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు హంద్రీనీవా కాలువ వద్ద ఉరవకొండ- గుంతకల్లు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న సీఐ మహానంది, హెచ్ఎన్ఎస్ఎస్ ఏఈ గౌస్ బాషా అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. నీళ్ల విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రోడ్డుపై బైఠాయించిన రైతులు